

భర్తృహరి నీతి శతకము
రూ॥40/-
పేజీలు:48
నవచేతన పబ్లిషింగ్ హౌస్
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్),
హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(అబిడ్స్),హిమాయత్‌నగర్,
కొండాపూర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్
హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★



ఢిల్లీ విశ్వవిద్యాలయంలో చల్లారని నిరసన జ్వాల

భారత్ – అమెరికా మధ్య వ్యూహాత్మక భాగస్వామ్య చర్చలు

కృష్ణానది జలాల కేటాయింపుల్లో రాష్ట్రానికి అన్యాయం జరగనివ్వబోం

లోపలి పేజీల్లో



సంపుటి 08, సంచిక: 77 | శుక్రవారం | 14-02-2025 | కరీంనగర్ Published from: Karimnagar, Hyderabad, Khammam, Mahabubnagar పేజీలు: 12+8 | వెల రూ. 5.00





## కృత్రిమ మేధతో

# విప్లవాత్మక మార్పులు

### భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా ప్రజా సేవలు : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

గచ్చిబౌలిలో మైక్రోసాఫ్ట్ నూతన క్యాంపస్ ప్రారంభోత్సవం

యువతకు మరిన్ని ఉద్యోగాలొస్తాయని సిఎం ధీమా

ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి/ హైదరాబాద్

అత్యాధునిక ఎఐ టెక్నాలజీ ద్వారా కీలక రంగాలలో విప్లవాత్మక మార్పులు తీసుకురావాలని లక్ష్యంగా ఎంచుకున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. మెరుగైన పాలన, ఆర్థిక పురోగతితో పాటు ప్రజా సేవలను భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దాలని భావిస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఐటి ప్రరిశ్రమల శాఖ మంత్రి, రంగారెడ్డి జిల్లా ఇంచార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు,స్థానిక ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ, మైక్రోసాఫ్ట్ సంస్థ ప్రతినిధులతో కలిసి జ్యోతి ప్రజ్వల చేసి మైక్రోసాఫ్ట్ నూతన క్యాంపస్‌ను ప్రారంభించారు. అదే విధంగా టిహబ్‌లో గురువారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు గూగుల్ ప్రతినిధులతో సమావేశమై గూగుల్‌తో అవగాహన ఒప్పందం కుదుర్చున్నారు. కాగా, గచ్చిబౌలిలో మైక్రోసాఫ్ట్ సంస్థ నూతన క్యాంపస్‌ను ప్రారంభించిన అనంతరం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ మైక్రోసాఫ్ట్ విస్తరణతో తెలంగాణలోని యువతకు మరిన్ని ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని చెప్పారు. హైదరాబాద్‌లో ఎఐ సెంటర్ ఏర్పాటుకు సంస్థ ప్రతి నిధులతో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుందని చెప్పారు.హైదరాబాద్ జర్నీలో మైక్రోసాఫ్ట్ నూతన క్యాంపస్ ప్రారంభం మరో మైలురాయి అని పేర్కొన్నారు. హైదరాబాద్‌లో మైక్రోసాఫ్ట్ సంస్థకు సుదీర్ఘ అనుబంధం ఉందన్నారు. భవిష్యత్ అంతా ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ)దే అని సిఎం తెలిపారు. మైక్రోసాఫ్ట్ కృషిలో 500 పాఠశాలల్లో కృత్రిమ మేధస్సును వినియోగిస్తూ బోధన కొనసాగుతోందన్నారు. మైక్రోసాఫ్ట్ సంస్థ భారత్‌కు వచ్చి ఇటీవలే 25 వసంతాలు పూర్తి చేసుకోవడం సంతోషంగా ఉందని హర్షం వ్యక్తం చేశారు. మైక్రోసాఫ్ట్ హైదరాబాద్ నుంచి గ్లోబల్ ఇన్నోవేషన్,ఇంపాక్ట్ క్రియేట్ చేసిందని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం సహకారంతో తరువాయి 2లో



## గూగుల్‌తో ఒప్పందం

వ్యవసాయం, సుస్థిరాభివృద్ధి, పరిపాలన, రవాణా, విద్య తదితర కీలక రంగాల్లో ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్ (ఎఐ) ఆధారిత సేవలు, పరిష్కారాలు అమలు చేయాలని లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఎంచుకుంది. ఇందు కోసం రాష్ట్ర వ్యాప్తంగా వివిధ రంగాల్లో అర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ) సామర్థ్యాన్ని ఉపయోగించుకునేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్రముఖ ఐటి దిగ్గజ సంస్థ గూగుల్‌తో ఒప్పందం చేసుకుంది. ఈ ఒప్పందం ప్రకారం భవిష్యత్తు అవసరాలకు తగిన విధంగా డిజిటల్ నైపుణ్యాలతో శ్రామిక శక్తిని సన్నద్ధం చేసేందుకు తరువాయి 2లో




# మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన

### కేంద్ర హోంశాఖ నోటిఫికేషన్ విడుదల

**న్యూఢిల్లీ :** హింసాత్మక ఘటనలతో కల్లోలం కొనసాగుతున్న మణిపూర్ రాష్ట్రంలో కేంద్ర ప్రభుత్వం రాష్ట్రపతి పాలన విధించింది. ముఖ్యమంత్రి పదవికి ఎన్.బీరేన్‌సింగ్ రాజీనామా చేసిన నాలుగు రోజులకు అంతా అనుకున్నట్టే రాష్ట్రపతి పాలన అమలులోకి వచ్చింది. అసెంబ్లీని రద్దు చేయకుండా సజీవంగా నిద్రావస్థలో ఉంచారు. కేంద్ర దేశీయ వ్యవహారాల మంత్రిత్వ శాఖ గురువారంనాడు ఒక నోటిఫికేషన్ విడుదల చేస్తూ, తరువాయి 2లో

సామాన్యులపై ధరలభారం లేకుండా

## నిరంతర తనిఖీ చర్యలు

వినియోగ ధరల ద్రవ్యోల్బణం తగ్గింది

రాజ్యసభలో నిర్మలా సీతారామన్ ప్రకటన 05

కోడి పందేల కేసులో

## బిఆర్‌ఎస్ ఎంఎల్‌సి శ్రీనివాస్‌రెడ్డికి నోటీసులు

ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి



రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం తొల్కట్ట ఫామ్ హౌస్ లో కోడిపందేల నిర్వహణ కేసులో బిఆర్‌ఎస్ ఎంఎల్‌సి పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డికి పోలీసులు నోటీసులు జారీ చేశారు. మాదాపూర్ లోని ఆయన నివాసానికి వెళ్లి సైబరాబాద్ పోలీసులు నోటీసులను అందజేశారు.కోడి పందేల నిర్వహణపై వివరణ ఇవ్వాలని అందులో పేర్కొన్నారు.ఫామ్ హౌస్ ను భూపతిరాజు అనే వ్యక్తికి లీజుకు ఇచ్చామని ఎంఎల్ సి శ్రీనివాస్ రెడ్డి చెబుతున్ననేపథ్యంలో దీనికి సంబంధించిన సమగ్ర సమాచారం ఇవ్వాలని పోలీసులు ఆయనకు ఇచ్చిన నోటీసులో తరువాయి 2లో

## మహిళా జడ్జిపై చెప్పు విసిరిన నేరస్తుడు

రంగారెడ్డి జిల్లా కోర్టులో కలకలం

నేడు విధులు బహిష్కరిస్తున్నట్లు బార్ అసోసియేషన్ ప్రకటన

ప్రజాపక్షం/సరూర్‌నగర్

కేసు విచారిస్తున్న సమయంలో ఓ నిందితుడు కోర్టు హాలులో మహిళా జడ్జి పైన చెప్పు విసిరిన సంఘటన గురువారం రంగారెడ్డి జిల్లా కోర్టులో చోటుచేసుకుంది. దీంతో ఒక్క సారిగా ఆ ప్రాంతంలో ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. వివరాలలోకి వెళితే... అత్తాపూర్ సిఖ్ విలేజ్‌కు చెందిన కరణ్‌సింగ్ అలియాస్ సర్దార్ చీమకొర్తి (22) పలు నేరాలలో నేరస్తుడుగా కాగా కొనేళ్లుగా చర్లపల్లి తరువాయి 2లో



## లోక్‌సభలో కొత్త ఆదాయ పన్ను బిల్లు

ప్రవేశపెట్టిన ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్

బిల్లును సెలక్ట్ కమిటీకి పంపాలని స్పీకర్‌కు మంత్రి ప్రతిపాదన



**న్యూఢిల్లీ :** నూతన ఆదాయ పన్ను బిల్లును గురువారం నాడు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ లోక్‌సభలో ప్రవేశపెట్టారు. దీనిని ఒక సెలక్ట్ కమిటీ పరిశీలనకు పంపాలని మంత్రి స్పీకర్ ఓమ్ బిర్లాను ఆమె కోరారు. బిల్లును సెలెక్ట్ కమిటీకి పంపితే తదుపరి సమావేశాలలో మొదటి రోజున కమిటీ తన నివేదికను అందజేస్తుందని అన్నారు. కాగా అంతకుముందు ప్రతిపక్షాల వ్యతిరేకిస్తుండగా, మూజువాణీ ఓటుతో ఈ బిల్లును సభలో ప్రవేశపెట్టేందుకు తరువాయి 2లో



అద్దెభవనాల్లో హాస్టళ్ల

## బకాయిలు చెల్లిస్తాం

డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క వెల్లడి

టిజిపిఎస్‌సి జాబ్ క్యాలెండర్ అనుసరించి కోచింగ్ నిర్వహించాలని విజ్ఞప్తి ● మంత్రి పొన్నంతో కలిసి 'ప్రీ బడ్జెట్' సమావేశం

ప్రజాపక్షం/హైదరాబాద్

వెనుకబడిన తరగతుల (బిసి) స్టడీ సెంటర్లు ఉద్యోగ కల్పన కేంద్రాలుగా ఉండాలని అధికారులను డిప్యూటీ ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆదేశించారు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ జాబ్ క్యాలెండర్‌ను అనుసరించి స్టడీ సెంటర్లలో కోచింగ్ నిర్వహించాలని కోరారు. డిఎస్‌సి, బ్యాంకింగ్ వంటి పరీక్షలపై దృష్టి సారించాలని సూచించారు. డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ సచివాలయంలో గురువారం మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి 'ప్రీ బడ్జెట్' సమావేశం నిర్వహించారు. గురుకులాల్లో ఒకేషనల్ కోర్సులు ప్రవేశం పెట్టడం ద్వారా విద్యార్థులకు ఉపాధి లభించే అవకాశం ఉందని మంత్రులు అభిప్రాయపడ్డారు. రెగ్యులర్ కోర్స్‌తో పాటు ఒక కోర్స్ ఒకేషనల్ కోర్సులకు కేటాయించాలని, అందుకు ఏర్పాట్లు చేసుకోవాలని డిప్యూటీ సిఎం తెలిపారు. రెసిడెన్షియల్ పద్ధతిలో విద్యార్థులు పూర్తిగా అందుబాటులో ఉంటున్న నేపథ్యంలో ఒకేషనల్ కోర్సులు ప్రవేశపెడితే ప్రయోజనం ఉంటుందని సూచించారు.

**అద్దె బకాయిలు వెంటనే చెల్లిస్తాం**

అద్దె భవనాల్లో కొనసాగుతున్న సంక్షేమ హాస్టళ్ల, గురుకులాల అద్దె బకాయిలు వెంటనే చెల్లిస్తామని, అందుకు సంబంధించిన ప్రతిపాదనలు తీసుకురావాలని సంబంధిత శాఖ మంత్రి, అధికారులను డిప్యూటీ ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క కోరారు. సంక్షేమ వసతి గృహాలు, గురుకులాల్లో మరమ్మతులు చేపట్టాలని, కిటికీలు, ప్రధాన ద్వారాలు కూడా దోమతెరలు ఏర్పాటు చేయాలని అందుకు అవసరమైన నిధులను వెంటనే కేటాయిస్తామని అధికారులకు మంత్రులు భట్టి విక్రమార్క, పొన్నం ప్రభాకర్లు తెలిపారు. ఆర్‌టిసిలో ఎలక్ట్రికల్ బస్సుల కొనుగోలు, వాటి నిర్వహణకు అవసరమైన ఛార్జింగ్ స్టేషన్స్ ఏర్పాటుపై సమావేశంలో చర్చించారు. ఆర్‌టిసి ఆస్తులు, నిర్వహణ, ఆదాయ వనరులపై సమావేశంలో చర్చించారు. సమావేశంలో బిసి సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శ్రీధర్, ఆర్‌టిసి ఎండి సజ్జనార్, రవాణా శాఖ కమిషనర్ సురేంద్ర మోహన్ తదితరులు పాల్గొన్నారు.

జెపిసి నివేదికపై

## రాజ్యసభలో రభస



ప్రతిపక్షాల వ్యతిరేకత మధ్య ఎగువ సభలో వక్ఫ్ సవరణ బిల్లుపై జెపిసి నివేదిక సమర్పణ

దానిని ఉపసంహరించుకోవాలని పట్టుబట్టిన ప్రతిపక్షాలు

అసమ్మతి నివేదికను తొలగించారని నిరసన

ఆరోపణలు నిరాధారమన్న మంత్రి రిజిజు

గందరగోళం మధ్య గంటకుపైగా రాజ్యసభ వాయిదా

**న్యూఢిల్లీ :** వక్ఫ్(సవరణ) బిల్లుపై ఏర్పాటు చేసిన సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జెపిసి) తన నివేదికను గురువారం రాజ్యసభ ముందుంచింది. నివేదికను ఉపసంహరించుకోవాలన్న ప్రతిపక్షాల నిరసనల మధ్య సభను కొంతసేపు వాయిదా వేశారు. అనంతరం పాలక, ప్రతిపక్ష సభ్యులు మధ్య నివేదికపై వాడిగా వేడిగా వాగ్యుద్ధం జరిగింది. నివేదికపై ప్రతిపక్ష సభ్యుల అసమ్మతి నివేదికను జెపిసి నివేదికలో తొలగించారంటూ ప్రతిపక్షనేత మల్లికార్జున ఖర్గే నేతృత్వంలో ప్రతిపక్షాలు నిరసన వ్యక్తంచేశాయి. ఈ ఆరోపణలను పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు త్రోసిపుచ్చారు. జెపిసి నివేదికను కమిటీ సభ్యురాలు, బిజెపి ఎంపి మేధా విశ్రాం కులకర్ణి నివేదికను రాజ్యసభకు సమర్పించారు. దీనిపై ప్రతిపక్షాలు అభ్యంతరం వ్యక్తంచేశాయి. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సందేశాన్ని వినిపించడానికి సభ చైర్మన్ జగదీప్ ధన్‌కడ్ ప్రయత్నించగా ప్రతిపక్షాలు ఆందోళన కొనసాగించడంతో రాష్ట్రపతి పదవికి గౌరవం ఇవ్వాలని, ప్రతిపక్ష సభ్యులు తమతమ సీట్లతో కూర్చునేలా నచ్చచెప్పాలని ప్రతిపక్ష నాయకుడు ఖర్గేను ధన్‌కడ్ కోరారు. అయితే ప్రతిపక్ష సభ్యులు ఆందోళన కొనసాగించడంతో సభను 11.20 గంటల వరకు వాయిదా వేశారు. సభ తిరిగి ప్రారంభం కాగానే చైర్మన్ ధన్‌కర్ రాష్ట్రపతి సందేశాన్ని చదివి వినిపించారు. జనవరి 31న ఉభయ సభలనుద్దేశించి రాష్ట్రపతి చేసిన ప్రసంగానికి రాజ్యసభ సభ్యులు తెలిపిన ధన్యవాదాలు అందినట్టు ఆ సందేశంలో పేర్కొన్నారు. ఈ సమయంలో పలువురు ప్రతిపక్ష సభ్యులు పలువురు తమ ఆందోళన తరువాయి 12లో

## రీసర్వే కాదు..

గత సర్వేలో వివరాలు ఇవ్వని వారి కోసమే



3.1 శాతం మంది సమాచారం ఇవ్వలే

చిత్తశుద్ధి ఉంటే బిఆర్‌ఎస్ నాయకులు సర్వేలో పాల్గొనాలి

బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి

దేశంలో అన్ని రాష్ట్రాలకు కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన కులగణన సర్వే మార్గదర్శకంగా నిలిచిందని రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. గత సర్వేలో వివరాలు ఇవ్వని వారి కోసం ఫిబ్రవరి 16 నుంచి 28 వరకు కులగణన సర్వే నిర్వహిస్తున్నట్లు చెప్పారు. బిఆర్‌ఎస్ నేతలు చెబుతున్నట్లు ఇది రీ సర్వే కాదని స్పష్టం చేశారు. కరీంనగర్‌లో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. కొంత మంది సమాచారం ఇవ్వకపోవడంతోనే వారి కోసం మరోసారి సర్వే చేస్తున్నామని చెప్పారు. దాదాపు 3.1 శాతంలో కొంత మంది తమ సమాచారం ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వారికి అవకాశం ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయం తరువాయి 2లో

ఎంఎల్‌సి పోచంపల్లి

## కెటిఆర్, సంతోష్‌ల వ్యాపార భాగస్వామి

జన్వాడ డ్రగ్స్ కేసులోనూ ఆయనకు సంబంధాలు

టిపిసిసి అధ్యక్షులు మహేశ్‌కుమార్ గౌడ్ ఆరోపణ

ప్రజాపక్షం/హైదరాబాద్



రాష్ట్రంలో బిఆర్‌ఎస్ ప్రభుత్వం రాక్షస పాలన చేసిందని, మాజీ మంత్రి కెటిఆర్ తెలంగాణలో యువతను మత్తుతో చిత్తు చేశారని టిపిసిసి అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ విరుచుకుపడ్డారు. కెటిఆర్ డ్రగ్స్‌తో తెలంగాణను నాశనం చేస్తే, ఆయన బినామికి కాసినో, తరువాయి 2లో



## సచివాలయంలో భద్రత డొల్ల

నిఘా..సెక్యూరిటీ నిల్..

నకిలీ రెవెన్యూ ఉద్యోగి, నకిలీ ఎమ్మార్వో.. తాజాగా నకిలీ ఐఎఎస్ హల్ చల్

ఇదే రీతిలో సంఘ విద్రోహులు ప్రవేశిస్తే బాధ్యులు ఎవరు?

ప్రజాపక్షం/హైదరాబాద్

ముఖ్యమంత్రి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, మంత్రులు, ఐఎఎస్, ఐపిఎస్‌లతో పాటు అత్యంత ప్రముఖులు రాకపోకలు సాగించే రాష్ట్ర సచివాలయంలో భద్రత చర్యల్లో డొల్లతనం బయటపడింది. నెల రోజుల వ్యవధిలోనే నకిలీ రెవెన్యూ ఉద్యోగి, నకిలీ తహసీల్దార్, నకిలీ ఐఎఎస్‌లు దర్జాగా సచివాలయంలో పొద్దంతా తిరుగుతున్నా ఎవరు గుర్తించకపోవడంతో ఇందుకు నిదర్శనం.అత్యంత కట్టుదిట్టమైన తరువాయి 12లో

# తక్షణం చర్చల ప్రక్రియ ఉక్రేన్‌పై ట్రంప్ హడావుడి

సౌదీఅరేబియాలో పుతిన్‌తో భేటీకి రంగం సిద్ధం

చర్చల్లో ఉక్రేన్,యూరప్ ఉండాల్సిందే : నాటో ఒత్తిడి



**వాషింగ్టన్ :** ఉక్రేన్‌లో యుద్ధ విరమణకు వీలుగా తక్షణం శాంతి చర్చల ప్రక్రియ ప్రారంభం అవుతుందని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రకటించారు.మూడేళ్ళుగా జరుగుతున్న యుద్ధంపై పుతిన్‌తో ట్రంప్ సుదీర్ఘంగా ఫోన్ కాల్ మాట్లాడితన తర్వాత తన ఓవెల్ కార్యాలయంలో పాత్రికేయులతో మాట్లాడారు. యుద్ధ విరమణకు వీలుగా చర్చలకు పుతిన్ అంగీకరించారని ఆయన చెప్పారు. ఒక్క ఫోన్‌కాల్‌తోనే గొప్ప దౌత్యవిజయం సాధించినట్లుగా ట్రంప్ హడావుడి ప్రదర్శించడం ప్రారంభించారు. ఉక్రేన్‌లో యుద్ధ విరమణ దిశగా చర్చలకు ట్రంప్–పుతిన్ అంగీకరించారని వైట్‌హౌస్ యంత్రాంగం పేర్కొంది. యుద్ధ విరమణ శాంతి చర్చలకు అంకురార్పణంగా మొదట పుతిన్‌తో తాను త్వరలోనే సౌదీ అరేబియాలో ముఖాముఖీ సమావేశం జరుపనున్నట్లు ట్రంప్ చెప్పారు. వీలైతే సౌదీ రాజు కూడా ప్రత్యక్షసాక్షిగా ఈ సమావేశంలో పాల్గొనే అవకాశం ఉంది. పుతిన్‌తో ట్రంప్ సుదీర్ఘంగా ఫోన్ సంభాషణ చేసి ఉండొచ్చుగానీ, చర్చలు ఎప్పుడు జరుగుతాయని మాత్రం చెప్పలేదని బ్రిటన్ మీడియా విమర్శించింది. ఈ శాంతి చర్చల్లో ఉక్రేన్, యూరప్‌లు తప్పనిసరిగా భాగస్వాములుగా ఉండాలని ట్రంప్ నాటో కూటమి మిత్రులు ఒత్తిడి ప్రారంభించారు. మరోవైపు పుతిన్‌ను చర్చల దిశగా నడిపించేందుకు వీలుగా ఉక్రేన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ చేస్తున్న డిమాండ్లకు ట్రంప్ ఏ మాత్రం మద్దతు ఇవ్వకుండా విముఖత ప్రదర్శిస్తున్నట్లు కనిపిస్తున్నది. ఈ పూర్వరంగంలో అమెరికా రక్షణమంత్రి పెటే హెగ్సెత్ ఒక ప్రకటన చేస్తూ, పుతిన్‌తో శాంతి ఒప్పంద సంప్రదింపులు చేయడమంటే ఉక్రేన్‌కు, ఉక్రేన్ సోల్జర్లకు ద్రోహం చేయడం మాత్రం కాదని స్పష్టం చేశారు. నాటోలో ఉక్రేన్ సభ్యత్వం అవాస్తవికంగా ఉందన్నారు. నాటోలో అసమతౌల్య సంబంధాలను అమెరికా ఆమోదించబోదన్నారు. బ్రిటన్ రక్షణమంత్రి జాన్ హీలే కూడా ఒక ప్రకటన చేస్తూ, ఉక్రేన్‌లో యుద్ధ విరమణ చర్చలు ఉక్రేన్ లేకుండా జరిగే అవకాశం లేదన్నారు. నాటో కూటమి కార్యదర్శి మార్క్ రట్టే కూడా తీవ్రంగా స్పందిస్తూ, ఉక్రేన్‌కు సంబంధించిన ఎలాంటి శాంతిచర్చలైనాసరే ఆ దేశ భాగస్వామ్యం లేకుండా జరిగే ప్రశ్నేలేదన్నారు. కానీ పుతిన్ మాత్రం జెలెన్‌స్కీతో ముఖాముఖీ చర్చలకు తావే లేదని స్పష్టం చేస్తున్నారు. ఉక్రేన్‌కు నాటో కూటమిలో సభ్యత్వం ఇచ్చే అవకాశం లేదని ట్రంప్ ప్రకటించడం పుతిన్‌ను చర్చల్లో కూర్చోబెట్టేందుకేనని భావిస్తున్నారు. మరోవైపు ట్రంప్ చేస్తున్న ప్రకటనలతో జెలెన్‌స్కీ అయోమయంలో పడుతున్నారు. ఉక్రేన్ ఏదో ఒకనాటికి రష్యాలో ఒక భూభాగంగా మారిపోవచ్చునని, లేదా రష్యాలో విలీనం కాకపోవచ్చునని ఫాక్స్ న్యూస్ ఇంటర్వ్యూలో ప్రకటించి రష్యాకు మరింత చేరువయ్యారు. రష్యా ఆక్రమిత భూభాగం కూడా ఉక్రేన్‌కు తిరిగి దక్కే అవకాశం లేదని కూడా ట్రంప్ చెప్పడం జెలెన్‌స్కీకి పెద్దషాక్‌గా మారింది. ట్రంప్ తమ దేశ ఉనికిని ప్రశ్నార్థకంగా మార్చేశారని ఉక్రేన్ మీడియా విశ్లేషకులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ట్రంప్ ఎన్నికల్లో గెలవకముందునుండీ పుతిన్ ఆయనపట్ల సానుకూల ధోరణితోనే వ్యవహరిస్తున్నారు. ట్రంప్ అధికారంలో ఉండి ఉంటే ఉక్రేన్‌తో యుద్ధం వచ్చేదేకాదని పుతిన్ చేసిన ప్రకటన గమనార్హం. ట్రంప్ అధికారం చేపట్టగానే ఉక్రేన్ యుద్ధం పరిష్కారమవుతుందని జెలెన్‌స్కీ కూడా ప్రకటన చేశారు. అదువల్ల జెలెన్‌స్కీ–పుతిన్ ఇద్దరూ ట్రంప్‌పై యుద్ధవిరమణ విషయంలో ''ఉత్తమ మధ్యవర్తి''గా భావించి అపార విశ్వాసం ప్రదర్శిస్తున్నారు. పుతిన్‌తో ట్రంప్ మాట్లాడకముందు జెలెన్‌స్కీ కూడా ట్రంప్‌తో సుదీర్ఘ ఫోన్ సంభాషణ చేశారు. మరోవైపు ట్రంప్ మీద విశ్వాసంతో రష్యా ఒక అమెరికన్ బందీని విడుదల చేసింది,మార్జువానా కలిగి ఉన్నాడనే ఆరోపణపై అమెరికా ఉపాధ్యాయుడు మార్క్ ఫోగల్‌ను 2021లో మాస్కో విమానాశ్రయంలో అరెస్టు చేశారు. ఐతే వైద్యపరంగా ఆయన దానిని ఉపయోగిస్తున్నారు. కానీ ఫోగల్‌కు రష్యా న్యాయస్థానం 14 సంవత్సరాలు జైలుశిక్ష విధించింది. ట్రంప్ చొరవతో ఆయన విడుదలై వచ్చారు. వైట్‌హౌస్‌లో ట్రంప్‌ను కలిశారు. ఇంకా రష్యావద్ద ఎనిమిదిమంది అమెరికన్లు బందీలుగా ఉన్నారు. ఈ పరిస్థితులమధ్య ఉక్రేన్‌లో యుద్ధాన్ని విరమింపజేసేందుకు ట్రంప్ పూర్తిగా జెలెన్‌స్కీని వదిలేసి పుతిన్‌పక్షానే వాదించడం గమనార్హం.

ప్రపంచం

# ఇతరదేశాల్లో జోక్యం చేసుకోం : మా సంగతి మాదే

దుబాయ్ శిఖరాగ్ర సదస్సులో ఎలాన్‌మస్క్




**దుబాయ్ :** ఇతరదేశాల వ్యవహారాల్లో జోక్యం చేసుకోవాలనే ఆసక్తి అమెరికాకు లేదని ప్రపంచ కుబేరుడు, అమెరికా ఎఫీసియెన్సీ ప్రభుత్వ ప్రత్యేకశాఖాధిపతి ఎలాన్‌మస్క్ అన్నారు.దుబాయ్‌లో జరుగుతున్న ప్రపంచ ప్రభుత్వాల శిఖరాగ్ర సదస్సులో దృశ్యమాధ్యమ పద్ధతిలో ఎలాన్ మస్క్ పాల్గొన్నారు. విదేశాల్లో ఉన్న అంతర్గత విషయాల్లో జోక్యం చేసుకునేందుకు ట్రంప్ ప్రభుత్వానికి అంత ఆసక్తిలేదన్నారు. ఆయన చాలా తక్కువ ఆసక్తి ప్రదర్శిస్తున్నారన్నారు. కృత్రిమ మేధతో ముడిపడిన భిన్నత్వం, సమానత్వం, సర్వసమ్మిళిత తత్వం (డి ఇ ఐ) అనేవాటికి ట్రంప్ ప్రభుత్వం చరమగీతం పాడిందన్నారు. వీటిల్లో భిన్నత్వాన్ని పాటిస్తే ఎంతో మూల్యం చెల్లించాల్సి వస్తుందన్నారు. మధ్యాసియాలో, అఫ్ఘానిస్థాన్‌లో, ఇరాక్‌లో జోక్యం చేసుకున్న అమెరికా విధానాలకు విరుద్ధంగా ఆయన మాట్లాడారు. ఇక ఇలాంటి జోక్యాలపై అమెరికాకు ఆసక్తి లేదన్నారు. ఈ నేపథ్యంలో యుఎస్ ఎయిడ్ రద్దును అందరూ ఆసక్తిగా చూస్తున్నారని మస్క్ అన్నారు. ప్రజాస్వామ్యాన్ని రక్షించేందుకే ఉదారంగా అమెరికా చర్యలు చేపట్టిందనీ, ఐతే ఇప్పటివరకూ ఎంతమేరకు అమెరికా ప్రజాస్వామ్యాన్ని సాధించగలిగిందని మస్క్ ప్రశ్నించారు. అమెరికా ఫెడరల్ ప్రభుత్వం ఖర్చులు తగ్గించి దుబారాను అరికట్టేందుకు ప్రభుత్వ సామర్థ్యం పెంపు మంత్రిత్వశాఖాధిపతిగా ఆయన బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఎలాన్ మస్క్ అమెరికా ఫెడరల్ ప్రభుత్వం నుండి ఏజన్సీలన్నింటినీ రద్దు చేయాలని ఆయన అన్నారు. వీటివల్ల దుబారా తప్ప ప్రయోజనం లేదన్నారు. ప్రభుత్వంలో దుబారాను అరికట్టి డబ్బు మిగులు సాధించేందుకు ఎలాన్‌మస్క్ అతిపెద్ద బాధ్యతలు తీసుకున్నారు. ఇందులో భాగంగా ఇప్పటికే 23 లక్షలమంది ఫెడరల్ ప్రభుత్వ ఉద్యోగులకు స్వచ్ఛంధ పదవీ విరమణ ప్రతిపాదనను పంపారు. వీరిలో 75 వేలమంది ఇప్పటికే ముందుకు వచ్చారు. భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్న థర్మో న్యూక్లియర్ వార్‌ఫేర్, కృత్రిమ మేధ ఈ రెండింటిపై విస్తారమైన సర్వేను ట్రంప్ ప్రభుత్వం ప్రధానాంశాలుగా పరిగణిస్తోందని చెప్పారు. ప్రజల అధికారాన్ని వ్యతిరేకించే ప్రభుత్వ అధికారుల నిబంధనలను మనం ఇక్కడ నిజంగా వ్యతిరేకించేందుకే సమావేశమయ్యామన్నారు. ప్రభుత్వంలో దాగి ఉన్న కలుపు మొక్కలను ఏరిపారేయాలని, లేకపోతే ఆ కలుపు మరింతగా పెరిగిపోతుందని అన్నారు.

**త్వరలో గ్రోక్–3**

తమ సంస్థ ఎక్స్ కొత్తగా అప్‌డేట్ చేసిన ఎ ఐ ఛాట్ బోట్ గ్రోక్–3 సిద్ధమైందని, మరో మూడు వారాల్లో ఇది మార్కెట్‌లోకి వస్తుందని మస్క్ ప్రకటించారు. ఇది చాలా భయపెట్టేది, ప్రమాదకరమైనదన్నారు. శామ్ ఆల్ట్‌మన్ నిర్వహణలో ఉన్న ఓపెన్ ఎ ఐపై ఆయన విమర్శలు గుప్పించారు. దుబాయ్ లూప్ ప్రాజెక్టును కూడా ఆయన ప్రకటించారు. శరవేగంగా లాస్‌వేగాస్‌లో దీనిద్వారా సొరంగాల తవ్వకాలు జరుగుతాయన్నారు. తర్వాత దుబాయ్ ప్రభుత్వం దీనికి సంబంధించిన వివరాలు ఆయనను అడిగి తెలుసుకుంది.

# ఐసిసి చెరవీడి స్వదేశం చేరిన లిబియా నేత



**ట్రిపోలీ :** అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు వారెంట్ మేరకు ఇటలీలో అరెస్టయిన లిబియా దేశ నేత ఒసామా అల్ మిస్రీ ఎన్‌జీమ్ గురువారంనాడు తిరిగి స్వదేశం చేరుకున్నారు. ఈ ఏడాది జనవరి 19వ తేదీన అల్‌మిస్రీ అరెస్టయ్యారు. ఐతే ఆయనకు ఐసిసి ఇచ్చిన వారెంట్‌లో అన్నీ అసత్యాలే ఉన్నాయని ఇటలీ ప్రభుత్వం వాదించడంతో ఆయన విడుదలయ్యారు. ఇటలీ ప్రభుత్వ విమానంలో ఎట్టకేలకు తిరిగి ఆయన లిబియా చేరుకున్నారు. ఊచకోతలకు, మానవహక్కుల ఉల్లంఘనలకు పాల్పడ్డారని అల్‌మిస్రీపై ఎన్నో ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వం మద్దతుతో ప్రత్యేక నిర్బంధ కేంద్రాలను నడిపించారని, ఈ కేంద్రాలలో ఎంతోమందిని చిత్రహింసలకు గురిచేశారని ఐసిసి వారెంటు ఆరోపించింది. మిటిగా, ఐన్‌జారా, అల్ జడిడాలతోపాటు ట్రిపోలీలో ఉన్న అనేక జైళ్ళలో నిర్బంధంలో ఉన్న వేలాదిమందిని ఆయన హింసకు గురిచేస్తున్నారన్నది ఐసిసి ఆరోపణ. 2015 నుండి అల్ మిస్రీ ఎన్‌జీమ్ హత్యలు, అత్యాచారాలు, చిత్రహింసలు వంటి చర్యలకు పాల్పడుతున్నారన్నది ఐసిసి వారెంట్‌లో ఉన్న ఆరోపణలు. ఐతే సాంకేతికపరమైన లోపాలతో ఆయన అరెస్టు తర్వాత మళ్ళీ విడుదలయ్యారు. ట్రిపోలీలో ఉన్న ఉగ్రవాద సంస్థ ''డాక్టో''లో మిస్రీ దీర్ఘకాలిక సభ్యుడు. తన అధికారం నిలబెట్టుకునేందుకు అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన ఈ డాక్టో సంస్థను లిబియా ప్రభుత్వం ఉపయోగించుకుంటున్నది.

# హమాస్ అణకువ : ఇజ్రాయెల్ దూకుడు

ఒప్పందాన్ని గౌరవిస్తాం : రేపు బందీల విడుదల



**కైరో :** గాజా యుద్ధ విరమణకు సంబంధించి జనవరి 19 నుండి అమలులోకి వచ్చిన ఒప్పందాన్ని గౌరవించాలని మధ్యవర్తులు ఒత్తిడి చేస్తున్నారనీ, ఆ మేరకు ఒప్పందాన్ని తాము గౌరవిస్తామని హమాస్ ప్రతినిధులు ప్రకటించారు. గాజా ఒప్పందం అమలుకు ఉన్న అన్ని ఆటంకాలను తొలగిస్తామని కైరోలో చర్చల సందర్భంగా ఈజిప్టు, ఖతార్‌కు చెందిన మధ్యవర్తులు భరోసా ఇవ్వడంతో హమాస్ ప్రతినిధులు పైవిధంగా స్పందించారు.ఐతే ఇజ్రాయెల్ మాత్రం ఇంకా దూకుడు ప్రదర్శిస్తున్నది. గాజా గనుక తమ బందీలందరినీ విడుదల చేయకపోతే డోనాల్డ్ ట్రంప్ కోరుకున్నవిధంగా గాజాలో రియల్ ఎస్టేట్ ప్లాన్ అమలు చేసేందుకు పూర్తి మద్దతు తెలియజేస్తామని బెదిరిస్తున్నది. హమాస్ కూడా అందుకు దీటుగా స్పందిస్తూ, బెదిరింపులతో పాలస్తీనాను ఆక్రమించుకోలేరనీ, అది ఎన్నటికీ సాధ్యం కాదనీ స్పష్టం చేసింది. ఒప్పందానికి కట్టుబడి ఉంటామని, అందుకు అనుగుణంగా మరో విడత బందీలను శనివారంనాడు విడుదల చేస్తామని హమాస్ ప్రకటించింది. తొలివిడతగా కుదిరిన 45 రోజుల కాల్పుల విరమణ ఒప్పందాన్ని తాము గౌరవిస్తామని పేర్కొంది. మరోవైపు ఇజ్రాయెల్ రాజధాని టెల్‌అవీవ్‌లో బందీల బంధువులు పెద్దపెట్టున గురువారంనాడు నిరసన ప్రదర్శనలు చేశారు. టెల్‌అవీవ్‌లో జాతీయ రహదారిపై రాస్తారోకో చేశారు. బందీల విడుదలకు సంబంధించిన ఒప్పందానికి నేతన్యాహూ కట్టుబడి ఉండాలని డిమాండ్ చేశారు. ఇజ్రాయెల్ దూకుడుగా వ్యవహరిస్తోందనీ, శిథితలాలను తొలగించేందుకు బుల్ డోజర్లను గాజాలోకి ప్రవేశించకుండా అడ్డుకుంటోందనీ, ఆక్రమిత వెస్ట్‌బ్యాంక్‌లో దారుణాలు సాగిస్తోందని, ట్రంప్, నేతన్యాహూ నిత్యం బెదిరింపులు చేస్తూ మనశ్శాంతి లేకుండా చేస్తున్నారనీ హమాస్ విమర్శిస్తోంది. ఒప్పందం ప్రకారం గాజాలోకి 2,00,000 ల తాత్కాలిక నివాస గుడారాలను అనుమతించాల్సి ఉండగా, అందులో కేవలం 10 శాతం టెంట్లను మాత్రమే అనుమతించారని పేర్కొంది. 60,000 సంచార గుడారాలలో ఒక్కదాన్ని కూడా గాజాలోకి రానివ్వడంలేదని హమాస్ విమర్శించింది. గాజాలోకి వస్తున్న సహాయం కూడా బాధితులకు ఏ మాత్రం సరిపోవడంలేదని పేర్కొంది. బెదిరింపుల భాష ద్వారా ఒప్పందాన్ని అమలు చేయలేరని హెచ్చరించింది. ఇజ్రాయెల్‌తో మధ్యవర్తుల ద్వారా కుదిరిన ఒప్పందం నీరుగారిపోకుండా కాపాడేందుకు ప్రయత్నిస్తున్నామని, తాము ఎంతో పట్టుదలతో ఉన్నామని కైరోలో హమాస్ ప్రతినిధి చెప్పారు. దీనిపై ఇజ్రాయెల్ స్పందిస్తూ, బుల్‌డోజర్లను అనుమతిస్తే వారు శిథిలాల తొలగింపునకు కాకుండా, యుద్ధ అవసరాలకు, దాడులకు ఉపయోగించుకునే ప్రమాదం ఉందని ఆరోపిస్తున్నది. కాగా గాజా విషయంలో ఈజిప్టు, జోర్డాన్ ప్రభుత్వాలు ఏకాభిప్రాయంతో ఉన్నాయి. పాలస్తీనియన్లకు అన్యాయం జరగకూడదని వాదిస్తున్నాయి. పాలస్తీనియన్లను పొరుగుదేశాలకు శరణార్థులుగా తరలించేందుకు సమ్మతించేదిలేదని అరబ్ లీగ్ ప్రధాన కార్యదర్శి అహ్మద్ ఎబౌల్ ఘెయిట్ చెప్పారు.

## విప్లవాత్మక మార్పులు

(మొదటి పేజీ తరువాయి)

మైక్రోసాఫ్ట్ ఎఐ సెంటర్ ఏర్పాటు చేస్తోందని గర్వంగా చెబుతున్నామని ఆయన తెలిపారు.ఈ కేంద్రం ఎఐ నాలెడ్జ్ హబ్ సహా క్లౌడ్ ఆధారిత ఎఐ మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేస్తుందని సిఎం రేవంత్ రెడ్డి తెలిపారు.ఆవిష్కరణల పట్ల మైక్రోసాఫ్ట్ సంస్థ నిబద్ధతకు మా తెలంగాణ రైజింగ్ విజన్‌కు తోడవుతుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

## చెప్పు విసిరిన నేరస్తుడు

(మొదటి పేజీ తరువాయి)

జైలులో శిక్ష అనుభవిస్తున్నాడు. కేసు విచారణలో భాగంగా రంగారెడ్డి జిల్లా 9వ అడిషనల్ సెషన్స్ జడ్జి హరిష నిందితుడికి జీవిత ఖైదు విధిస్తూ తీర్పు వెలువరించారు. ఈ క్రమంలో నిందితుడిని గురువారం పోలీసులు కోర్టులో హాజరు పరచగా కరణ్‌సింగ్ జైలులో తనకు ఎదురవుతున్న ఇబ్బందులపై జడ్జికి వివరించే ప్రయత్నంలో ఒక్క సారిగా తన కాలికి ఉన్న చెప్పును తీసి మహిళా జడ్జిపై విసిరాడు. ఈ పరిణామంలో జడ్జి సహా అందరూ షాక్ గురయ్యారు. కాగా పోలీసులు వెంటనే నిందితుడిని అదుపులోకి తీసుకుని పక్కకు తీసుకెళ్లారు. కాగా జడ్జిపై జరిగిన దాడిని జిల్లా బార్ అసోసియేషన్ తీవ్రంగా ఖండించింది. నిరసనగా శుక్రవారం అన్ని కోర్టులలో విధులు బహిష్కరిస్తున్నట్లు వెల్లడించారు.

## పన్ను బిల్లు (మొదటి పేజీ తరువాయి)

నిర్ణయించాలని ఆమె స్పీకర్‌ను కోరారు. ఆదాయ పన్నుకు సబంధించి 'అసెస్‌మెంట్ ఇయర్', 'ప్రీవియస్ ఇయర్' వంటి పదాల స్థానంలో 'టాక్స్ ఇయర్' పదాలను ప్రవేశపెట్టడంద్వారా బిల్లులోని అంశాలను సరళీకరించడం బిల్లు ముఖ్య ఉద్దేశం. కాగా బిల్లు ప్రవేశపెట్టినపుడు కాంగ్రెస్ సభ్యుడు మనీష్ తివారి, రివొల్యూషనరీ సోషలిస్ట్ పార్టీ(ఆర్‌ఎస్‌పి) సభ్యుడు ఎన్.కె.ప్రేమచంద్రన్ తెలిపిన అభ్యంతరాలపై సీతారామన్ స్పందిస్తూ, ప్రస్తుత బిల్లులోని సెక్షన్లకంటె కొత్త బిల్లులో ఎక్కువ సెక్షన్లు ఉన్నయన్న వాదన సరికాదన్నారు. దీనిపై వివరణ ఇస్తూ, 1961లో కొన్ని సెక్షన్లు మాత్రమే ఉన్నాయని, పలు మార్పుల అనంతరం ప్రస్తుతం 819 సెక్షన్లు ఉన్నాయని, కొత్త బిల్లులో వాటిని 536 సెక్షన్లకు తగ్గించామని తెలిపారు. తృణమూల్ కాంగ్రెస్ సభ్యుడు సౌగత రాయ్ అభ్యంతరాలను కూడా మంత్రి కొట్టివేస్తూ నూతన బిల్లు యాంత్రికంగా రూపొందించనది కాదని, గణనీయమైన మార్పులతో తీర్చిదిద్దామన్నారు.

## గూగుల్‌తో ఒప్పందం

(మొదటి పేజీ తరువాయి)

గూగుల్ వ్యూహాత్మక సహకారం అందించనుంది. ప్రధానంగా రైతులకు వ్యవసాయ సంబంధిత ఎఐ ఆధారిత పరిష్కారాలు అందించనుంది. రవాణా సదుపాయాలను మెరుగుపరిచే డేటా ఇంటిగ్రేషన్ సదుపాయాల కల్పనలోనూ భాగస్వామ్యం పంచుకుంటుంది. గూగుల్ ఫర్ ఎడ్యుకేషన్ ద్వారా ఎఐ నైపుణ్యాలు పెంపొందించే కార్యక్రమాలపై దృష్టి సారిస్తుంది. ఎంపిక చేసిన పాఠశాలల్లో డిజిటల్ అభ్యాసన పద్ధతులను ప్రారంభిస్తుంది. గూగుల్ వర్క్ స్పేస్, క్రోమ్ సర్వీసెస్ ను అందిస్తుంది. రైతులకు అవసరమైన ఇన్‌పుట్, మార్కెటింగ్ సదుపాయాలన్నీ అనుసంధానం చేస్తూ తెలంగాణ ఓపెన్ అగ్రికల్చర్ నెట్‌వర్క్‌ను ప్రారంభిస్తుంది. గూగుల్ డేటా కామన్స్ ప్లాట్‌ఫామ్ ద్వారా ఓపెన్ డేటా యాక్సెస్‌ను మెరుగుపరుస్తుందని ముఖ్యమంత్రి కార్యాలయం తెలియజేసింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఎనుమల రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ ఎఐ ఆధారిత తెలంగాణ దార్శనికతకు గూగుల్ సహకారం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. గూగుల్ ఇండియా కంట్రీ మేనేజర్ ప్రీతి లోబానా మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వానికి వివిధ కీలక రంగాలలో సహకారం అందించడం సంతోషంగా ఉందన్నారు. దేశ డిజిటల్ భవిష్యత్తు పట్ల తమ సంస్థ నిబద్ధతను ఈ నిర్ణయం బలోపేతం చేస్తుందని అన్నారు. ఎఐ ఆధారిత వర్క్ ఫోర్స్‌ను పెంపొందించడం, స్టార్టప్‌లను ప్రోత్సహించడం, వ్యవసాయం, విద్య లాంటి కీలక రంగాల్లో పనిచేయటం ఉత్సాహంగా ఉందని అన్నారు.

## మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన (మొదటి పేజీ తరువాయి)

''మణిపూర్ రాష్ట్రంలో ప్రభుత్వపాలన రాజ్యాంగ నిబంధనలకు అనుగుణంగా సాగని పరిస్థితులు తలెత్తాయి అని రాష్ట్రపతి అభిప్రాయపడ్డారు'' అని పేర్కొంది.''ఇక మీదట రాజ్యాంగంలోని 356వ అధికరణ కింద అధికారాలు, ఇతర బాధ్యతల నిర్వహణ నాకే సంక్రమిస్తుంది, భారత రాష్ట్రపతిగా ఇకమీదట మణిపూర్ రాష్ట్రంలో అన్ని ప్రభుత్వ కార్యకలాపాల నిర్వహణను నేనే స్వాధీనం చేసుకుంటున్నట్లుగా ఇందుమూలంగా ప్రకటించడమైనది, వీటిని నిర్వహించేందుకు నా తరపున రాష్ట్ర గవర్నర్‌కు ఈ బాధ్యతలను దఖలుపరచడమైనది'' అని నోటిఫికేషన్ పేర్కొంది. మణిపూర్ రాష్ట్రశాసనసభను రద్దుచేయకుండా నిద్రావస్థలోకి పంపించినట్లు నోటిఫికేషన్ పేర్కొంది. ఎన్.బైరెన్‌సింగ్ నామమాత్రంగా ఆపధర్మముఖ్యమంత్రిగా ఉంటారు. 2023 మే మూడవ తేదీన మణిపూర్‌లో మైతీ–కుకీ జాతులమధ్య హింసాత్మక ఘర్షణలు ప్రారంభమయ్యాయి. ఇక అప్పటినుండీ ఆ రాష్ట్రం గృహ దహనాలు, మహిళలపై అత్యాచారాలు, దారుణ సామూహిక హింసాకాండ కొనసాగుతున్నది. ఈ కారణంగా 60,000 మందికిపైగా ప్రజలు ఇళ్ళువదలి పారిపోయారు. 250 మంది మరణించగా వేలాదిమంది గాయపడ్డారు. 96 మృతదేహాలు ఇప్పటివరకూ ఎవరివో తెలియలేదు.254 క్రైస్తవ మతాలయాలు, 132 హిందూ ఆలయాలు, మరో 386 మత ప్రదేశాలు ఈ అల్లర్లలో ధ్వంసమయ్యాయి. మణిపూర్ పోలీసుల సమాచారం ప్రకారం 5,172 గృహదహనాల కేసులు నమోదయ్యాయి. బిజెపి తరపున గెలిపి డబుల్ ఇంజిన్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రి ఎన్.బైరెన్‌సింగ్ ఈ హింసాకాండలో ఒకపక్షం వహించి ఘర్షణలకు ఆజ్యం పోశారని తీవ్ర ఆరోపణలు ఎదుర్కొన్నారు. ఆయన రాజీనామా చేయాలని మొదటినుండీ ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోకుండి సార్వత్రిక ఎన్నికలు, ఇతర కీలక రాష్ట్రాలలో ఎన్నికల ప్రయోజనాల నిమిత్తం మణిపూర్‌లో పరిస్థితులను వీలైనంతవరకూ ప్రపంచం దృష్టికి రాకుండా ఆంక్షలు విధించి కట్టుదిట్టం చేసింది. మణిపూర్‌లో స్త్రీలపై జరిగిన దారుణ అమానుష కృత్యాలను చూసి భారత సర్వోన్నత న్యాయస్థానం కూడా ముక్కునవేలేసుకుంది. ఇప్పటివరకూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆ రాష్ట్రంలో పర్యటించకపోగా, ప్రతిపక్షాలు, మానవహక్కుల సంఘాలు, సామాజిక గ్రూపులు కూడా ఆ రాష్ట్రంలో పర్యటించకుండా ఆంక్షలు విధించి అమానుషంగా ప్రవర్తించారు.

మయన్మార్ అక్రమ వలస ప్రజల్ని

తరిమి కొట్టేవరకూ పోరాటం

ఆపద్ధర్మముఖ్యమంత్రి బైరెన్‌సింగ్

మణిపూర్ రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగం అక్రమ,చట్టవిరుద్ధ వలసలకు వ్యతిరేకంగా ప్రభావంతంగా ప్రతిస్పందించేందుకు పోరాటం చేస్తోందని ఆపద్ధర్మ ముఖ్యమంత్రి ఎన్.బైరెన్‌సింగ్ పేర్కొన్నారు. మణిపూర్‌లో రాష్ట్రపతిపాలన విధించిన తర్వాత గురువారంనాడు సాయంత్రం ఆయన ఎక్స్ వేదికగా ఒక పోస్టింగ్ చేస్తూ, అక్రమ వలసలపై 2023 మే 3వ తేదీ నుండీ సమర్థవంతంగా ప్రతిస్పందించేందుకు యంత్రాంగం పోరాటం చేస్తోందని, రాష్ట్రంలో హింస ప్రారంభమైన తర్వాత ఇప్పటివరకూ 250 మంది మరణించారని, వేలాది మంది నిర్వాసితులుగా మారారని పేర్కొన్నారు. ఈ సరిహద్దు రాష్ట్రంలో చట్టవిరుద్ధమైన వలసలు అదేపనిగా పెరిగిపోతూ ఉన్నాయనీ, ఈ బెడద మణిపూర్ సామాజిక వ్యవస్థకు తీవ్రమైన ప్రమాదంగా మారిందని పేర్కొన్నారు. ఈనెల తొమ్మిదోతేదీన ఎన్.బైరెన్‌సింగ్ ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేశారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు జరిగేవరకూ ఆపద్ధర్మ ముఖ్యమంత్రిగా కొనసాగాలని రాష్ట్ర గవర్నర్ ఆయనను కోరారు. ఎక్స్ వేదికగా ఆయన మణిపూర్‌లో పలుజాతులకు చెందిన ప్రజలను స్నేహితులుగా పేర్కొంటూ ఈ పోస్టింగ్ పెట్టారు. ''మన నేల, మన ఉనికి ప్రమాదంలో పడింది. కొద్దిమంది జనాభాతోట, పరిమితమైన వనరులతో ఉన్న మణిపూర్‌లో మనం ఇలాంటి పరిస్థితులను తట్టుకుని నిలబడలేని పరిస్థితులకు చేరుకున్నాం. అక్రమ వలసప్రజలను తనిఖీ చేసేందుకు, వారిజాడ కనిపెట్టేందుకు 2023 మే 3 వ తేదీ నుండి నేను విరామం లేకుండా శ్రమిస్తున్నాను. కానీ మే మూడో తేదీన జరిగిన విషాదకరమైన ఘటనలు తర్వాత మన ప్రభుత్వ యంత్రాంగం సమర్థవంతంగా ప్రతిస్పందించేందుకు పోరాటం చేస్తున్నది, మయన్మార్‌తో ఉన్న ఎలాంటి కాపలావ్యవస్థా లేని 398 కిలోమీటర్ల మణిపూర్ సరిహద్దుప్రాంతంలో చాలా యదేచ్ఛగా రాకపోకలు సాగుతున్నాయి, మయన్మార్ కారణంగా మణిపూర్ రాష్ట్ర భౌగోళిక స్వరూపస్వభావాలు మారిపోయాయి, ఇది కేవలం వదంతి కాదు, ఇదంగా మనకళ్ళముందే జరిగింది, 2017 మార్చినెలలో మన ప్రభుత్వం మణిపూర్‌లో అధికారం చేపట్టినప్పటినుండీ ఈ సవాలు మరింత ఉద్ధృతరూపం దాల్చింది. 2023 మే 3వ తేదీ ఘటనల తర్వాత దారుణంగా మారింది. మయన్మార్–మణిపూర్ సరిహద్దులమధ్య 16 కి.మీ ప్రాంతంలో నివాసిత ప్రాంత ప్రజలు యధేచ్ఛగా రాకపోకలు సాగించే కార్యకలాపాలకు త్వరలో తెరపడతాయని గత ఏడాది జనవరిలో కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. భారత్–మయన్మార్ మధ్య 1,643 కి.మీ మేరకు విస్తరించి ఉన్న సరిహద్దుల్లో మిజోరాం, మణిపూర్, నాగాలాండ్, అరుణాచల్ ప్రదేశ్ రాష్ట్రాలకు యదేచ్ఛగా రాకపోకలు సాగుతున్నాయి,. కానీ ఈ నియంత్రణలను 2018లో భారత తూర్పువిధానం కింద అమలు చేశారు. మణిపూర్ చాలా చిన్నరాష్ట్రం, తక్కువమంది జనాభా ఉంటారు, గొప్ప ప్ర కృతి వనరులు కూడా లేవు, మనరాష్ట్రం నుండి పార్లమెంటులో ముగ్గురు ఎంపీలు మాత్రమే ప్రాతినిధ్యం వహిస్తున్నారు, ఇప్పటివరకూ మనం ఎంతో గర్వంగా ఉంటూ పుంజుకుంటున్నాం, మడమతిప్పనిస్ఫూర్తిని ప్ర దర్శిస్తు న్నాం, కానీ అక్రమ వలసలు అదేపనిగా రాష్ట్రంలోకి కొ నసాగుతున్నాయి,పెరిగిపోతున్నాయి,ఇప్పటివరకు వారిలో కొంత మందిని మాత్రమే గుర్తించగలిగాం, కానీ ఇప్పటి వరకూ బయటకు తెలియకుండా గుట్టుగా ఉండిపోయిన అక్రమ వలస ప్రజల సంగతి ఏమిటి?'' అని బై రెన్‌సింగ్ ఎక్స్ వేదికగా ప్రశ్నించారు.ఈ విషయాలను చా లా తీవ్రంగా పరిగణించాలని బైరెన్‌సింగ్ అధికారుల ను కోరారు. మణిపూర్‌లో ఉన్న అక్రమ వలస ప్రజల ను క నిపెట్టి వారిని వెనక్కు పంపేయాలని కోరారు.''నేను రా జీపడకుండా, మడమతిప్పకుండా నా పోరాటాన్ని చిత్తశుద్ధిలో ప్రతిమార్గంలోనూ ఒక ఆపద్ధర్మ ముఖ్యమంత్రిగా పోరాటం కొనసాగిస్తాను'' అని బైరెన్‌సింగ్ పేర్కొన్నా రు.

## రీసర్వే కాదు..

(మొదటి పేజీ తరువాయి)

తీసుకుందని స్పష్టం చేశారు. బిసి జనాభా 56 శాతం వచ్చిందని, తాము 46 శాతం రిజర్వేషన్లు ఇచ్చేందుకు స్థానిక సంస్థలలో బిసి రిజర్వేషన్ కోసం ప్రత్యేక అసెంబ్లీ సమావేశం నిర్వహిస్తామని చెప్పారు. సర్వేలో పాల్గొనని బిఆర్‌ఎస్ నేతలకు మాట్లాడే అర్హత లేదన్నారు. ప్రజాస్వామ్యంపై చిత్తశుద్ధి ఉంటే బిఆర్‌ఎస్ అగ్ర నాయకులు సర్వేలో పాల్గొని చిత్తశుద్ధి నిరూపించుకోవాలన్నారు. వారి మానసిక స్థితి బలహీన వర్గాలను ఏవిధంగా అణచివేయాలనేది స్పష్టం చేస్తోందన్నారు. బిజెపి పక్కా వ్యాపారస్తుల పార్టీ అని దుయ్యబట్టారు. కులగణన, బిసి, ఎస్సీ రిజర్వేషన్ జరగడం వారికి ఇష్టం లేదన్నారు. రిజర్వేషన్ల విషయంలో వ్యతిరేకమని కోర్టులో అఫిడవిట్ ఇచ్చిన పార్టీ బిజెపి కాదా? అని ప్రశ్నించారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా తెలంగాణలో రిజర్వేషన్ అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు సర్వే అయిన తర్వాతనే జరుగుతాయని పేర్కొన్నారు. సామాజిక మార్పు కలిగించే నిర్ణయమన్నారు. బలహీన వర్గాలపై చిత్తశుద్ధి ఉంటే శాసనసభ బిల్లును అడ్డుకోవద్దన్నారు. రాజకీయ విమర్శల కోసమే బిసి, ముస్లింలపై బిజెపి విమర్శలు చేస్తుందని ఆరోపించారు. బండి సంజయ్ దేశం మొత్తం బిసి రిజర్వేషన్ అమలు చేసే విధంగా కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, నాయకులు ఎండి తాజ్, వైద్యుల అంజన్‌కుమార్, సిరాజ్ హుస్సేన్, పులి ఆంజనేయులు, గడ్డం విలాస్ రెడ్డి, ఆకారపు భాస్కర్ రెడ్డి, ముత్యం శంకర్, అజీమ్, మహమ్మద్, అలీ, పురం రాజేశం, ముల్కల ప్రవీణ్, గంట కళ్యాణి శ్రీనివాస్, ఆకుల ప్రకాష్, పంజాల స్వామి గౌడ్, కామిరెడ్డి రామిరెడ్డి, బొబ్బిలి విక్టర్, సలీముద్దీన్, మెండి చంద్రశేఖర్, ఇన్నారెడ్డి, నిహాల్,, కుంభాల రాజకుమార్‌లున్నారు.

## శ్రీనివాస్‌రెడ్డికి నోటీసులు

(మొదటి పేజీ తరువాయి)

పేర్కొన్నారు. గత మంగళవారం రాత్రి మొయినాబాద్ ఫామ్ హౌస్‌పై పోలీసులు నిర్వహించిన దాడుల్లో మొత్తం 61 మంది పోలీసులకు పట్టుబడగా వారి వద్ద రూ.30 లక్షల నగదు,జూదక్రీడలో ఉపయోగించే రూ.కోటి విలువైన బెట్టింగ్ కాయిన్లు దొరికాయి.ఈ సందర్భంగా పోలీసులు 50 కార్లు,80 పందెం కోళ్లను స్వాధీనం చేసుకున్నారు.నిందితుల్లో ఎక్కువ మంది వ్యాపారులే.అందరికీ నోటీసులిచ్చి వదిలేశారు.పోలీసులు వస్తున్న విషయం తెలుసుకుని కొందరు పరారయ్యారు.దాంతో పరారైన వ్యక్తులెవరనే దానిపైనా పోలీసులు ఆరా తీస్తున్నారు.

**కెటిఆర్.. దీనిపై స్పందిస్తారని ఆశిస్తున్నా : సిఎం సిపిఆర్‌ఒ**

' మీ ఆస్తులు ఇంత గనం పెరిగేందుకు ఇలాంటి వ్యాపారాలేనా.?,ఇంకా ఏమైనా బయటకు రావాలిసినవి ఉన్నయా?' అని ముఖ్యమంత్రి సిపిఆర్ఒ అయోధ్యరెడ్డి తన ట్విట్టర్‌లో (ఎక్స్) బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసి డెంట్ కెటిఆర్‌ను ప్రశ్నించారు.2009లో 'మీ ఆస్తులు రూ.4.35 కోట్లు,2023లో రూ. 53.31 కోట్ల ఆస్తులు అని అన్నారు.హైదరాబాద్ నగర శివారులోని ఒక ఫామ్‌హౌస్‌లో కోడి పందేలు,భారీగా నగదు పట్టివేత అంశాన్ని ట్విట్టర్‌లో ప్రస్తావించారు. రూ.30 లక్షల నగదు, 55 లగ్జరీ కార్లు సీజ్ చేసిన అధికారులు,86 పందెం కోళ్ళు,పెద్ద మొత్తంలో బెట్టింగ్ కాయిన్స్ పేకాట స్వాధీనం చేసుకున్నారని, పందెం కోళ్ల కోసం వాడే 46 కోడి కత్తులు కూడా స్వాధీనం చేసుకున్నారని, భీమవరం నుంచి బొస్టన్ వరకు స్పందించే 'మీరు'(కెటిఆర్), దీనికి కూడా స్పందిస్తారని తాను ఆశిస్తున్నట్టు అయోధ్య రెడ్డి తన ట్విట్టర్‌లో పేర్కొన్నారు.

## వ్యాపార భాగస్వామి

(మొదటి పేజీ తరువాయి)

సంతోష్‌లకు వ్యాపార భాగస్వామిగా ఎంఎల్‌సి పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి ఉన్నాడు'' అని టిపిసిసి అధ్యక్షులు, ఎంఎల్‌సి బి.మహేష్‌కుమార్ గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లో గురువారం మీడియాతో ఆయన మాట్లాడుతూ బిఆర్‌ఎస్ ప్రభుత్వ హాయాంలో సన్ బర్న్ పార్టీల పేరుతో పాశ్చాత్య సంస్కృతిని హైదరాబాద్ తీసుకొచ్చిన చరిత్ర బిఆర్‌ఎస్ నాయకులదని విమర్శించారు. బిఆర్‌ఎస్ హాయాంలో కెటిఆర్, సంతోష్ కనుసన్నల్లోనే పోచంపల్లి ఫాంహౌస్ దందా నడిచిందని, జన్వాడ ఫాంహౌస్ కేసులో డ్రగ్స్ ఇచ్చిన కేసులో పోచంపల్లికి లింక్ ఉందని అనుమానాలు ఉన్నాయన్నారు. ఫాంహౌస్‌లలో క్యాసినో, పేకాట, కోళ్ళ పందేలు ఆడిస్తూ తెలంగాణ సమాజాన్ని జూదాల వైపు నెడుతున్నారని, పార్టీ దందాలను కెటిఆర్, సంతోష్, పోచంపల్లి ప్రధాన వృత్తిగా మార్చుకున్నారని ఆయన ఆరోపించారు. తెలంగాణను క్యాసినో హబ్‌గా కెటిఆర్ మార్చారని, అత్యాధునిక హంగులతో విదేశాల్లో ఆడే క్యాసినో, జూదాలు కెటిఆర్ అండతో ఎంఎల్‌సి పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి ఫామ్‌లో జరుగుతున్నాయన్నారు. బిఆర్‌ఎస్ హాయంలో ఇచ్చిన పర్మిషన్‌తో ఫామ్ హౌస్‌లో గత రెం డేళ్ల నుంచి ఈ పందెలు జరుగుతున్నాయని, డ్రగ్స్ కు, కేసినోకు, అంతర్జాతీయ దొంగలకు కెటిఆర్ నాయకుడని, జైలుకు వెళుతూ, ఫార్ములా రేస్‌లో విచారణకు వెళ్లి జై తెలంగాణ అంటారని, 'జై తెలంగాణ' నినాదాన్ని కెసిఆర్ కుటుంబం అవమాన పరుస్తుందన్నారు. తెలంగాణలో జరిగే అన్ని రకాల జూదాలకు కెటిఆర్ నాయకుడని, బిఆర్‌ఎస్ నాయకులు అందరూ ఏదో ఒక అవినీతిలో, అక్రమాలలో ఉన్నారని, వారందరిపై విచారణ జరిపి తెలంగాణ యువతను కాపాడాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. గతంలో రేవంత్ రెడ్డి వైట్ చాలెంజ్ చేస్తే కెటిఆర్ హై కోర్టుకు వెళ్ళి పరువు నష్టం కేసు పెట్టి తప్పించుకున్నారన్నారు. కెసిఆర్ కుటుంబం వారి కోసమే రాజకీయాలు చేస్తూ జనాన్ని పీడిస్తున్నారన్నారు.

# నాలుగేళ్లయినా కెసిఆర్ బయటకు రారు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బిఆర్‌ఎస్ అధినేత కె.చంద్రశేఖర్‌రావు ఇప్పుడే కాదు, నాలుగేళ్ల తర్వా త కూడా బయటికి వచ్చే పరిస్థితి లేదని టిపిసిసి ప్రధాన కార్యదర్శి అద్దంకి దయాకర్ విమర్శించారు. గాంధీభవన్‌లో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఎస్‌సి వర్గీకరణలో ఏలాంటి కుట్ర లేదని, శాస్త్రీయంగానే జరిగిందని, కాంగ్రెస్ ఏ వర్గాన్ని దూరం చేసుకోదని వెల్లడించారు. ఎంఎల్‌ఎ కోటలో ఎంఎల్‌సి ఆశిస్తున్నానని, ప్రభుత్వం, పార్టీ అధిష్ఠానం నిర్ణయం తీసుకుంటుందని భావిస్తున్నాన్నారు. అత్యాధునిక హంగులతో విదేశాల్లో ఆడే క్యాసినో, జూదాలు ఎంఎల్‌సి పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి ఫామ్ హౌస్‌లో బిఆర్‌ఎస్ హాయంలో ఇచ్చిన అనుమతులతోనే జరుగుతున్నాయన్నారు. సారా అమ్మి జైలుకు వెళ్లొచ్చి.. ఫార్ములా రేస్‌లో విచారణకు వెళ్లి జైతెలంగాణ అంటున్నారని, వారి కి జై తెలంగాణ అనే హక్కు లేదన్నారు.

# నేరస్తులు, కార్పొరేటు సంస్థల చేతుల్లో ప్రజాస్వామ్యం

ఎన్నికల సంఘానికి సర్వాధికారాలు కల్పించాలి

ఉచిత హామీలను కట్టడి చేయాలి, గెలిచాక పార్టీలు మారితే వెంటనే అతని పదవి రద్దుచేయాలి

సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి డిమాండ్




**ప్రజాపక్షం / హుస్నాబాద్ :** దేశంలో నేడు పరిపాలన నేరచరిత, కార్పొరేట్ల చేతుల్లోకి పోయిందని, వారిని నియంత్రించాలంటే భారత ఎన్నికల సంఘానికి సర్వాధి కారాలు కట్టబెట్టాలని, అప్పుడే నిజమైన పరిపాలన ప్రజలకు అందుతుందని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడవెంకటరెడ్డి డిమాండ్ చేశారు. గురువారం అయన సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో సిపిఐ భవన్‌లో సిపిఐ జిల్లా కార్యదర్శి మంద పవన్‌తో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ దేశంలో పరిపాలన సవ్యంగా నడవాలంటే ముందు కార్పొరేటర్‌శక్తులు, నేరచరితులను కట్టడి చేసి ప్రజాస్వామ్యం పద్ధతిలో ఎన్నికలు నిర్వహించాలని అయన డిమాండ్ చేశారు. వాటిని కట్టడి చేయాలంటే ఎన్నికల సంఘానికి పూర్తి అధికారం కట్టబెట్టాలని అయన ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. అలాగే అధికారం కోసం కొన్ని పార్టీలు ఉచిత పథకాలను అమలు చేసి, అధికారం చేపట్టాక ప్రజలకు చేసేది ఏమీలేదు కాని వారి అనుంగులకు పదవులు కట్టబెట్టి దోపిడీలకు పరోక్షంగా ఊతమిస్తున్నాయని ఆరోపించారు. కొంత మంది పలుకుబడి ఉన్న నాయకులు డబ్బులతో ఎన్నికల్లో గెలిచాక పదవుల కోసం పార్టీలు మారుతూ వారికి ఓటు వేసిన ప్రజలను నడిబజారులో అవహేళన చేస్తున్నారని అవేదన వ్యక్తం చేశారు. గెలిచిన నాయకుడు పార్టీ మారితే వెంటనే పదవిని రద్దుచేసే అధికారం స్పీకర్‌కు సర్వాధికారాలు ప్రభుత్వం కల్పించాలని డిమాండ్ చేశారు. నేడు పార్లమెంటులో, అసెంబ్లీల్లోను సగానికి పైగా నేరచరితులే ఉన్నారని అరోపించారు. ఉచిత పథకాలను ప్రకటించడం ఎంతమాత్రం మంచిది కాదని నేడు సుప్రీం కోర్టు వ్యతిరేకించిందని గుర్తు చేశారు. ఉచితాల బదులు పంటలు పండించే రైతుకు, రోజు కూలీ పనులను చేసుకునే వారికి మద్దతు ధర కల్పించి కూలీకి సరైన రేట్లు ఇవ్వాలని, అలాగే ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్నం భోజనం పెట్టేవారికి సకాలంలో బిల్లులు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నవారిని వెంటనే సకాలంలో ప్రభుత్వాలు అదుకోవాలని అయన కోరారు. సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు గడిపే మల్లేశ్, జిల్లా కార్యవర్గ సభ్యులు జాగీరు సత్యనారాయణ, ఎడల వనేశ్, అక్కన్నపేట, కోహెడ మండల కార్యదర్శులు కె.భాస్కర్, మంజ గోపి, సిపిఐ నాయకులు సంజీవరెడ్డి, సుదర్శనచారి, రాజు, ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి జెరిపోతుల జనార్ధన్, మహిళానాయకురాలు పద్మ, విజయ ఎల్లయ్య, మల్లారెడ్డి పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటం

**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** ప్రజా సమస్యలపై సిపిఐ ఆధ్వర్యంలో రాజీలేని పోరాటాలు చేస్తామని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడా వెంకట్ రెడ్డి అన్నారు. గురువారం రోజున పెద్దపల్లి జిల్లా కేంద్రంలో సిపిఐ జిల్లా స్థాయి సమావేశం జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం అధ్యక్షతన జరుగగా ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అనంతరం మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కులగణనలో పాల్గొననివారికి మరొక అవకాశం కల్పించడం న్యాయబద్ధమేనని, తెలంగాణ ప్రభుత్వం ప్రజా పాలనలో ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని, పేదలకు ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డు లేని వారికి రేషన్ కార్డులు, రైతుబంధు పడని రైతులకు రైతుబంధు పడేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. అనంతరం సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవే న శంకర్ మాట్లాడుతూ రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ తరపున నిలబడే అభ్యర్థులను గెలిపించుకొని తమ సత్తా చాటాలని పిలుపునిచ్చారు. పార్టీ సభ్యత్వాలను త్వరగా పూర్తిచేసి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు గోసిక మోహన్, గౌతమ్ గోవర్ధన్, కడారి సునీల్, కే కనకరాజ్, తాళ్లపల్లి మల్లయ్య, కోడం స్వామి, ఓదెమ్మ తదితరులు పాల్గొన్నారు.



## క్షయ నిర్మూలనే ప్రభుత్వ లక్ష్యం

మంత్రి దామోదర్ రాజనర్సింహ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో క్షయ నిర్మూలన లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తున్నదని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. క్షయ వ్యాధి నిర్మూలనలో భాగంగా రాష్ట్రంలో అదిలాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, సూర్యాపేట, కరీంనగర్, పెద్దపల్లి, మెదక్, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి జిల్లాలలో (9 జిల్లాలలో) 100 రోజులపాటు క్షయ వ్యాధి నిర్మూలన కార్యక్రమాలను ఉధృతంగా నిర్వహిస్తున్నామని వివరించారు. రాష్ట్ర వ్యాప్తంగా అవగాహన, యాక్టివ్‌నెస్ ఫైండింగ్ క్యాంపులను నిర్వహిస్తున్నామన్నారు. 'నిక్షయ్ మిత్ర' కార్యక్రమంలో భాగంగా క్షయ బాధితులకు న్యూట్రిషన్ ఫుడ్‌ను అందిస్తున్న ఆరాజన్ ఫౌండేషన్, ఆప్టిమస్ డ్రగ్స్, బయోలాజికల్ ఈ, గ్లాండ్ ఫార్మా, మెట్రో కెమ్, నాట్కో ఫార్మా, గ్రాన్యూల్స్, సన్ ఫార్మాస్యూటికల్ కంపెనీల ప్రతినిధులకు మంత్రి దామోదర్ రాజనర్సింహ హైదరాబాద్‌లోని తన నివాసంలో గురువారం ప్రశంసా పత్రాలను అందజేశారు. 9 జిల్లాలలో 8 ఫార్మా కంపెనీలు క్షయ బాధితులకు రూ.2.8 కోట్ల విలువైన ఫుడ్ బాస్కెట్ (కిట్స్)ను తమ కార్పొరేట్ సామాజిక బాధ్యత నిధులతో చికిత్స కాలం పూర్తయ్యే వరకు ప్రతి నెలా న్యూట్రిషన్ కిట్స్‌ను అందిస్తున్నందుకు ఆ కంపెనీలను మంత్రి అభినందించారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర్ రాజనర్సింహ మాట్లాడుతూ క్షయ రహిత తెలంగాణ లక్ష్యంగా క్షయ వ్యాధి విస్తరించకుండా రాష్ట్ర వ్యాప్తంగా నిరంతరం స్క్రీనింగ్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ప్రభుత్వ కార్యదర్శి డాక్టర్ క్రిస్టినా చొంగ్తూ, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ఆర్.వి.కర్ణన్, డ్రగ్స్ కంట్రోల్ అథారిటీ డైరెక్టర్ జనరల్ కమలాసన్ రెడ్డి, టిబి కంట్రోల్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ రాజేశం, డ్రగ్స్ కంట్రోల్ డిప్యూటీ డైరెక్టర్ రామ్‌దాన్, డాక్టర్ శ్రీగణ, డా.మహేష్ తదితరులు పాల్గొన్నారు.



## మినీ మేడారం జాతరకు పోటెత్తిన భక్తజనం

వనదేవతలను దర్శించుకున్న మంత్రి సీతక్క

**ప్రజాపక్షం/ములుగు ప్రతినిధి :** తెలంగాణ రాష్ట్ర ప్రజలు వన దేవతలు సమ్మక్క సారలమ్మ దీవెనలు ఆశీర్వాదాలు ఉండాలని మంత్రి సీతక్క అన్నారు. గురువారం తాడ్వాయి మండలంలోని మినీ మేడారం సందర్భంగా వన దేవతలకు మొక్కులు మంత్రి సీతక్క చెల్లించుకున్నారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మినీ మేడారం జాతరకు అన్ని ఏర్పాట్లు చేసిందని, భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా డ్రింకింగ్ వాటర్, క్యూలైన్‌లో భక్తులకు ఇబ్బందులు లేకుండా చేశామని ఎప్పటికప్పుడు అధికారులు జాతరపై దృష్టి పెట్టి ఇబ్బందులు తలెత్తకుండా చూస్తున్నారని, ఈ మినీ మేడారం జాతరకు ఇప్పటికే సుమారు రూ.6లక్షల మంది భక్తులు తల్లులకు మొక్కులు చెల్లించారు. ఇంకా రెండు రోజులపాటు సాగే తెలంగాణ కుంభమేళా మినీ మేడారం జాతరకు భక్తులు పెద్దఎత్తున తరలివచ్చే అవకాశం ఉంటుంది. కాబట్టి భక్తులకు ఇబ్బందులు లేకుండా బస్ సౌకర్యం కల్పించడం మరుగుదొడ్ల నిర్మాణం, జంపన్న వాగు ఒడ్డున స్నాన ఘట్టాలు ఏర్పాటు చేశామని మంత్రి అన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి వెంట ఆదిలాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి ఆత్రం సుగుణ, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ జాటోత్ రవిచందర్‌తో పాటు పూజారులు, అధికారులు, కాంగ్రెస్ పార్టీ జిల్లా, బ్లాక్, మండల, గ్రామ నాయకులు, కార్యకర్తలు, తదితరులు ఉన్నారు.



## రోడ్లు, భవనాల శాఖ ఆస్తుల సంరక్షణకు చర్యలు

ఎస్‌సి, ఎస్‌టి సబ్ ప్లాన్ చట్టం మేరకు రహదారుల నిర్మాణం చేపట్టండి

రీజినల్ రింగ్ రోడ్డు పనులు వేగవంతం చేయండి

రోడ్లు, భవనాల శాఖ ప్రీ బడ్జెట్ సమావేశంలో డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

**ప్రజాపక్షం / హైదరాబాద్ :** రాష్ట్రవ్యాప్తంగా రోడ్లు, భవనాల శాఖకు ఉన్న ఆస్తులపై నివేదిక రూపొందించాలని, పెద్ద సంఖ్యలో ఉన్న విలువైన ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా అధికారులు అన్ని స్థాయిల్లో చర్యలు చేపట్టాలని అధికారులను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఆదేశించారు. డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ సచివాలయంలో గురువారం రోడ్లు, భవనాల శాఖ ప్రీ బడ్జెట్ సమావేశంలో పలు అంశాలు చర్చించారు. ఎస్‌సి, ఎస్‌టి సబ్ ప్లాన్ చట్టం మేరకు రోడ్లు భవనాల శాఖ అధికారులు పనులు చేపట్టి నిధులు సద్వినియోగం చేయాలని అధికారులను డిప్యూటీ సిఎం ఆదేశించారు. ఎస్‌సి, ఎస్‌టి సబ్ ప్లాన్ చట్టం కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో తీసుకువచ్చామని, గత పదేళ్లు పరిపాలించిన ప్రభుత్వం ఈ సబ్ ప్లాన్ చట్టాన్ని నిర్లక్ష్యం చేశారని భట్టి విక్రమార్క తెలిపారు. తిరిగి ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో ఎస్‌సి, ఎస్‌టి సబ్ ప్లాన్ పూర్తిస్థాయిలో అమలుకు చర్యలు తీసుకోవాలని డిప్యూటీ సిఎం ఆదేశించారు. ఈ చట్టం నిధుల మేరకు స్థానికంగా పనులు చేపడుతున్న విషయాన్ని ఆ ప్రాంత నేతలు, ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత రోడ్లు, భవనాల శాఖ అధికారులపై ఉందని డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు.

**రీజినల్ రింగ్ రోడ్డు పనులు వేగవంతం చేయండి :** రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్) నిర్మాణ పనులను వేగవంతం చేయాలని అధికారులను డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క, రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఆదేశించారు. రీజినల్ రింగ్ రోడ్డు డిపిఆర్, 3డి డిజైన్లు వంటి పనులు వేగవంతం చేయాలని, నిధుల కొరతలేదని, ఎంత వేగంగా పనులు చేపడితే అంత వేగంగా నిధులు మంజూరు చేస్తామని డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క అధికారులకు భరోసా ఇచ్చారు. హైబ్రిడ్ యాన్యూటీ హెడ్ (హెచ్ఎఎం) రహదారుల నిర్మాణం వేగవంతం చేయాలని ఆదేశించారు. జిల్లా కేంద్రాల నుంచి రాష్ట్ర రాజధానికి వచ్చే రహదారులు పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయాలని కోరారు. వివిధ పనుల కోసం ప్రతిరోజు వేలాది మంది జిల్లా కేంద్రాల నుంచి హైదరాబాద్‌కు వస్తుంటారని వివరించారు. కొత్త ఎయిర్ పోర్టుల నిర్మాణానికి రోడ్లు, భవనాల శాఖ విస్తృతంగా ఏర్పాట్లు చేస్తున్న క్రమంలో ఏవియేషన్ రంగానికి తగిన ప్రోత్సాహం అందిస్తామని మంత్రులు తెలిపారు. సమావేశంలో ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీలు రామకృష్ణారావు, వికాస్‌రాజ్, డిప్యూటీ సిఎం స్పెషల్ సెక్రటరీ కృష్ణ భాస్కర్, సెక్రటరీ దాసరి హరిచందన, ఆర్థిక శాఖ సెక్రెటరీ హరిత తదితరులు పాల్గొన్నారు.

## రాజ్యాంగంపై, ప్రజాస్వామ్యంపై గౌరవంలేని .. పాలకుల చేతిలో మగ్గుతున్న దేశం

ప్రతిపక్ష పాలిత ప్రభుత్వాలను కూల్చేసే పనిలో కేంద్ర బిజెపి

ప్రజలకు ఏ కష్టమొచ్చినా గుర్తొచ్చేది ఎర్రజెండానే

సిపిఐ శత వసంతోత్సవాలు పార్టీ, ప్రజా సంఘాల నిర్మాణం కోసం నాంది కావాలి

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు




**ప్రజాపక్షం / పాల్వంచ :** రాజ్యాంగంపై, ప్రజాస్వామ్యంపై గౌరవంలేని పాలకుల చేతిలో దేశం మగ్గుతోందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. గురువారం పట్టణ పరిధిలోని వాసవి బాంకెట్ హాల్‌లో సిపిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సమితి సభ్యుల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన కూనంనేని మాట్లాడుతూ.. ప్రతిపక్ష పాలిత ప్రభుత్వాలను కూల్చేసే పనిలో కేంద్ర బిజెపి ప్రభుత్వం ఉందని, అధికారం కోసం బిజెపి ఎంతకైనా తెగిస్తున్నారని, అందులో భాగంగానే అక్రమ కేసులు పెట్టి సిబిఐ, ఇడి ద్వారా దాడులు జరుపుతూ ప్రతిపక్షాలను భయపెడుతున్నారని విమర్శించారు. మావోయిస్టులను మార్చి వరకు లేకుండా చేస్తామని అమిత్ షా ప్రకటన వెనక ఆంతర్యం ఏంటి అని, ప్రశ్నించే గొంతుకులను నలిపి వేయటమే బిజెపి ఎజెండాగా పెట్టుకుందని విమర్శించారు. పేద ప్రజలు, కష్టజీవులు, కర్షకులు, కార్మికుల పార్టీ సిపిఐ అని, సుదీర్ఘ పోరాటాలు, త్యాగాలతో నిర్మితమైన ఎర్రజెండా పార్టీకి ఎదురులేదని, ప్రజలకు ఏ కష్టమొచ్చినా గుర్తొచ్చేది ఎర్రజెండానేని అన్నారు. సమ సమాజ స్థాపన సోసిలిస్టు రాజ్యసాధనే కమ్యూనిస్టుల లక్ష్యం అని, అందుకోసం ఎటువంటి త్యాగాలకైనా వెనకాడబోమని స్పష్టం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు వచ్చినా ఎదుర్కొనేందుకు సిపిఐ సిద్ధంగా ఉందని, పొత్తులు, సర్దుబాట్లు ఎన్నికలు వచ్చినప్పుడు నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు. జిల్లాలో ప్రతి పంచాయతీలో సిపిఐకి ప్రాతినిధ్యం వచ్చే విధంగా కార్యకర్తలు, నాయకులు కార్యాచరణ రూపొందించుకోవాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే జిల్లా వ్యాప్తంగా సిపిఐ శత వసంతాల వేడుకలను ఘనంగా నిర్వహించాలని, శత వసంతాల వేడుకలతో పార్టీ ప్రజా సంఘాలను మరింత బలోపేతం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్ పాషా, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి.అయోధ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం, సర్‌రెడ్డి పుల్లారెడ్డి, ఎస్‌డి.సలీం, కె.సారయ్య, కల్లూరి వెంకటేశ్వరరావు, కమటం వెంకటేశ్వర్లు, మున్నా లక్ష్మి కుమారి, నారాటి ప్రసాద్, సలిగంటి శ్రీనివాస్, రేసు పుల్లయ్య, దేవరకొండ శంకర్, పట్టణ, మండల కార్యదర్శులు వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, వాసిరెడ్డి మురళి, భూక్యాదస్రు, బంధం నాగయ్య, గుగులోత్ రామ్‌చందర్, డి.సుధాకర్, జి.రామకృష్ణ, సతీష్, కేశవరావు, నారాయణ, యూసుఫ్, ధర్మ, కృష్ణ, జిల్లా సమితి సభ్యులు, ప్రజా సంఘాల జిల్లా బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.

## నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్‌పై ప్రత్యేక దృష్టి పెట్టండి

డిప్యూటీ కమిషనర్ పి.దశరథ్ ఆదేశాలు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రభుత్వ ఆధాయానికి గండి కొడుతున్న నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలని రంగారెడ్డి ఎక్సైజ్ డివిజన్ డిప్యూటీ కమిషనర్ పి.ధశరథ్ అన్నారు. నాంపల్లిలోని అబ్కారీ భవన్‌లో రంగారెడ్డి జిల్లా ఎక్సైజ్ అధికారుల సమీక్షా సమావేశం బుధవారం జరిగింది. ఈ సమావేశంలో అధికారులను ఉద్దేశించి దశరథ్ మాట్లాడుతూ.. నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్‌ను అరికట్టినప్పుడే ఎక్సైజ్ లిక్కర్ అమ్మకాలు పెరుగుతాయని పేర్కొన్నారు. నాన్‌డ్యూటీ పెయిడ్ లిక్కర్‌తో పాటు గంజాయి, డ్రగ్స్ అమ్మకాలపై కూడా నిఘా పెంచాలన్నారు. ఆయా కేసుల్లో పట్టుబడి స్టేషన్‌లలో నిల్వ ఉన్న గంజాయి, డ్రగ్స్‌ను వెంటనే డిస్పోజల్ కమిటీ అనుమతి తీసుకొని కాల్చివేయాలని, చాలా కేసుల్లో ఎక్సైజ్ పోలీస్ స్టేషన్లలో ఉన్న వాహనాలను కూడా సంబంధిత ఓనర్లకు నోటీసులు ఇచ్చి వేలం పెట్టాలని సూచించారు. జనవరిలో 197 కేసుల్లో 149 మందిని అరెస్టు చేయగా, 7904 కేజీల బెల్లం, 40 కేజీల అలం, 81.72 కేజీల గంజాయిని, ఇతర డ్రగ్స్‌ను పట్టుకోవడం పట్ల డిప్యూటీ కమిషనర్ సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో డిప్యూటీ కమిషనర్‌తో పాటు అసిస్టెంట్ కమిషనర్ ఆర్.కిషన్, శంషాబాద్, సరూర్‌నగర్, మేడ్చల్, మల్కాజిగిరి, వికారాబాద్ ఎక్సైజ్ సూపరిండెంట్లు కృష్ణప్రియ, ఉజ్వల రెడ్డి, ఫయాజొద్దీన్, నవీన్, విజయ భాస్కర్‌లతోపాటు ఎఐఎస్, ఎస్‌హెచ్‌ఒలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

## అమెరికాలోని విదేశీయుల పట్ల.. ట్రంప్ ప్రభుత్వ చర్యలు అమానవీయం




**ప్రజాపక్షం /హైదరాబాద్ :** అమెరికాలోని విదేశీయుల పట్ల అక్కడి ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు దుర్మార్గమని అఖిల భారత శాంతి సంఘీభావ సంఘం నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అమెరికాలో అక్రమంగా ఉండడంతో పాటు పార్ట్‌టైం ఉద్యోగాలు చేస్తున్నారంటూ వారి చేతులకు, కాళ్లకు ఇనుప సంకెళ్ళు వేసి సైనిక విమానంలో అవమానకర పద్ధతిలో వారి దేశాలకు తిరిగి పంపించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. అఖిల భారత శాంతి సంఘీభావ సంఘం తెలంగాణ రాష్ట్ర కమిటీ (ఐప్సో) ఆధ్వర్యంలో విదేశీయుల పట్ల అమెరికా ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును నిరసిస్తూ మానవ హక్కులను అంతర్జాతీయ న్యాయ సుత్రాలను కాపాడాలని డిమాండ్ చేస్తూ గురువారం హైదరాబాద్ ట్యాంక్‌బండ్ వద్ద గల అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో ఎఐపిఎస్ఒ జాతీయ నేత మాజీ ఎంఎల్‌సి పీస్ అవార్డు గ్రహీత కె.యాదవరెడ్డి, ఐప్సో జాతీయ అధ్యక్ష వర్గ సభ్యులు డాక్టర్ డి. సుధాకర్, రాష్ట్ర అధ్యక్షుడు బొమ్మగాని ప్రభాకర్, రాష్ట్ర సమన్వయ ప్రధాన కార్యదర్శి కెవిఎల్, ప్రధాన కార్యదర్శి జి.నాగేశ్వరరావు, కాచం సత్యనారాయణ, పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఐప్సో నాయకులు మాట్లాడుతూ అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ ప్రమాణ స్వీకారం చేసినప్పటి నుంచి అంతర్జాతీయ సమాజంలో ఆందోళనకర పరిస్థితులు నెలకొన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అమెరికాలో ఉన్న విదేశీయులు పార్ట్ టైం ఉద్యోగాలు చేయకూడదని అమానవీయ పద్ధతుల్లో తిప్పిపంపించడం గర్హనీయమని పేర్కొన్నారు. ఒకవైపు యుద్ధాలను నిలువరిస్తామని చెబుతూనే మరోవైపు గాజాను సొంతం చేసుకుంటామని, పాలస్తీనీయులు ఎవరూ తిరిగి రావడానికి వీలులేదంటూ ఇజ్రాయిల్‌తో ఒప్పందాలు చేసుకోవడం లాంటి చర్యలు ప్రపంచ శాంతికి తీవ్ర భంగకరమని తెలిపారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తన సామ్రాజ్యవాద పెత్తందారీ విధానాలతో పాటు విదేశీయుల పట్ల అవమానకర పద్ధతుల్లో వ్యవహరిస్తున్న తీరును మానుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐప్సో రాష్ట్ర నాయకులు డా.సమత, సుదావన్, విజయలక్ష్మి పండిత్, మూర్తి, మెట్ల జగన్, డి.జి.నరేంద్రప్రసాద్ ఉమామహేశ్, జె.కె.శ్రీనివాస్, పోలగాని రవికిరణ్, కిరణ్, హసన్, నరేంద్రప్రసాద్, రజాక్, హర్షద్ తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు ఇస్తున్న ఉచితాలపై.. న్యాయమూర్తుల వ్యాఖ్యలు దురదృష్టకరం

సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.ఎస్.బోస్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఎన్నికల సమయంలో రాజకీయ పార్టీలు ప్రకటిస్తున్న ఉచితాలకు వ్యతిరేకంగా న్యాయమూర్తులు మాట్లాడటం విచారకరమని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.ఎస్.బోస్ అన్నారు. ఈ మధ్య కాలంలో పేదలకు ఇచ్చే ఉచితాలపై అనేకమంది వ్యతిరేకంగా మాట్లాడుతున్నారని, ఇదేక్రమంలో సుప్రీం కోర్టు న్యాయమూర్తులు సైతం అలాంటి వారితో గళం కలపడం దురదృష్టకరమని ఆయన పేర్కొన్నారు. న్యాయమూర్తులు ఒక అడుగు ముందుకువేసి ఉచితాల మూలంగా పేదవారు సోమరిపోతులవుతున్నారని, వ్యవసాయ పనులతో పాటు ఇతర పనులకు కూడా రావటంలేదనడం బాధాకరమన్నారు. ఈ వ్యాఖ్యలు చేసిన ఇద్దరు న్యాయమూర్తుల్లో ఒకరు తాను వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చానని, వ్యవసాయదారుల బాధలు తనకు తెలుసని వ్యాఖ్యానించారన్నారు. ఒక రైతు బిడ్డ సుప్రీంకోర్టు న్యాయమూర్తి అయినందుకు సంతోషించాల్సిన విషయమే, కానీ అలాంటి వ్యక్తి రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర కోసం రైతులు పోరాడుతూ ప్రాణాలు కోల్పోతుంటే ఈ న్యాయమూర్తి గిట్టుబాటు ధరపై చట్టం చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించకపోవటం అర్థంకాని విషయమని బోస్ పేర్కొన్నారు. ఇదే సందర్భంలో ప్రభుత్వాలు కార్పొరేట్ సంస్థలకు ఉచిత భూమి, నీరు, విద్యుత్‌తో పాటు తక్కువ వడ్డీతో బ్యాంక్ రుణాలు, వారి ఆదాయపు పన్నును తగ్గించటం లాంటి చర్యలు పేదల ఉచితాలు వ్యతిరేకించేవారికి కనిపించటం లేదా అని ఆయన ప్రశ్నించారు. పేదలకు ఇచ్చేది ఉచితాలుగాను, పెట్టుబడిదారులకు ఇచ్చేది సముచితాలుగాను ప్రచారం చేయటం సామాజికంగా సహించరాని విషయమన్నారు. ఇలాంటి ఆలోచనలు సమాజంలోని అభ్యుదయవాదులందరూ తమ గళం విప్పి వ్యతిరేకించాల్సిందిగా కోరారు. గతంలో పనిగంటలు పెంచాలన్న ఎల్అండ్‌టి చైర్మన్ మరొకసారి ఉచితాలకు వ్యతిరేకంగా వ్యాఖ్యానించటం అతని దోపిడీ నీతికి తార్కాణం పడుతుందని బోస్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పేదల ఉచితాలకు వ్యతిరేకంగా మాట్లాడే వారు తమ విధానాన్ని విడనాడి సామాజిక న్యాయం గురించి మాట్లాడాలని కోరారు. న్యాయమూర్తులు రాజ్యాంగంలోని మౌలిక సూత్రాలను ప్రభుత్వాలు అమలు చేసేలా ప్రయత్నించాలని విజ్ఞప్తి చేశారు. పేదల ఉచితాలపై వ్యతిరేక భావన మితిమీరితే సామాజిక విప్లవం రాకతప్పదని హెచ్చరించారు.

## 19నతెలంగాణ వైద్య విధాన పరిషత్ కమిషనర్ కార్యాలయం ముట్టడి రద్దు

ఎఐటియుసి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** టివివిపి ఆసుపత్రుల కాంట్రాక్ట్ కార్మికుల పెండింగ్ వేతనాలను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 19న తలపెట్టిన తెలంగాణ వైద్య విధానపరిషత్ కమిషనర్ కార్యాలయం ముట్టడి కార్యక్రమం రద్దు చేసినట్లు తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) ప్రకటించింది. ఈమేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేసింది. టివివిపి పరిధిలో ఆసుపత్రుల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు శానిటేషన్, పేషెంట్ కేర్, సెక్యూరిటీ కార్మికుల 7 నెలల పెండింగ్ వేతనాలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం రూ.7.78 కోట్లు బడ్జెట్ విడుదల చేసిందని ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షుడు ఎండి.యూసుఫ్, యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ తెలిపారు. దీంతో 19న నిర్వహించాలనుకున్న తెలంగాణ వైద్య విధానపరిషత్ కమిషనర్ కార్యాలయం ముట్టడి కార్యక్రమాన్ని విరమించుకున్నట్లు వారు వెల్లడించారు. పెండింగ్ వేతనాలు తక్షణమే విడుదల చేయాలని లేకపోతే ఆందోళన కార్యక్రమాలను మరింత ఉధృతం చేస్తామని యూనియన్ ఆధ్వర్యంలో ఈనెల10 తేదీన కమిషనర్‌కు నోటీసు అందజేయడం జరిగిందని తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం నిధులను విడదల చేయడం హర్షనీయమని వారు పేర్కొన్నారు. ప్రభుత్వం నుండి బడ్జెట్ రిలీజ్ అయినందున స్థానిక ఆసుపత్రుల సూపరింటెండెంట్‌లు, జిల్లా డిసిహెచ్‌ఎస్‌లు వెంటనే చొరవ తీసుకొని కార్మికులకు వారి అకౌంట్లో జీతాలు పడేవిధంగా తగు చర్యలు తీసుకొని న్యాయం చేయాలని వారు కోరారు. కార్మికుల జీతాలు ప్రతినెలా ఆలస్యం కాకుండా చర్యలు రాష్ట్ర ప్రభుత్వం తీసుకోవాలన్నారు. వేతనాల కోసం గత 15 రోజులుగా పోరాటాలు నిర్వహిస్తున్న కాంట్రాక్ట్ శానిటేషన్, పేషంట్ కేర్, సెక్యూరిటీ కార్మికులకు వారు ఈ సందర్భంగా యూనియన్ తరపున ధన్యవాదాలు తెలిపారు.

## 19న బిఆర్ఎస్ కార్యవర్గ విస్తృత స్థాయి సమావేశం

పలు అంశాలపై చర్చ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బిఆర్ఎస్ రాష్ట్ర కార్యవర్గ విస్తృత స్థాయి సమావేశాన్ని ఈనెల 19న హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో నిర్వహించాలని బిఆర్ఎస్ అధ్యక్షుడు కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు నిర్ణయించారు. టిఆర్ఎస్(బిఆర్ఎస్) ఆవిర్భవించి 25 ఏళ్లు కావొస్తున్న నేపథ్యంలో సిల్వర్ జూబ్లీ వేడుకల నిర్వహణతో పాటు పార్టీ సభ్యత్వ నమోదు, నిర్మాణం తదితర నిర్మాణాత్మక అంశాలపై విస్తృత స్థాయిలో చర్చించనున్నారు. విస్తృత స్థాయి సమావేశాన్ని నిర్వహించాలని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావును కెసిఆర్ ఆదేశించారు. 19న మధ్యాహ్నం 1 గంటకు కెసిఆర్ అధ్యక్షతన పార్టీ విస్తృత స్థాయి సమావేశం జరగనుంది. ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గం, జిల్లా అధ్యక్షులు, ప్రస్తుత, మాజీ ఎంపిలు, ఎంఎల్‌సిలు, ఎంఎల్ఎలు, వివిధ కార్పొరేషన్ మాజీ చైర్మన్లు, జిల్లాపరిషత్ చైర్మన్లు, డిసిసిబి, డిసిఎంఎస్ అధ్యక్షులు, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జీలతో సమీక్షా సమావేశం నిర్వహించనున్నామని కెటిఆర్ తెలిపారు.

GREATER HYDERABAD MUNICIPAL CORPORATION
హైదరాబాద్ మహానగర పాలక సంస్థ
**NIT No. 38, పని పేరు: 4 పనుల కొరకు** జిహెచ్ఎంసి, రాజేంద్రనగర్ సర్కిల్-11లో ఆర్‌సిసి బాక్స్ డ్రెయిన్ నిర్మాణం మరియు ఆర్ఎంసితో సిసి రోడ్ వేయడం, **అంచనా విలువ / ఇసివి:** రూ.44.25 లక్షలు, **డౌన్‌లోడింగ్ ప్రారంభ తేది & సమయం:** 15.02.2025న మ.2.30గం.ల నుండి, **బిడ్ స్వీకరణకు ఆఖరి తేది & సమయం:** 19.02.2025న మ.2.45 గం.ల వరకు. **ఇఇ/ఎస్ఇ పేరు & చిరునామా:** ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, రాజేంద్రనగర్ డివిజన్ నెం.11, జిహెచ్ఎంసి. సెల్ నెం. 9989930608. ఇ-మెయిల్ ఐడి: eec11.ghmc2@gmail.com
**సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డివిజన్-11, (ఆర్‌జెఎన్ఆర్), జిహెచ్ఎంసి.**
DIPR R.O. No. : 10254-PP/CL/ADVT/1/2024-25, Date: 13-02-2025

ప్రజాపక్షం
శుక్రవారం, ఫిబ్రవరి 14

# ఉచితం అనుచితమా?

రాజకీయ పార్టీలు ప్రకటిస్తున్న ఉచితాలు పరాన్నభుక్కుల వర్గాన్ని సృష్టించడం లేదా? అని దేశ సర్వోన్నత న్యాయస్థానం బుధవారం చేసిన వ్యాఖ్యలు మరోసారి అందరి దృష్టిని ఉచితాల వైపు తిప్పాయి. దేశ రాజధానిలో తలదాచుకునేందుకు గూడు లేని నిర్భాగ్యులకు రాత్రి పూట ఆశ్రయమిచ్చేందుకు సరిపడా నైట్ షెల్టర్స్ ఏర్పాటుపై దాఖలైన పిటిషన్‌లపై జస్టిస్ గవాయ్, జస్టిస్ ఎ.డి.మసీహ్‌ల ద్విసభ్య ధర్మాసనం విచారణ సందర్భంగా న్యాయమూర్తుల నుంచి ఈ వ్యాఖ్యలు వినిపించాయి. పిటిషనర్ తరపు వకీలు ప్రశాంత్ భూషణ్ విపరీతమైన ఢిల్లీ చలికి ఈసారి ఇళ్ళు లేని 750 మంది మరణించారంటూ పరిస్థితి గంభీరతను వివరించారు. అప్పుడు జస్టిస్ గవాయ్ కల్పించుకొని “ దురదృష్టవశాత్తు ఎన్నికలకు ముందు ప్రకటిస్తున్న ఉచితాల కారణంగా, లాడ్ కీ బహిన్, తదితర పథకాలతో ప్రజలు పని చేసేందుకు అనాసక్తతతో ఉన్నారు. వారికి ఉచిత రేషన్ వస్తుంది. ఏ పని చేయకుండానే డబ్బులు వస్తున్నాయని” అభిభాషణం చేశారు. అదే ఊపులో తన స్వీయానుభవాన్ని వ్యక్తీకరిస్తూ తాను వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చానని, మహారాష్ట్రలో ఉచితాల కారణంగా వ్యవసాయదారులకు కూలీలు దొరకడం లేదని ఉద్ఘాటించారు.

విషయం లోతుల్లోకి వెళ్ళకుండా వ్యవసాయానికి కూలీలు దొరక్కపోవడానికి ఉచితాలే కారణమని ఉన్నత స్థాయిలో కూడా వ్యాఖ్యలు చేయడం బాధాకరమే. ఇదొక విధంగా రైతుకు అభిముఖంగా వ్యవసాయకూలీలను నిలిపే పరోక్ష వైరం లాంటిది.

జస్టిస్ గవాయ్ రెండు అంశాలను ప్రస్తావించారు. ఒకటి ఉచితాలతో ప్రజలు పరాన్నభుక్కులుగా మారడం, రెండవది వ్యవసాయానికి కూలీలు లభించకపోవడం. అసలు ఉచితాలు ప్రకటించే పరిస్థితి ఎందుకు కొనసాగుతుంది? చేతికి సరిపడ పని, చేసిన పనికి సరైన వేతనం లభించకపోవడం ప్రధాన కారణాలుగా కనపడుతున్నాయి. రాజ్యాంగ ంలో ప్రకటించుకున్న సంక్షేమ రాజ్యమనే భావన, ఆదేశిక సూత్రాల లోని 47వ అధికరణ దీనికి మూలాలు. 1991లో ప్రవేశపెట్టిన సరళీకరణ, ప్రైవేటీకరణ,ప్రపంచీకరణ విధానాలతో ఉద్యోగ భద్రత, కనీస వేతనం, ఉపాధి గాలిలో దీపంగా మారాయి. ఒకవైపు, మనల్ని రెండు శతాబ్దాలు పరిపాలించిన బ్రిటీషు దేశాన్ని దాటుకొని ప్రపంచంలోనే ఐదవ పెద్ద ఆర్థిక వ్యవస్థగా మారామని, 2030 నాటికి తృతీయ ఆర్థిక వ్యవస్థగా ఎదగడమే లక్ష్యంగా పెట్టుకున్నామని ఏలినవారు జబ్బలు చరుచుకుంటున్నారు. ప్రధానమంత్రి మోదీ అస్మదీయుడైన పారిశ్రామికవేత్త గౌతమ్ అదానీ భారత ఆర్థిక వ్యవస్థతో సరిసమానంగా దూసుకెళ్ళి ఒక దశలో ప్రపంచ ధనికుల జాబితాలో మూడవ స్థానంలో నిలిచారు. మరోవైపు, 2024లో అంతర్జాతీయ ఆకలి సూచిలో 124 దేశాల నడుమ భారత్ 105వ స్థానంలో నక్కింది. ఈ ద్వైదీభావం దేనికి సంకేతం? పెరిగిన సంపద ప్రజలలో పంపిణీ కాకుండా గుప్పెడుమంది ఖజానాలో రంకెలేస్తున్నది. వాస్తవాల నుంచి దృష్టి మరల్చేందుకు పెట్టుబడిదారీ వ్యవస్థకు ఊడిగం చేసే పాలకులు ఉచితాల పేరుతో ప్రజల మీదకు పేలాలను విసురుతున్నారు. ఎన్నికల్లో తామే విజేతలయ్యేందుకు రాజకీయ పార్టీలు పోటీ పడి ఉచితాలను, చేతికిచ్చే నగదు మొత్తాన్ని హ్రరాజు పాటలా పెంచుకుంటూ పోతున్నాయి. ప్రజలు సోమరులుగా, పరాన్నభుక్కులుగా మారుతున్నారనే మాట అతిశయోక్తే. పెరిగిన ధరలు, అవసరాలతో ఉచితాల పేరుతో చేతికొచ్చే మొత్తం వారం రోజులకు కూడా సరిపోదు. అయినప్పటికీ, వ్యవసాయానికి కూలీలు ఎందుకు దొరకడం లేదనే ప్రశ్న తలెత్తుతుంది? వ్యవసాయ యాంత్రీకరణ పెరిగి వరినాట్లు, కోతలను మిషన్‌ల వాడుక పెరిగాక కూలీలకు ఉపాధి తగ్గడంతో చాలా మంది ప్రత్యామ్నాయంగా పట్టణాలకు వలసబాట పట్టారు. ఫలితంగా గ్రామాలలో పాత కూలీల సంఖ్య తగ్గడం, నిలకడ లేని ఆదాయం కారణంగా కొత్తవారు ఈ రంగంవైపు కన్నెత్తకపోవడంతో మిగిలిన కూలీలకు డిమాండ్ పెరిగింది. పెరిగిన డిమాండ్, ధరలు, అవసరాలకు తగ్గట్టుగా అధిక కూలీ ఆశించడం సహజమే. రైతుపై భారం పడుతుంది. ఇందుకు పరిష్కారంగా మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయంతో అనుసంధానించాలని రైతు సంఘాలు, వ్యవసాయ కూలీ సంఘాలు ఎప్పటి నుంచో చేస్తున్న డిమాండ్ పాలకులు ఎదుట అరణ్యగోషగా మారింది. విషయం లోతుల్లోకి వెళ్ళకుండా వ్యవసాయానికి కూలీలు దొరక్కపోవడానికి ఉచితాలే కారణమని ఉన్నతస్థాయిలో కూడా వ్యాఖ్యలు చేయడం బాధాకరమే. ఇదొక విధంగా రైతుకు అభిముఖంగా వ్యవసాయకూలీలను నిలిపే, పరోక్ష వైరం లాంటిది. రైతులకు పండిన పంటకు స్వామినాథన్ కమిషన్ సిఫార్సు మేరకు మద్దతు ధర ఇస్తే, కూలీలకు కూడా దండిగా డబ్బులు ఇస్తారనడంలో ఢోకా లేదు.

చివరగా, సుప్రీం కోర్టు వ్యాఖ్యలకు సరిగ్గా ఒక రోజు ముందే, భార్యను చూస్తూ ఇంట్లో కూర్చోకుండా వారంలో 90 గంటలు పని చేయాలనే వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన ఎల్ అండ్ టి సంస్థ చైర్మన్ సుబ్రమణియన్ కూడా ఉచితాలపై వాక్రుచ్చారు. చెన్నైలో జరిగిన సిఐఐ సౌత్ గ్లోబల్ లింకేజెస్ సమ్మిట్‌లో మాట్లాడుతూ నగదు బదిలీ, గరీబ్ కల్యాణ్ యోజన, నరేగా వంటి ప్రభుత్వ సంక్షేమ పథకాల కారణంగా ప్రజలు గ్రామాలలోనే హాయిగా ఉంటున్నారని, సొంతూరు విడిచి రాకపోవడంతో తమ సంస్థకు శ్రామికులు దొరకడం లేదని వాపోయారు. అదే ప్రసంగంలో సౌదీ అరేబియా, ఒమన్, ఖతార్ తదితర పశ్చిమాసియా దేశాలలో పని చేసేందుకు ఆసక్తి చూపుతున్నారని, అక్కడ వారికి ఇక్కడి కంటే మూడు, మూడున్నర రెట్లు అధిక జీతాలు లభించడమే కారణమని చెప్పారాయన. ఆయన బాధకు మందును కూడా ఆయనే చూపించారు. జస్టిస్ గవాయ్ సైతం ప్రజలను సమాజ ప్రధాన స్రవంతిలోకి తీసుకువచ్చేందుకు, దేశాభివృద్ధిలో వారి వంతు పాత్రను నిర్వర్తించేందుకు అవకాశమివ్వాలనే విలువైన సూచన చేశారు. అలా జరగాలంటే సంపద సృష్టికర్తలైన ప్రజలకు సంపదలో కూడా న్యాయమైన వాటా కల్పించడమే అసలు సిసలు పరిష్కారం. అప్పుడే ఉచితం అనుచితమవుతుంది!

# యువనేత ‘రేవంత్’ లే కాంగ్రెస్‌కు దిక్కు !



ఎస్‌కె. జకీర్
సీనియర్ జర్నలిస్ట్

కాంగ్రెస్ పార్టీ ఏయే విషయాల్లో మైనస్‌లో ఉన్నదో వాటన్నింటి నీ అధ్యయనం చేసి తనకు అనుకూలంగా బిజెపి వాతావరణాన్ని మార్చుకుంటోంది. బిజెపి విజయపరంపరకు సంబంధించి కొన్ని అంశాలను తప్పనిసరిగా స్టడీ చెయ్యాలి. 1) హిందుత్వ కార్డు, రాముడు సెంటిమెంటు. 2) డెబ్భయి ఏండ్లు దాటిన వారందరినీ ఇంటికి పంపడమో లేదా రాజకీయాలను తప్పించి గవర్నర్ పదవులివ్వడం.3) కొత్త తరా న్ని ప్రోత్సహించడం.4) కొత్త ముఖాలను తెరపైకి తీసుకురావడం. 5) కులాల సమీకరణాలను సరిగ్గా హ్యాండిల్ చేయడం.6) ఎస్.టి, ఎస్.సి, బిసిలకు సముచిత ప్రాధాన్యం ఇవ్వడం..... వంటి పలు అంశాలు కనిపిస్తాయి. ఒడిశా, రాజస్థాన్, ఛత్తీస్‌గర్, మధ్యప్రదేశ్ తదితర రాష్ట్రాలలో ముఖ్యమంత్రి పదవి చేపట్టిన వారు ఇదివర కు పాపులర్ అయినవారు కాదు. పేరు, ప్రఖ్యాతులు, పలుకుబడి, ధనబలం ఉన్న వాళ్ళు కూడా కాదు. ఒకటీ, రెండు సార్లు గెల్చిన ఎమ్మెల్యేలు అయినా ముఖ్యమంత్రి పదవి బిజెపిలోనే లభిస్తోంది. ఆదివాసీలకూ ఛాన్సు ఇస్తున్నారు.

అలాగే అసోం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ లాంటి పొటెన్షియల్ వ్యక్తులకూ బిజెపిలో కొరత లేదు. ఇటీవలి కాలంలో బిజెపి సిఎం అయినా వారంతా 53 నుంచి 60ఏండ్లలోపు వారే. నితిన్ గడ్కరీ, రాజ్‌నాథ్ సింగ్, శివరాజ్ సింగ్ చౌహాన్, ధర్మేంద్ర ప్రదాన్, భూపేంద్ర యాదవ్, ఫడ్నవీస్, పీయూష్ గోయల్, ఆదిత్యనాథ్, ఢిల్లీకి కాబోతున్న సిఎం పర్వేశ్ వర్మ....వంటి హేమాహేమీలు కనీసం డజను మందికి పైగా ప్రధానమంత్రి పదవి నిర్వహించగ ల సామర్థ్యం ఉన్నవాళ్లు. మరి కాంగ్రెస్ పార్టీలో పరిస్థితి ఏమిటి? రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ మినహా మరొకరి పేరు ఆ పదవికి వినబడే అవకాశం ఉందా?

ఎన్నికలవేళ మాత్రమే కాంగ్రెస్ పార్టీ యంత్రాంగం క్రియాశీల ‘మోడ్’ లోకి వస్తుంది. తర్వాత అధికారం వచ్చినా, రాకపోయినా అది నిద్రావస్థలోకి వెళ్ళిపోతుంది. తెలంగాణ విషయమే తీసుకుంటే అసెంబ్లీ ఎన్నికల సందర్భంలో రేవంత్ సారథ్యంలో సోషల్ మీడియా సహా అనేక వ్యవస్థలు అత్యంత క్రియాశీలంగా పనిచేశాయి. రేవంత్ అధికారంలోకి రాగానే ఆ వ్యవస్థలన్నీ ‘సుప్త చేతనావస్థ’ లోకి వెళ్లిపోయాయి. అధికారంలోకి వచ్చేసినందున ఎన్నికలకు ముందు పనిచేసి న యంత్రాంగం ఇప్పుడు కానరావడం లేదు. దీన్ని అలుసుగా తీసుకొని కెటిఆర్ ఆధ్వర్యంలోని సోషల్ మీడియా, ఇతర వ్యవస్థలు విజృంభిస్తున్నవి. ఇంకా కెసిఆరే అధికారంలో ఉన్నారేమో అనే రీతిలో ‘హైప్’ సృష్టిస్తున్నారు. మరలా ఎన్నికలు వచ్చే నాటికి అటువంటి యంత్రాంగాన్ని ‘యాక్టివేట్’ చేసుకోవచ్చునని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆయన సలహాదారులు, కోటరీ భావిస్తూ ఉండవచ్చు. అప్పటికి జరగవలసిన నష్టం జరిగిపోతుందని సిఎం. రేవంత్, ఆయన కోటరీ అనుకోవడం లేదు.

అనేకమంది ఒక కొత్త నాయకత్వాన్ని బిజెపి వ్యూహాత్మకంగా ప్రోత్సహిస్తుండగా, కాంగ్రెస్ వృద్ధ నేతలతోనే ప్రజల ముందుకు వెడుతోంది. తెలంగాణలో కూడా కాలంచెల్లిన వృద్ధ నాయకులతో ఎన్నికలకు వెళ్లి ఉంటే ఘోరమైన ఓటమి లభించేది. రేవంత్‌ను రంగంలోకి దించడం వల్లే ఈ ‘మార్పు’ కనపడింది. 2014లో ప్రశాంత్ కిషోర్‌ను ఉపయోగించుకుని మోదీ అధికారంలోకి వచ్చారు. అసోసియేషన్ ఆఫ్ బిలియన్ మైండ్స్, ఎక్సిస్ మై ఇండియా వంటి అనేక సంస్థలతో పాటు అనేక బృందాలు బిజెపికోసం పనిచేస్తున్నవి.

కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీ తరపున పనిచేసిన సునీల్ కనుగోలుకు ముఖ్యమంత్రి సలహాదారుగా మాత్రమే కాక కేబినెట్ హోదా ఇచ్చారు. తెలంగాణతోపాటు మధ్యప్రదేశ్ సర్వేలను, ఎన్నికల వ్యూహరచనను కూడా ఆయన నిర్వహించారు. రాజస్థాన్‌లో అశోక్ గెహ్లాత్ డిజైన్ బాక్స్‌డ్‌కు చెందిన నరేశ్ అరోరా చేతుల్లో రాష్ట్ర ఎన్నికల నిర్వహణను అప్పజెప్పారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు తగ్గిపోయి, సూక్ష్మ స్థాయిలో ఎన్నికల నిర్వహణ చేయగల సమర్థ నాయకత్వం కోల్పోయి పూర్తిగా ఏజెన్సీలపై ఆధారపడితే ఏమి జరుగుతుందో ఫలితాలు నిరూపించాయి. దేశంలో బిజెపిని వ్యతిరేకించే మేధావులు, ఇతర సామాజిక వర్గాలు, లెఫ్ట్ పార్టీలు కనిపిస్తున్నా వారు బిజెపి వ్యతిరేక భావజాలాన్ని ప్రజల్లో వ్యాప్తి చేయడంలో విఫలమవుతున్నారు.

తుపానులా విరుచుకుపడుతున్న బిజెపిని నిలువరించడం ఎలా అని కాంగ్రెస్ పార్టీలో అంతర్మథనం జరుగుతోంది. ఢిల్లీ ఫలితాల తర్వాత కాంగ్రెస్ పార్టీలో పెద్ద ఎత్తున చర్చ సాగుతోంది. ఎంత విస్తృతంగా ప్రజల్లోకి వెళ్లినా బిజెపి విజృంభణను అడ్డుకోవడంలో ఆ పార్టీ విఫలమవుతోంది. ఇదివరకు గెలిచిన రాష్ట్రాల్లోనే బిజెపి మళ్లీ, మళ్ళీ గెలుస్తోంది. పైగా గతంలో కంటే ఎక్కువ ఓట్లు కూడా సాధిస్తున్నది.

ఎన్నో యుద్ధాల్లో ఆరితేరినవారు, విశేష అనుభవం ఉన్నవాళ్లు, కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యులు కూడా తమ వరుస ఓటములకు కారణాలేమిటో తలలు బాదుకుంటున్నారు. సమీప భవిష్యత్తులో కాంగ్రెస్ కేంద్రంలో జెండా ఎగరవేయగలదా? అనే ప్రశ్నలు వారిని పట్టి పీడిస్తున్నవి. ఢిల్లీతో కలుపుకుంటే 19 రాష్ట్రాలను బిజెపి కైవసం చేసుకున్నది. బిజెపి విజయపరంపర కేంద్రంతో సహా రాష్ట్రాల్లోనూ కొనసాగుతోంది. తెలంగాణ, కర్ణాటక, హిమాచల్ ప్రదేశ్‌కు కాంగ్రెస్ పార్టీ పరిమితమైంది. రేవంత్ రెడ్డి పిసిసి అధ్యక్షునిగా ఉన్న సందర్భంలో, నాటి అధికార పార్టీ బిఆర్‌ఎస్‌పై పిడుగు పడినట్లుగా, పడకపోతే ఇక్కడ కూడా కాంగ్రెస్ అధికారంలోకి వచ్చేది కాదని పరిశీలకులంటున్నారు.

బిజెపి మతపరమైన ఎజెండా, మోదీ ఉపన్యాసాలు, ఈవీఎంలను నిందించడం వల్ల ఎలాంటి ప్రయోజనం లేదని తేలిపోయింది. మహారాష్ట్ర, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, హర్యానా తదితర రాష్ట్రాలలో ఓటమిని సమీక్షించేందుకు కాంగ్రెస్ పార్టీ కొన్ని కమిటీలను నియమించినా వాటి నివేదికలు ఏమిటో, ఆ నివేదికల ఆధారంగా ఎలాంటి దిద్దుబాటు చర్యలు తీసుకున్నారో తెలియదు. “ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఎప్పుడూ ఎన్నికలకు సిద్ధంగా ఉంటారు. 2029 లోక్‌సభ ఎన్నికలకు ఆయన ఇప్పటికే సన్నాహాలు మొదలు పెట్టారు” అని చంద్రబాబునాయుడు ఇటీవలే అన్నారు. ఎపి సిఎం పరిశీలన నూటికి నూరుశాతం నిజం. ఆ సంసిద్ధత కాంగ్రెస్ పార్టీలో ఎన్నడూ లేదు. “మనం ఒక ఏడాది ముందైనా ఎన్నికలకు సంసిద్ధం కావాలి” అని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే అన్నారు. అయితే ఒక ఎన్నికల ఫలితాలు రాకముందే మరో ఎన్నికలకు మోదీ సిద్ధమయి ఉంటారని కాంగ్రెస్ నాయకులు గ్రహించడం లేదు.

‘హమ్ ఏక్ హై తో సేఫ్ హై’ అని మోదీ మహారాష్ట్ర విజయం సాధించిన రోజే నరేంద్రమోదీ అన్నారు. ‘మహారాష్ట్ర ప్రయోగాన్ని’ దేశమంతటా అమలు చేసేందుకు బిజెపి కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసింది. మతపరమైన భావోద్వేగాలు, దేశభక్తిని ఒక వైపు రంగరిస్తూ పార్టీని సంస్థాగతంగా క్రిందిస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేస్తున్నారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా ఎదుర్కోవడానికిగాను పార్టీ శ్రేణులను అడ్వాన్సుగా సంసిద్ధం చేస్తోంది. ప్రత్యర్థి పార్టీలను బలహీనపరిచేందుకు నిరంతరం ప్రయత్నిస్తోంది. వివిధ అనుబంధ సంస్థలు, సంఘ్ పరివార్ సంస్థలు ఎప్పుడూ సమావేశాలు, సదస్సులను నిర్వహిస్తూ ప్రజలకు అందుబాటులో ఉంటున్నాయి. తమ పార్టీ అధికారంలో లేని ప్రాంతాల్లో కూడా బిజెపి, సంఘ్ పరివార్ సంస్థలు విస్తృతంగా పనిచేస్తున్నవి. పోలింగ్‌బూత్ స్థాయి నుంచి ‘మైక్రో లెవల్’ ప్రణాళికలను అమలుచేస్తున్నవి. దేశంలో కనీవినీ ఎరుగని స్థాయిలో అభివృద్ధి జరుగుతోందని, ప్రపంచ దేశాల్లో భారత్ అగ్రరాజ్యంగా మారడం ఖాయమన్న ప్రాపగాండ ఉధృతంగా చేస్తున్నారు. వికసిత్ భారత్, స్వచ్ఛ భారత్... ఈ రెండు నినాదాలు సూపర్ హిట్ అయ్యాయి. గెలిచిన రాష్ట్రాల్లో మళ్లీ గెలిచేందుకు, ప్రతిపక్షస్థానంలోకి వెళ్లిన రాష్ట్రాల్లో మళ్లీ అధికారం చేజిక్కించుకోవడానికి బిజెపి కసిగా పనిచేస్తుంది. కానీ కాంగ్రెస్ వరుసగా ఓటమి పాలయినా రెండోసారి అధికారంలోకి వచ్చిన సందర్భాలు చాలా అరుదు.



బిజెపి దేశవ్యాప్తంగా తన సొంత ఓటు బ్యాంకు నిర్మించుకోవడమే కాకుండా దాన్ని అద్భుతంగా పెంచుకుంటున్నది. కాంగ్రెస్ పార్టీ మాత్రం బిజెపి వ్యతిరేక ఓటు బ్యాంకుపై ఆధారపడుతున్నట్టు కనబడుతున్నది. తన ఓటు బ్యాంకును తానే సొంతంగా నిర్మించుకోలేకపోతే కాంగ్రెస్‌కు భవిష్యత్తు అంధకారంగా ఉంటుందని చెప్పినా వినేవారు లేరు. ‘కంసుడిని కృష్ణుడు హతమార్చకపోతే కృష్ణుడిని హతమార్చేందుకు కంసుడు తన ప్రయత్నాలను మానుకునేవాడు కాదు’ అనే సంగతి మనందరికీ తెలుసు. రాజకీయాలు, యుద్ధమూ అంతే. ప్రత్యర్థులను నిర్వీర్యం చేయనంతవరకు, వారి నుంచి ప్రమాదం ఎప్పుడూ ఉంటుందని రాజనీతి శాస్త్రం చెబుతోంది.

బిజెపి దేశవ్యాప్తంగా తన సొంత ఓటు బ్యాంకు నిర్మించుకోవడ మే కాకుండా దాన్ని అద్భుతంగా పెంచుకుంటున్నది. కాంగ్రెస్ పార్టీ మాత్రం బిజెపి వ్యతిరేక ఓటు బ్యాంకుపై ఆధారపడుతున్నట్టు కనబడుతున్నది. తన ఓటు బ్యాంకును తానే సొంతంగా నిర్మించుకోలేకపోతే కాంగ్రెస్‌కు భవిష్యత్తు అంధకారంగా ఉంటుందని చెప్పినా వినేవారు లేరు. ‘కంసుడిని కృష్ణుడు హతమార్చకపోతే కృష్ణుడిని హతమార్చేందుకు కంసుడు తన ప్రయత్నాలను మానుకునేవాడు కాదు’ అనే సంగతి మనందరికీ తెలుసు. రాజకీయాలు, యుద్ధమూ అంతే. ప్రత్యర్థులను నిర్వీర్యం చేయనంత వరకు, వారి నుంచి ప్రమాదం ఎప్పుడూ ఉంటుందని రాజనీతిశాస్త్రం చెబుతోంది.

“మీరెవరో, మీ శత్రువెవరో తెలిస్తే వంద యుద్ధాలు జరిగినా భయపడనక్కర్లేదు. మీ గురించి మాత్రమే తెలిసి మీ శత్రువు గురించి తెలియకపోతే, ఓటమికి కూడా సిద్ధంగా ఉండాలి. మీ గురించి కానీ, మీ శత్రువు గురించి కానీ ఏమీ తెలియకపోతే ప్రతి యుద్ధంలోనూ ఓడిపోవాల్సిందే” అని క్రీస్తు పూర్వం 3వ శతాబ్దానికి చెంది న యుద్ధరంగ నిపుణుడు సున్ జు చెప్పాడు.”

గత రెండు సార్వత్రిక ఎన్నికలతో పోలిస్తే కాంగ్రెస్ సంఖ్యాబలం కొంత పెరగడాన్ని విశ్లేషిస్తూ కాంగ్రెస్ ‘పరాన్నజీవి’ కనుకే కొన్ని సీట్ల ను పెంచుకున్నదని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు. లోక్‌సభ ఫలితాలను విశ్లేషిస్తే కాంగ్రెస్ ఒంటరిగా పోటీచేసిన చోట్ల ఎక్కువ సీట్లు గెలుచుకోలేదు. కాని వేరే పార్టీల మద్దతుతో చెప్పుకోదగిన ఫలితాలు సాధించింది. బిజెపితో ముఖాముఖి తలపడిన ఎక్కువ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ ఓటమి పాలవుతోంది.

మోడీ కాంక్షిస్తున్నట్టుగా ‘కాంగ్రెస్ విముక్త భారత్’ సాధ్యపడకపోవచ్చు కాని కాంగ్రెస్ నేతృత్వంలో సంకీర్ణ ప్రభుత్వం ఏర్పడడానికి ఇప్పట్లో అవకాశం లేదు. 2029 నాటికి కాంగ్రెస్, బిజెపిల పరిస్థితి ఏ విధంగా ఉంటుందో ఇప్పుడే చెప్పలేం. పదేళ్ల తర్వాత అతి కష్టమ్మీద వంద సీట్లు సాధించిన కాంగ్రెస్ మరింత బలం పుంజుకోవాలంటే బిజెపితో ముఖాముఖి పోటీచేసే సీట్లలో కనీసం సగానికి పైగా సాధించాలి. దేశ రాజకీయాల్లో ఎన్నో పార్టీలు పుట్టినంత వేగంగా అదృశ్యమయిపోయాయి. పలు రాజకీయ పార్టీలతో కలిసి ఏర్పడిన జనతా పార్టీ రకరకాల వర్గాలుగా, పార్టీలుగా ముక్క చెక్కలైపోయింది. ఉత్తరప్రదేశ్‌లో గతంలో అధికారం చేబట్టిన బహుజన సమాజ్ పార్టీ దాదాపు ఉనికి కోల్పోయింది. తెలంగాణ ఉద్యమం పేరిట అధికారంలోకివచ్చిన టిఆర్‌ఎస్ తన రంగు, రుచి వాసన కోల్పోయింది. జాతీయ రాజకీయాల మోజులో ‘ప్రజల పార్టీ’ ముద్రను తనను తానే తొలగించుకున్నది. లోక్‌సభ ఎన్నికల్లో భారత రాష్ట్రసమితికి ఒక్క సీటు కూడా రాలేదు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మళ్ళీ ఎన్నికల దాకా ఎలాంటి ముప్పు లేదు. తెలంగాణ ప్రజలు కాంగ్రెస్, బిజెపిల మధ్య చీలిపోతే బిఆర్‌ఎస్ అగమ్య గోచర పరిస్థితిలో పడనుంది. 2029 నాటికి దేశవ్యాప్తంగా బిజెపి,కాంగ్రెస్ పార్టీల సారథ్యంలోని ‘రెండు కూటముల’ మధ్య పోరాటంగా మారితే ‘ఈ కూటములలో లేని పార్టీలు’ అదృశ్యమవడం ఖాయం. అలా అదృశ్యమయ్యే పార్టీలలో బిఆర్‌ఎస్’ కూడా ఉంటుందో, లేదో చెప్పడానికి సాధ్యం కాదు.ఇప్పటికయినా కెసిఆర్ వాస్తవాలు గ్రహించి ఏదో ఒక కూటమిలో చేరతారేమో చూడాలి. రాష్ట్ర రాజకీయాల్లో కాంగ్రెస్ పార్టీని ఓడించేందుకు గాను, కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి కూటమి వైపునకు కెసిఆర్ మొగ్గు చూపే అవకాశాలు కొట్టి పారవేయలేమని రాజకీయ పండితుల మాట.

# సింగరేణి కాలనీలకు బొగ్గు బాయిల నీళ్లు!



మేరుగు రాజయ్య
9441440791

ప్రతి ఇంటికి రక్షిత మంచినీటిని అందించాలనే లక్ష్యంతో దాదాపు రూ.43,791కోట్ల బడ్జెట్ తో నాటి టిఆర్‌ఎస్ ప్రభుత్వం “తెలంగాణ మిషన్ భగీరథను” ప్రారంభించింది. 2016 ఆగస్ట్ 7న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీతో గజ్వేల్‌లోని కోమటి బండలో ‘మిషన్ భగీరథ పైలాన్’ను ఆవిష్కరించారు. గోదావరినది నుండి 53.68 టిఎంసి (థౌసండ్ మిలియన్ క్యూబిక్ ఫీట్) నీటిని, కృష్ణానది నుండి 32.43 టిఎంసిల నీటిని సరఫరా చేయడానికి ప్రణాళికలు వేసింది. అయితే మిషన్ భగీరథ నీటి సరఫరాపై విమర్శలు కూడా వచ్చినవి. ఎందుకంటే? ఇప్పటికే గ్రామాల్లో భూగర్భ జలాలు రక్షిత మంచినీటి సరఫరాగా కొనసాగుచుండగా కొత్తగా మిషన్ భగీరథ నీళ్ల సరఫరా ప్రక్రియను కొనసాగించి ఆర్థిక భారాన్ని కొని తెచ్చుకోవడం ఎందుకనే? ప్రశ్నలు ఉత్పన్నం అయినవి.

భారతదేశంలో 60బిలియన్ డాలర్ల (రూ.5,21, 37,330 00.00)తాగునీళ్ల వ్యాపారం జరుగుచున్నట్లు అంచనా. శాస్త్రీయంగా నీళ్ల నాణ్యతను టిడిఎస్ (టోటల్ డిసాల్వ్ సాలిడ్స్), పిపిఎం(పార్టస్ ఫర్ మిలియన్), పిహెచ్(హైడ్రోజన్ పోటెన్సియన్షియల్)లలో నిర్ణయిస్తారు.

పిహెచ్ అంటే?నీటిలోని హైడ్రోజన్ సంభావ్యతను, అయాన్ల, ప్రోటాన్ల గాఢతను తెలుసుకుంటారు. పిహెచ్ కొలమా న ప్రక్రియను 1923లో డానిష్ బయోకెమిస్ట్ సోరెన్ పీటర్ లార్జిట్ సోరెన్ సెన్ రూపొందించారు. నీటి ఆమ్లతను, క్షారతను పిహెచ్ కొలమానం ద్వారా తెలుస్తుంది. భూమిలో సేంద్రియ పదార్థాలు క్షీణించడం వలన భూగర్భజలాల పిహెచ్ స్థాయిలు పడిపోతున్నాయి. భూగర్భజలాల్లో పిహెచ్ 3.33 నుండి 8.5 వరకు ఉంటుంది. నది నీటిలో 6.5 నుండి 8.5 మధ్య పిహెచ్ ఉంటుం ది. తటస్థమైన నీటి పిహెచ్ 7.0గా నిర్ధారించారు. 6.5 పిహెచ్ ఉన్న నీరు ఆమ్లంగా, మృదువుగా ఉంటవి. మానవ దైనందిన అవసరాలకు వాన నీళ్లతో ప్రవహించే నది, చెరువు, చెక్ డ్యాంల నీళ్లు ఉత్తమమైనవి. ఉపరితల జలాలను కలుషితం కాకుండా జాగ్రత్తలు తీసుకోవలసిన బాధ్యత ప్రభుత్వాలపై ఉన్నది. అలాగే మానసిక పరివర్తనను పెంపొందించుకుని కాలుష్య నియంత్రణకు, పర్యావరణ పరిరక్షణకు ప్రజలు కూడా ప్రభుత్వాలపై ఒత్తిడి చేయవలసిన బాధ్యత ఉన్నది.

ఇక సింగరేణి కాలనీలకు బొగ్గు బాయిల నీళ్లను సాండ్ ఫిల్టర్ ప్రక్రియతోను, గోదావరి నది నీళ్లను నది లోని ఇసుకతోనే ఇన్ ఫిల్ట్రేషన్ గ్యాలరీ పైపుల ప్రక్రియ ద్వారా రక్షిత మంచినీటిని సరఫరా చేస్తున్నారు. రామగుండం ఫెర్టిలైజర్ కార్పొరేషన్ లిమిటెడ్(ఆర్‌ఎఫ్‌సిఎల్), నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్(ఎన్‌టిపిసి), సింగరేణి, రామగుండం నగర వాసుల డ్రైనేజీ నీరు మల్కాపురం ఒర్రె నుండి గోదావరి నదిలో కలుస్తున్న దిగువన “సింగరేణి ఇంటేక్ వెల్ ఇన్ ఫిల్ట్రేషన్ గ్యాలరీ పంప్‌ల నుండి గోదావరిఖని సెక్టార్ 1 మరియు 2, యైంటిక్లైన్ కాలనీ, సెంటినరీ కాలనీలకు సరఫరాను చేస్తున్నారు. సింగరేణి రక్షిత మంచినీటి గ్యాలరీ పరివాహకం “సుందిళ్ల బ్యారేజీ” ఎగువన ఉన్నది.

సుందిళ్ల బ్యారేజీలో నీటి మట్టం గరిష్ట స్థాయిలో ఉన్నగాని,గోదావరిలో నీటి ప్రవాహం నిలిచిపోయినా గాని సింగరేణి కాలనీలకు కలుషితమైన గోదావరి నీటిని, లేదా బొగ్గు బాయిల నీళ్లను శుద్ధి చేసి సరఫరా చేస్తున్నారు. 2004 లో గోదావరి ఎండిపోయినప్పుడు “డ్రైనేజీ నీళ్లనే రీసైక్లింగ్ మాదిరిగా శుద్ధి చేసి సింగరేణి కాలనీలకు సరఫరా చేశారు. అప్పుడు “వ్యాసకర్తనైన నేను ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రధాన నాయమూర్తి దేవిందర్ గుప్తా గారికి విన్నవించగా “ఫెర్టిలైజర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా రిజర్వాయర్ నుండి నీటి సరఫరాను కొన్నాళ్లే చేశారు. రామగుండం కార్పొరేషన్ కాలనీలకు మాత్రం “ఎల్లంపల్లి ప్రాజెక్ట్” “మిషన్ భగీరథ“ నీళ్లు సరఫరా అవుతున్నా యి. సింగరేణి కాలనీలకు మాత్రం కలుషితమైన గోదావరి, బొగ్గు బాయిల నీళ్లను శుద్ధిచేసి సరఫరా చేస్తున్నా రు.

“ఎల్లంపల్లి ప్రాజెక్ట్ మిషన్ భగీరథ “నీళ్లే ఎందుకు మంచి వంటే? ఎగువన ఉన్న కడెం ప్రాజెక్ట్‌లో 7.603 టిఎంసి నీళ్ల సామర్థ్యం పోగా గేట్లు ఎత్తిన నీళ్ల, శ్రీరాం సాగర్ నీళ్లు, గోదావరి పరివాహక నీళ్లు ఎల్లంపల్లిలో కలుస్తాయి. కడెం ప్రాజెక్ట్ ప్రాంతం లో వర్షపాతం ఎక్కువగా ఉంటుంది. అనావృష్టిలో కూడా కడెం ప్రాజెక్ట్ నిండిన వరదతో ఎల్లంపల్లి ప్రాజెక్ట్ నిండింది. హైదరాబాద్‌లో నీటి కొరత లేకుండా ఎల్లంపల్లి నీళ్లు సరఫరా అయినవి. ఇక ఎల్లంపల్లి దిగువ గోదావరిలో కలుషిత జలాలు ఎక్కువగా కలుస్తున్నవి. అందుగురించే ఎల్లంపల్లి ప్రాజెక్ట్ మిషన్ భగీరథ నీళ్లు కావాలని సింగరేణి కార్మికులు చాలాకాలం నుండి డిమాండ్ చేస్తున్నారు.

రానున్న వేసవికాలంలో సింగరేణి కాలనీలకు డ్రైనేజీ నీళ్లను శుద్ధి చేసైనా, లేదా బొగ్గు బాయిల నీళ్లను శుద్ధి చేసైనా సరఫరా చేసే అవసరం ఉంది. రోజుకు సింగరేణికి రోజుకు దాదాపు132 మిలియన్ లీటర్ల నీటిని పంపింగ్ చేయవలసి ఉంటుంది. ఇందులో 32 మిలియన్ లీటర్ల నీరు గ్రీన్ బెల్ట్ అభివృద్ధికి,దుమ్ము నియంత్రణకు, బొగ్గు గనుల పని స్థలాల తాగునీటికి అవసరం ఉంటుంది. కనీసం సింగరేణి కాలనీ కుటుంబాల తాగు, గృహ అవసరాకైనా ఎల్లంపల్లి ప్రాజెక్ట్ మిషన్ భగీరథ నీళ్లను సరఫరా చేయడానికి సింగరేణి యాజమా న్యం, రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపడం లేదు. కార్మికుల కష్టార్జితాన్ని కేంద్ర ప్రభుత్వం2014–2015 ఆర్థిక సంవత్సరం నుండి 2022–2023 ఆర్థిక సంవత్సరం వరకు రాయల్టీ ఇతరత్రా పన్నుల పేర రూ.25, 949.17కోట్లు, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రూ.23, 138.44 కోట్లు,కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్ బులిటీ(సీఎస్‌ఆర్),డిస్ట్రిక్ట్ మినరల్ ట్రస్ట్ ఫండ (డీఎంఎఫ్ టి)పేర రూ.2,940.72 కోట్లు,మెడికల్ కాలేజీకి రూ.500 కోట్లు,రాజీవ్ గాంధీ అభయ హస్తం పథకం పేర యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌లో మెయిన్స్‌కు హాజరయ్యే విద్యార్థులకు రూ.500కోట్లు పిండి వసూలు చేసుకున్నారు.“ఇప్పుడే మా కాలనీలకు రెండు రోజులకు ఒక మారు నీటి సరఫరాను చేస్తున్నారని, కనీసం మంచి నీళ్ల ను కూడా మాకు సరఫరా చేయకుంటే మేము విధులను ఎట్లా? నిర్వహించాలని కార్మికులు ప్రశ్నించుచున్నారు.“

గతంలో తాగునీళ్ల సరఫరా గురించి కార్మికులు సమ్మెలు చేసిన సంఘటనలు పునరావృతం కాకుండా కాలనీలకు మిషన్ భగీరథ నీళ్లను సరఫరా చేయాలని, అలాగే గోదావరిలో కలుస్తున్న డ్రైనేజీ నీళ్లను, పరిశ్రమల రసాయన కలుషిత నీళ్లు కలవకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుని గోదావరి జలాల పరిరక్షణకు పూనుకోవాలని కార్మిక సంఘాలు, ప్రజా సంఘాలు డిమాండ్ చేస్తున్నారు.

# పుట్టుకతో వచ్చే గుండె లోపాలు ప్రాణాంతకం

ప్రపంచవ్యాప్తంగా ఒక శాతం శిశువులు, మొత్తంగా మిలియన్ల కొద్ది పిల్లలు, ఇండియాలో కనీసం 2 లక్షల శిశువులు ‘పుట్టుకతోనే గుండె లోపాల’తో జన్మించడంతో వారి నిండు నూరేళ్ల జీవితం ప్రశ్నార్థకంగామారడం, ఆ రోగులతో పాటు వారి కుటుంబ సభ్యులు నరకయాతనను అనుభవించడం చూస్తు న్నాం. జన్మతః గుండె లోపాలతో పుట్టిన పిల్లల్లో 20 శాతం వరకు తీవ్రమైన హృదయ అనారోగ్యాలతో జీవిస్తూ, అకాలమరణా ల బారిన కూడా పడడం జరుగుతున్నది. పుట్టుకతో గుండె లోపాలతో జన్మించిన పిల్లలకు గుండె పని తీరులో ఇబ్బందులు, రక్త ప్రసరణ లోపాలు, శారీరక అభివృద్ధి మందగించడం, దీర్ఘకాలిక గుండె అనారోగ్యాలు, స్ట్రోక్స్, గుండె ఫెయిల్యూర్ లాంటి అనారోగ్యాలు కలుగుతున్నాయి. పుట్టుకతో వచ్చే గుండె లోపాల గూర్చి పూర్తి అవగాహన కల్పించడానికి ప్రతి ఏట 14 ఫిబ్రవరి న అంతర్జాతీయ పుట్టుకతో వచ్చే గుండె లోపాల అవగాహన దినం (ఇంటర్నేషనల్ కాన్‌జెనిటల్ హార్ట్ డిఫెక్ట్స్ అవేర్‌నెస్ డే) నిర్వహించడం ఆనవాయితీగా మారింది. 2025 అంతర్జాతీయ పుట్టుక తో వచ్చే గుండె లోపాల అవగాహన దినం ఇతివృత్తంగా గుండె బలోపేతం: ప్రారంభ దశలో గుర్తింపు, సకాలంలో వైద్యం, జీవితకాల చేయూత అనే అంశాన్ని తీసుకొని ప్రచారం నిర్వహిస్తున్నారు.

పుట్టుకతో వచ్చే గుండె లోపాలు రావడానికి కారణాలుగా జన్యుపరమైన అంశాలు, పర్యావరణ కాలుష్యానికి దీర్ఘకాలం గురికావడం, తల్లి అనారోగ్యం లేదా పోషకాహార లోపా లు, గర్భవతులు ప్రత్యేక ఔషధాలను వాడడంతో శిశువుపై దాని ప్రతికూల ప్రభావం పడడం లాంటివి గుర్తించారు. పుట్టుకతో వచ్చే గుండె లోపాలను నివారించడానికి ఆస్కారం తక్కువగా ఉన్నందున తొలి దశలోనే గుర్తించి, తగు వైద్య సూచనలు పాటించడంతో వారి జీవితకాలం పొడిగించబడడంతో పాటు ఆరోగ్యంగా గడిపే సదవకాశం ఉంటుంది. ఇలాంటి ప్రమాదకర లోపాల పట్ల లోతైన పరిశోధనలు, తరుచుగా వైద్య సలహాలు, తొలిదశలో గుర్తించడం, సరైన సమయంలో సరైన చికిత్స తీసుకోవడం, ప్రజల్లో అవగాహన కల్పించడం, రోగులతో పాటు వారి కుటుంబాలను ఆదుకోవడం, వ్యాప్తిని తగ్గించడం లాంటివి పాటించడం ఉత్తమం అని నిపుణులు సూచిస్తున్నారు.

**(14 ఫిబ్రవరి అంతర్జాతీయ పుట్టుకతో వచ్చే గుండె లోపాల అవగాహన దినం సందర్భంగా)**

# పుల్వామా ఉగ్రదాడి... ఓ విషాదకర అధ్యాయం

మాతృభూమికోసం ప్రాణాలు త్యాగంచేసి వారి రక్తంతో దేశమాత నుదుటిపై కన్నీటి తిలకం దిద్దారు పుల్వామా రణభూమిలో అమరులైనారు, వీరసైనికులు. దేశమాత గుండెలలో అరుణ రక్తపు నదులుగా ప్రవహిస్తున్నారు, ధైర్యంతో సింహగర్జన చేసి శత్రువులతో పోరాటం చేస్తూ, ప్రాణాలను ధారపోసిన సైనికులారా మీకు ఇవే మా కన్నీటి నివాళులు. మీ జ్ఞాపకాలు మాకు సరిహద్దులలో దీపకాంతులై రక్షణ మంత్రా న్ని స్మరిస్తున్నాయి. 2019 ఫిబ్రవరి 14న జమ్మూకాశ్మీర్‌లోని పుల్వామా జిల్లాలో సిఆర్‌పిఎఫ్ జవాన్ల కన్వాయ్‌పై జరిగిన ఉగ్రదాడి, భారతదేశ చరిత్రలోనే అత్యంత మారణహోమాల్లో ఒకటిగా నిలిచింది. ఈ స్వీయవిస్ఫోటక దాడిలో 40 మంది భారతీయ సైనికులు ప్రాణాలర్పించారు. జైష్‌ఎముహమ్మద్ (JeM) సంస్థ ఈ దాడికి బాధ్యత వహించింది, ఇది భారత పాకిస్తాన్ సంబంధాలను మరింత తీవ్రతరం చేసింది. జమ్మూశ్రీనగర్ జాతీయ రహదారిపై పుల్వామా సమీపంలో సాయంత్రం 3:15 గంటల సమయం లో ఈ దాడి జరిగింది. ఉగ్రవాది అదిల్ అహ్మద్ దార్ 300–350 కిలోగ్రాముల విస్ఫోటకాలతో లాదిన్ చేసిన SUV వాహనాన్ని సిఆర్‌పిఎఫ్ కన్వాయ్‌పై ఢీకొట్టాడు. ఈ కన్వాయ్‌లో 78 వాహనాల్లో 2,500మంది జవాన్లు ప్రయాణిస్తున్నారు. 40మంది సిఆర్పీఎఫ్ జవాన్లు మరణించారు, అనేకమంది గాయపడ్డారు. ఈ దాడికి ప్రతిస్పందనగా, భారత ప్రభుత్వం ఫిబ్రవరి 26న పాకిస్తాన్‌లోని బాలకోట్‌లో జైష్‌ఎముహమ్మద్ శిబిరాలపై వాయుదాడి నిర్వహించింది. ఇది భారత్ యొక్క ‘ప్రిఎంప్టివ్ స్ట్రైక్’గా ప్రచారం చేయబడింది. భారతదేశంలో దాడిపట్ల అత్యంత కోపం మరియు సహానుభూతి తరంగాలు ఏర్పడ్డాయి. సైనిక భద్రతా ప్రోటోకాల్‌లు మరింత కఠినమయ్యాయి. భారత్ పాకిస్తాన్‌కు ‘అత్యధిక ప్రాధాన్యత దేశం’ (MFN) స్థితిని రద్దుచేసింది. కాశ్మీర్‌లోని అర్ధసైనిక దళాల కార్యాచరణలు మరింత బలోపేతం చేయబడ్డాయి. పుల్వామా దాడి, భారతదేశం యొక్క భద్రతా వ్యవస్థలోని లోపాలను బహిర్గతం చేసింది. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా అంతర్జాతీయ సహకారం యొక్క అవసరాన్ని హైలైట్ చేసింది. ఈ దాడిలో ప్రాణాలర్పించిన వీరుల స్మరణలు భారతీయుల హృదయాల్లో ఎల్లకాలం నిలిచిపోయాయి. ఉగ్రవాదం వల్ల కలిగే మానవీయ, రాజకీయ నష్టాలను ఇది మళ్లీ నొక్కిచెప్పింది. జై భారత్ నినాదాలతో ధ్వజమెత్తి మరణా న్ని కూడా లెక్కచేయక దేశ స్వాభిమానాన్ని కాపాడిన సైనిక వీరుల త్యాగం మరువలేనిది వారి మరణం తిరిగి రానిది. దేశమాత హృదయంపై ‘జై జవాన్’ నామస్మరణ నిత్యం ప్రతిధ్వనిస్తూనే ఉంది.

పూసపాటి వేదాద్రి, 9912197694

## సామాన్యులపై ధరలభారం లేకుండా
# నిరంతర తనిఖీ చర్యలు

### వినియోగ ధరల ద్రవ్యోల్బణం తగ్గింది
### రాజ్యసభలో నిర్మలాసీతారామన్ ప్రకటన

**న్యూఢిల్లీ :** దేశంలో ప్రజలపై ద్రవ్యోల్బణ భారం పడకుండా తనిఖీ చర్యలు నిరంతరం కొనసాగిస్తుందని కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలాసీతారామన్ రాజ్యసభలో ప్రకటించారు. ప్రజలపై భారం పడకుండా వారికి భరోసా ఇస్తామని అన్నారు. కేంద్ర బడ్జెట్ (2025–26)పై రాజ్యసభలో జరిగిన చర్చకు గురువారంనాడు ఆమె సమాధానం చెప్పారు. వినియోగ ధరల సూచీ ఆధారిత ద్రవ్యోల్బణం (సిపిఐ) లేదా రిటైల్ ద్రవ్యోల్బణం ఈ ఏడాది జనవరినెలలో 4.31 శాతానికి తగ్గిందని, ఇంతకుముందు అంటే గత ఏడాది డిసెంబరులో ఈ రిటైల్ ద్రవ్యోల్బణం 5.22 శాతం గా ఉండేదనీ, ప్రభుత్వం చేపట్టిన తనిఖీ చర్యలతో దీనిని తగ్గించామని, భారత రిజర్వుబ్యాంకు నిర్దేశించిన నాలుగూశాతం లక్ష్యం దిశగా దూసుకువెళుతున్నామని చెప్పారు.ద్రవ్యోల్బణంపై ఆర్థికమంత్రి మాట్లాడుతూ, టమోటా, ఉల్లి, బంగాళ దుంపల ధరలు, ఇతర పప్పుధాన్యాల ధరల డేటాలో బాగా మార్పులు కనిపించాయన్నారు. ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లో ఆహార ద్రవ్యోల్బణం బాగా పెరిగినప్పుడు, సరఫరా వ్యవస్థ దెబ్బతినకుండా మంత్రుబృందం ఎంతో కష్టపడి శ్రమించి సకాలంలో దిగుమతులు జరిగేట్టుగా చూసిందని, సరఫరాలు దెబ్బతినకుండా చూసిందని చెప్పారు. భారత రూపాయిలో హెచ్చుతగ్గుల ధోరణినిని కూడా రిజర్వుబ్యాంకు ఎప్పటికప్పుడు కనిపెట్టుకుంటూ వస్తోందన్నారు.ఆర్థిక వ్యవస్థలో వ్యవసాయ ఉత్పత్తులను ప్రోత్సహించేందుకు తీసుకుంటున్న అనేక చర్యలను ఆమె ఏకరువు పెట్టారు. ఈ విధమైన చర్యలద్వారా సామాన్య ప్రజలపై ధరలభారం, ఆ ఒత్తిడి పడకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నదని చెప్పారు.



బడ్జెట్ ప్రతిపాదనలను ఆమె తిరిగి గుర్తుచేస్తూ, వృద్ధిని పరుగులు తీయించేందుకు, సర్వసమ్మిళితమైన అభివృద్ధి సాధనకు, ప్రైవేటు రంగంలో పెట్టుబడులకు ప్రాణంపోసి ప్రోత్సాహం ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. రాబోయే ఆర్థిక సంవత్సరంలో మూలధనం వ్యయాలు గణనీయంగా తగ్గుతాయని చెప్పారు. ప్రపంచం, దేశం సవాళ్ళు ఎదుర్కొంటున్న తరుణంలో భారతదేశ బడ్జెట్ రూపకల్పన జరిగిందనీ, తీవ్రమైన అంచనాలు, సవాళ్ళు ఎదురవుతున్న వాతావరణంమధ్య బడ్జెట్ రూపకల్పన జరిగిందన్నారు. వివిధ రంగాలకు కేటాయింపులు తగ్గాయని అన్నారు. ఇంత జరిగినప్పటికీ వీటికి అతీతంగా మదింపులను చాలా ఖచ్చితంగా ఉండేట్టు చర్యలు తీసుకుందని, భారతదేశ ప్రయోజనాలకే అత్యధిక ప్రాధాన్యం ఇచ్చిందని అన్నారు. ఆర్థిక వ్యవస్థ ధోరణులు ఎలా ఉంటాయనే నమూనాలు మనదగ్గర లేవని, వాటిని మనం తయారు చేసుకోలేదనీ, ఎందుకంటే అవి ఎప్పుడూ చలనశీత్వం కలిగి ఉంటున్నందువల్ల వాటిని మనం ఆ నమూనాలను ఎలా నిర్మించాలో అర్థం చేసుకోలేదన్నారు. ఐనప్పటికీ కూడా వాటిని పట్టించుకోకుండా దేశ ప్రయోజనాలే ప్రధానంగా భావించి మదింపులు, అంచనాలను వీలైనంత సన్నిహితంగా ఉండేట్టు చేశామని, వాటికే అధిక ప్రాధాన్యం ఇచ్చామన్నారు. దేశంలోకి వచ్చే మనకు ఆర్థిక వ్యవస్థకు ఎంతో ముఖ్యమైన అనేక దిగుమతులు మనకు ఎంతో కీలకమని, ఈ విషయంలో ఇంకా ఎంతో అనిశ్చితి కొనసాగుతూనే ఉందని, ఆర్థికవృద్ధిలో ఈ దిగుమతుల అనిశ్చితి కొనసాగకుండా చూస్తున్నామన్నారు.

#### ప్రతిపక్షాల వాకౌట్

ఒకవైపు రాజ్యసభలో ఆర్థికమంత్రి సమాధానం ఇస్తూ ఉండగానే అధికార,ప్రతిపక్ష సభ్యులమధ్య మరోవైపు వాగ్వాదం కూడా కొనసాగింది. తెలంగాణ, పశ్చిమ బెంగాల్, తమిళనాడు, కేరళ వంటి పలు ప్రతిపక్ష పాలిత రాష్ట్రాలకు బడ్జెట్‌లో తక్కువ కేటాయింపులు చేశారని ప్రతిపక్ష ఎంపీలు విమర్శలు చేయగా, అందుకు ప్రతిగా అధికారపక్ష సభ్యులు స్పందించారు. చివరకు ఇది ప్రతిపక్ష సభ్యులు వాకౌట్‌కు దారితీసింది. ఈ వాగ్వాదం కొనసాగుతూ ఉండగానే ఆర్థికమంత్రి సీతారామన్ తన ప్రసంగాన్ని కొనసాగించారు.

## ఢిల్లీ విశ్వవిద్యాలయంలో
# చల్లారని నిరసన జ్వాల

### ఢిల్లీ పోలీసుల అదుపులో 10మందికి పైగా జెఎంఐ యూనివర్సిటీ విద్యార్థులు

**న్యూఢిల్లీ :** దేశరాజధాని ఢిల్లీలో 10మందికి పైగా జమియా మిల్లియా ఇస్లామియా యూనివర్సిటీ (జెఎంఐయు) విద్యార్థులను ఢిల్లీ పోలీలు అదుపులోకి తీసుకున్నారు. గురువారం నాడు ఒక అధికారి ఈ విషయాన్ని తెలియజేశారు. గత ఏడాది ఇద్దరు పిహెచ్‌డి స్కాలర్లకు వ్యతిరేకంగా యూనివర్సిటీ క్రమశిక్షణా చర్యలు తీసుకోవడాన్ని నిరసిసస్తూ ప్రదర్శన నిర్వహించారన్న ఆరోపణలపై వీరికి షోకాజ్ నోటీసులను అందజేయడం జరిగింది. సోమవారం మరోసారి విద్యార్థుల నిరసన ప్రారంభమైంది. 'విద్యార్థి క్రియాశీలతపై పరిపాలనాయంత్రాంగం అణిచివేత' అని విద్యార్థులు ఆరోపించారు. నిరసన తెలిపిన విద్యార్థులు సెంట్రల్ క్యాంటీన్ సహా విశ్వవిద్యాలయం ఆస్తులను ధ్వంసం చేశారని, సెక్యూరిటీ అడ్వైజర్ ఆఫీస్ గేట్‌ను విరగగొట్టారని, ఈ నేపథ్యంలో చర్య తీసుకోవాలని పరిపాలనా యంత్రాంగం కోరింది. పోలీసుల నుంచి అందిన సమాచారం ప్రకారం శాంతిభద్రతల పరిరక్షణకు నిరసన తెలుపుతున్న విద్యార్థులను తొలగించడానికి పోలీసులు జోక్యం చేసుకోవాలని యూనివర్సిటీ పోలీసులను కోరింది. 'విశ్వవిద్యాలయం పరిపాలనా యంత్రాంగం విజ్ఞప్తిని అందుకున్న తర్వాత సాయంత్రం 4గంటలకు మేం 10మందికి పైగా విద్యార్థులను నిరసన చేస్తున్న స్థలం నుంచి తొలగించివేశాం.శాంతి భద్రతలను పరిరక్షించేందుకు క్యాంపస్ బయట భారీ పోలీసు భద్రతను మోహరించాం' అని పోలీసువర్గాలు తెలియజేశాయి. కాగా కల్‌కాజీ పోలీస్‌స్టేషన్ బయట కొంతమంది నిరసనకారులు బైఠాయించారు. పోలీసులు అక్కడ చర్యలను ప్రారంభించిన తర్వాత 20మంది విద్యార్థులు కనిపించడం లేదని, అదుపులోకి తీసుకున్న విద్యార్థులు ఎక్క ఉన్నారన్న విషయమై అధికారులు సమాచారం ఇవ్వడం లేదని వారు ఆరోపించారు.నిరసన చేపట్టిన కొంత మంది విద్యార్థులకు జామియా మిల్లియా ఇస్లామియా యూనివర్సిటీ అడ్మినిస్ట్రేషన్ నుంచి సస్పెన్షన్ లెటర్లు అందాయని చెప్పారు. 'ఫిబ్రవరి 10న మీరు అనాగరికంగా రౌడీ గ్రూప్‌నకు నాయకత్వం వహించి యూనివర్సిటీ ఆస్తిని విధ్వంసం చేశారు. అంతేకాకుండా ఫిబ్రవరి 11న మరోసారి అనధికారికంగా, చట్ట విరుద్ధంగా జామియా మిల్లియా ఇస్లామియా యూనివర్సిటీ క్యాంపస్ పరిధిలో నిరసన ప్రదర్శన చేపట్టారు. 'యూనివర్సిటీ సాధారణ కార్యకలాపాలకు మీరు విఘాతం కల్పించారు. క్యాంపస్ లోపల అల్లర్లు సృష్టించడం ద్వారా యూవర్సిటీకిచెందిన ఇతర విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఉద్యోగులకు తీవ్రస్థాయిలో అసౌకర్యం కలిగింది' అని సస్పెన్షన్ లెటర్ అందుకున్న విద్యార్థి ఒకరు లెటర్‌లో పేర్కొన్న విషయాన్ని వివరించారు. ఈ విధ్వంసానికి కారుకులైనందున మిమ్ములను వెంటనే జామియా మిల్లియా యూనివర్సిటీ నుంచి సస్పెండ్ చేసినట్లు మీకు తెలియజేస్తున్నామని వారు పంపించిన సస్పెన్షన్ లేఖలో వెల్లడించినట్లు చెప్పారు. యూనివర్సిటీ విడుదల చేసిన ఒక ప్రకటన ప్రకారం ఫిబ్రవరి 10వ తేదీ సాయంత్రం నుంచి కొంత మంది విద్యార్థులు నిరసనకు పిలుపు ఇచ్చారని, దీంతో అకడమిక్ బ్లాక్ వద్ద చట్టవిరుద్ధంగా గుమిగూడారని తెలిపింది. విద్యార్థి నాయకురాలు సోనాక్షి 'పిటిఐ'తో మాట్లాడుతూ నిరసనకారులవి నాలుగు ముఖ్యమైన డిమాండ్లు ఉన్నట్లు తెలిపారు. పిహెచ్‌డి విద్యార్థులకు జారీ చేసిన షోకాజ్ నోటీసులు ఎత్తివేయాలని, క్యాంపస్‌లో నిరసనలను నియంత్రిస్తూ విడుదల చేసిన 2022 ఆఫీస్ మెమోరాండాన్ని రద్దు చేయడం, యూనివర్సిటీ గోడలమీద బొమ్మలు, రాతలు, పోస్టర్లు అంటించినట్లయితే విధించిన రూ.50,000జరిమానాను రద్దు చేయడం, నిరసన తెలియజేస్తున్న విద్యార్థులపై భవిష్యత్తులో ఎలాంటి క్రమశిక్షణా చర్యలు తీసుకోబోమనే హామీ ఇవ్వాలనేవి తమ డిమాండ్లని ఆమె తెలియజేశారు. 2024 డిసెంబరు 15న నిర్వహించిన 'జమియా ప్రతిఘటనా దినం' కార్యక్రమంలో జెఎంఐయుకు చెందిన ఇద్దరు పిహెచ్‌డి విద్యార్థుల పాత్ర ఏమిటనే విషయమై క్రమశిక్షణా కమిటీ ఫిబ్రవరి 25న సమీక్ష సమావేశం ఏర్పాటు చేయనుంది. ఈ విద్యార్థులు పౌరసత్వ సవరణ చట్టానికి (సిఎఎ)వ్యతిరేకంగా నిరసన ప్రదర్శనలు నిర్వహించారు.




# లోక్‌సభలో 112 శాతం ఉత్పాదకత

### మార్చి 10వ తేదీకి బడ్జెట్ సమావేశాలు వాయిదా

**న్యూఢిల్లీ :** పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు మార్చి 10వ తేదీకి వాయిదా పడ్డాయి. రెండ విడతల్లో స మావేశాలు జరగనున్న విషయం తెలిసిందే. మొ దటి దఫాలో లోక్‌సభ 112 శాతం ఉత్పాదకతను నమోదు చేసినట్లు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ప్రకటించారు. 'రాష్ట్రపతి ప్రసంగం తర్వాత ధన్యవాద తీర్మానం సందర్భంగా చర్చ 17 గంటల 23 నిమిషాలు కొనసాగింది, 173 మంది ఎంపిలు ఉత్పాదక చర్చలో పాల్గొన్నారు. బడ్జెట్‌పై చర్చ సందర్భంగా, 170 మంది సభ్యులు 16 గంటల 13 ని మిషాల పాటు జరిగిన చర్చల్లో పాల్గొన్నారు' అని ఆయన చెప్పారు. గుజరాత్‌లోని ఒక వ్యాపారవేత్తకు ఒక ప్రాజెక్టును కేటాయించడంపై ప్రతిపక్ష సభ్యుల నిరసనల మధ్య లోక్‌సభ కార్యకలాపాలను గురువారం మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా పడ్డాయి. మధ్యాహ్నం 2 గంటలకు సభ ప్రారంభమైనప్పుడు, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఆదాయపు పన్ను బిల్లు, 2025ను ప్రవేశపెట్టగా, ప్రతిపక్ష పార్టీలు దీనిని వ్యతిరేకించాయి. ఆదాయపు పన్ను బిల్లు, 2025 ను లోక్‌సభ సెలెక్ట్ కమిటీకి సూచించాలని ఆమె స్పీకర్‌ను కోరారు. రెండవ దఫా బడ్జెట్ సమావేశాలు మార్చి 10 నుండి ఏప్రిల్ 4 వరకు జరగనున్నాయి.



# మణిపూర్‌లో ఉద్దేశపూర్వక రాజ్యాంగ ధిక్కారణ

### కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి జైరామ్‌రమేష్

**న్యూఢిల్లీ :** మణిపూర్‌లో ఆర్టికల్ 174 ఉల్లంఘించబడిందని కా ంగ్రెస్ ఆరోపించింది. అది రాజ్యాంగ ధిక్కారణ అని పేర్కొంది. రెండు అసెంబ్లీ సమావేశాల మధ్య ఆరు నెలలకు పైగా విరామం ఉండాలని అధికరణ 174 నిర్దేశిస్తుందని, ఇది 'ఉద్దేశపూర్వక రాజ్యాంగ ధిక్కారణ' అని కాంగ్రెస్ పార్టీ ఆరోపించింది. కాం గ్రెస్ పార్టీ ప్రధానకార్యదర్శి ఇన్‌చార్జి కమ్యునికేషన్స్ జైరామ్ రమేష్ మాట్లాడుతూ మణిపూర్‌లో రాజ్యాంగ యంత్రాంగాన్ని విచ్ఛిన్నం చేయడం, మణిపూర్ ప్రజల మనోవ్యధ ఇంకా కొనసాగుతోందని, ఒక్క మణిపూర్ తప్ప అన్ని ప్రాంతాలను సందర్శించే ప్రధానమంత్రి నరేంద్రమోదీ మణిపూర్‌ను సందర్శిస్తారేమోనని ఇంకా ప్రజలు నిరీక్షిస్తున్నారని పేర్కొన్నారు. ఒక సమావేశానికి మరో సమావేశానికి మధ్య ఆరు నెలలకు పైగా విరామం ఉండాలన్న నిబంధన అమలయ్యేలా గవర్నర్ బాధ్యతను భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 174 తెలియజేస్తోందన్నారు. మణిపూర్ గవర్నర్ అసెంబ్లీ సమావేశాలను 2024 ఫిబ్రవరి 10న ప్రారంభించారని, కాంగ్రెస్ ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం ఉపసంహరణను కాంగ్రెస్ చేపట్టాలని ఆయన సూచించారన్నారు. 'ముందు రోజు రాత్రి మణిపూర్ ముఖ్యమంత్రి రాజీనామా చేయడంతో తర్వాత జరుగనున్న సమావేశం శూన్యం,' అని ప్రకటించబడిందని జైరాంరమేష్ చెప్పారు. ఇప్పుడు 6నెలలు గడిచాయి. ఆర్టికల్ 174ఉల్లంఘించబడిందని స్పష్టం అవుతోందని ఆయన చెప్పారు. మంగళవారం నాడు కాం గ్రెస్ మణిపూర్ గవర్నర్ ధోరణిని ఆక్షేపించింది. రాజ్యాంగం నిర్దేశించిన మేరకు అసెంబ్లీ సమావేశాలను ఎందుకు పిలవడం లేదని ,ఇది రాజ్యాంగాన్ని ఉల్లంఘించినట్లు కాదా అని ప్రశ్నించింది. మణిపూర్ ముఖ్యమంత్రి బీరెన్ సింగ్ రాజీనామా చేసిన ఒక రోజు తర్వాత ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.



## బిహార్‌లో ఎన్‌డిఎకు
# ఓటమి తథ్యం

### ఢిల్లీ ప్రభావం ఏ మాత్రం ఉండదు : లాలూ ప్రసాద్

**పాట్నా :** బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎకు ఓటమి తప్పదని ఆర్‌జెడి అధ్యక్షుడు లాలూ ప్రసాద్ యాదవ్ జోస్యం చెప్పారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో కాషాయ పార్టీ విజయం సాధించినప్పటికీ బిహార్‌లో మాత్రం గెలవలేదన్నారు. ఇండియా కూటమిలో భాగస్వామిగా ఉన్న ఆమ్ ఆద్మీ పార్టీ ఢిల్లీలో అధికారాన్ని కోల్పోవడంతో ఆ ప్రభావం బిహార్‌పై ఉంటుందా అని జర్నలిస్టులు అడిగిన ప్రశ్నలకు లాలూ సమాధానమిచ్చారు. ఢిల్లీ ప్రభావం బిహార్‌పై ఏ మాత్రం ఉండబోదన్నారు. 2005 నుంచి తన బద్ధశుత్రువైన జెడియు అధ్యక్షుడు నితీశ్ కుమార్ ముఖ్యమంత్రిగా ఉంటున్నారని, ఈసారి కూడా బిహార్‌లో ఎన్‌డిఎ కూటమే అధికారంలోకి వస్తుందని ఊహాగానాలు వినవస్తున్నాయి కదా అడినప్పుడు అలాంటిదేమీ లేదని త్రోసిపుచ్చారు. తాము బిహార్‌లో ఉన్నంత కాలం కాషాయ పార్టీ రాష్ట్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయలేదని, దేశ వ్యాప్తంగా బిజెపిని ప్రజలు అంచనా వేస్తున్నారని, రాష్ట్రంలో కూడా వేస్తారని లాలూ అన్నారు. కాగా లాలూ వ్యాఖ్యలపై బిజెపి సీనియర్ నేత, డిప్యూటీ సిఎం విజయ్ కుమార్ సిన్హా స్పందించారు. లాలూజీ ఉండవచ్చు, ఉండకపోవచ్చు కానీ, బిహార్‌లో ఎన్‌డిఎ తిరిగి అధికారంలోకి వస్తుందన్నారు. లాలూజీ ఉండాల్సిన అవసరం ప్రజలు లేదన్నారు. ఆయన పాలనలో కులతత్వం, దుష్పరిపాలన ప్రబలంగా ఉందని, ఇది రాష్ట్రానికి చెడ్డ పేరు తెచ్చిపెట్టిందన్నారు. బిహారీ అనే పదం ఒక రకమైన అవమానంగా మారిందని ఆయన పేర్కొన్నారు. అదే విధంగా లాలూ వ్యాఖ్యలపై జెడియు అధికారప్రతినిధి, ఎంఎల్‌సి మాట్లాడుతూ బిహార్‌లో ఎన్‌డిఎ విజయం సాధించిన విషయాన్ని లాలూజీ గుర్తుకు తెచ్చుకోవాలని సూచించారు. ఇప్పుడు కూడా అదే కొనసాగుతుందన్నారు. ఇప్పటికే 225 స్థానాల్లో గెలుపును ఎన్‌డిఎ లక్ష్యంగా పెట్టుకుందన్నారు. 'లాలూ జీ తన గురించి తానే ఆందోళన చెందాలి. ఆయన ప్రజా జీవితం నుండి రిటైర్ అయ్యేంత వయస్సు ఆయనది. ఆయన కుమారుడు, వారసుడు తేజస్వి యాదవ్ ఆయన మాట వినడం లేదు' అని జెడి(యు) నాయకుడు ఆరోపించారు. యాదృచ్ఛికంగా, జెడి(యు) గత దశాబ్దంలో ఆర్‌జెడితో రెండు స్వల్పకాలిక పొత్తులు కూడా పెట్టుకుంది, దీని వలన ఇప్పుడు ప్రతిపక్ష నాయకుడిగా ఉన్న యాదవ్ డిప్యూటీ సిఎంగా పదవీకాలం అనుభవించగలిగారు.



## బ్రహ్మపుత్రపై పరిణామాలు
# నిశితంగా పరిశీలిస్తున్నాం

**న్యూఢిల్లీ :** బ్రహ్మపుత్ర నదికి సంబంధించిన పరిణామాలను ప్రభుత్వం నిశితంగా పరిశీలిస్తున్నదని, చైనా ప్రతిపాదిత భారీ హైడ్రోపవర్ ప్రాజెక్టు గురించికూడా వి వరాలు సేకరిస్తున్నామని, దేశ ప్రయోజనాలను కా పాడేలా తగు చర్యలు తీసుకుంటున్నామని కేంద్ర మంత్రి కృతి వర్ధన్ సింగ్ గురువారం రాజ్యసభలో ప్రకటించారు. బ్రహ్మపుత్రకు ఎగువనున్న యార్లంగ్ త్సాంగ్పో నదిపై చైనా 60వేల మెగావాట్ల జలవిద్యుత్ ఉత్పత్తి చేసే భారీ డ్యామ్‌ను టిబెట్‌లోని మెడాగ్ కౌంటీలో ని ర్మిస్తున్నది. తృణమూల్ కాంగ్రెస్ సభ్యుడు సుష్మిత దేవ్ అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి సమాధానమిస్తూ బ్రహ్మపుత్ర నదికి సంబంధించిన పరిణామాలను ప్ర భుత్వం పరిశీలిస్తున్నదని, జాతి ప్రయోజనాలు కాపాడేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నట్టు లిఖితపూర్వకంగా తెలిపారు. సరిహద్దు నదీ పరివాహక సమస్యలపై 2006లో ఏర్పాటు చేసిన నిపుణులతో కూడిన యంత్రాంగం, దౌత్య వి ధానాల ద్వారా చర్చిస్తున్నట్టు వెల్లడించారు. అంతర్జాతీయ నదీ జలాల వాడకం పై దిగువ ప్రాంత దేశంగా మనకున్న హక్కులపై చైనాతో చర్చిస్తున్నట్టు తెలిపారు.



# లోక్‌పాల్‌కు 2400 ఫిర్యాదులు

**న్యూఢిల్లీ :** రెగ్యులర్ నంబర్‌ను కేటాయించడం ద్వారా లోక్‌పాల్ ఇప్పటివరకు 2,400కు పైగా అవినీతి ఫిర్యాదులు దాఖలయ్యాయని గురువారం రాజ్యసభ ప్రభుత్వం సమాచారమిచ్చింది. లోక్‌పాల్, లోకాయుక్తల చట్టం, 2013 (2014లో 1) జనవరి 16, 2014 నుండి అమల్లోకి వచ్చింది. లోక్‌పాల్ సంస్థ పూర్తిగా పనిచేస్తోందని కేంద్ర సిబ్బంది సహాయ మంత్రి జితేంద్ర సింగ్ ఒక లిఖితపూర్వక సమాధానంలో తెలిపారు. రెగ్యులర్ ఫిర్యాదు నంబర్‌ను కేటాయించడం ద్వారా 2,426 ఫిర్యాదులు నమోదు చేయబడ్డాయని సింగ్ చెప్పారు. 'ఈ నమోదైన ఫిర్యాదులలో, 2,350 ఫిర్యాదులు పరిష్కారమయ్యాయని (31.01.2025 నాటికి డేటా) ఆయన చెప్పారు. ప్రస్తుతం చైర్‌పర్సన్ కాకుండా ఆరుగురు సభ్యులు ఉన్నారని, వారిలో ముగ్గురు న్యాయ సభ్యులు అని ఆయన అన్నారు. చట్టంలోని సెక్షన్ 3 ప్రకారం, చైర్‌పర్సన్ కాకుండా, లోక్‌పాల్‌లో సభ్యుల సంఖ్య ఎనిమిది మందికి మించకూడదు, వారిలో 50 శాతం మంది న్యాయ సభ్యులు అని మంత్రి చెప్పారు.

# ప్రాంతీయ పార్టీలను అంతం చేయడమే బిజెపి కల

### శివసేన (యుటిబి) నేత ఆదిత్య ఠాక్రే

**న్యూఢిల్లీ :** దేశంలోని ప్రతి ప్రాంతీయ పార్టీని విచ్ఛిన్నం చేసి అంతం చేయడమే బిజెపి కల అని శివసేన (యుటిబి) నేత ఆదిత్య ఠాక్రే విమర్శించారు. తమ పార్టీకి, కేజ్రీవాల్‌కు, కాంగ్రెస్‌కు ఏమి జరిగిందో భవిష్యత్తులో నితీశ్, ఆర్జేడీ, చంద్రబాబుకు అదే జరుగవచ్చని అన్నారు. ఢిల్లీలో పర్యటించిన ఆదిత్య ఠాక్రే, ప్రతిపక్ష కూటమి ఇండియా బ్లాక్ నేతలను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. బుధవారం రాత్రి రాహుల్ గాంధీని కలిసినట్లు తెలిపారు. గురువారం అరవింద్ కేజ్రీవాల్‌తో భేటీ అవుతున్నట్లు చెప్పారు. కాగా, దేశ భవిష్యత్తు సందేహంలో ఉందని ఆదిత్య ఠాక్రే ఆందోళన వ్యక్తం చేశారు. 'ఇవాళ దేశంలో ఓటర్ల మోసం, ఇవిఎం మోసాల మధ్య మన ఓటు ఎక్కడికి వెళ్తుందో మనకు తెలియదు. నేడు మన దేశంలో ఎన్నికలు స్వేచ్ఛగా, న్యాయంగా జరుగుతున్నాయా? మనం ప్రజాస్వామ్యంలో జీవిస్తున్నామని భావిస్తున్నాం, కానీ అది ఇకపై ప్రజాస్వామ్యం కాదు. మాకు (శివసేన), కేజ్రీవాల్, కాంగ్రెస్‌కు ఏమి జరిగిందో, భవిష్యత్తులో నితీశ్, ఆర్జేడీ, చంద్రబాబుకు జరుగవచ్చు. దేశంలోని ప్రతి ప్రాంతీయ పార్టీని విచ్ఛిన్నం చేసి అంతం చేయడమే బిజెపి కల' అని అన్నారు.ఇండియా బ్లాక్ భవిష్యత్తుపై ఆదిత్య ఠాక్రే మాట్లాడారు. ఇండియా బ్లాక్‌లో చాలా మంది సీనియర్ నాయకులు ఉన్నారని తెలిపారు. దాని కోసం వారు రోడ్ మ్యాప్ సిద్ధం చేస్తారని చెప్పారు. 'ఇండియా బ్లాక్‌కు ఉమ్మడి నాయకత్వం ఉంది. ఒకే ఒక్క నాయకుడు లేడు. ఇది అహంకార పోరాటం లేదా ఒకరి ప్రయోజనం కోసం కాదు, దేశ భవిష్యత్తు కోసం పోరాటం' అని అన్నారు. మరోవైపు శివసేన విభజనకు కారణమైన మహారాష్ట్ర డిప్యూటీ సిఎం ఏక్‌నాథ్ షిండేను ఎన్‌సిపి (ఎస్‌పి) చీఫ్ శరద్ పవార్ సన్మానించడంపై వ్యాఖ్యానించేందుకు ఆదిత్య ఠాక్రే నిరాకరించారు. 'నేను దాని గురించి మాట్లాడను. ఇలాంటి వ్యక్తిని (షిండే) మా వర్గం ఎప్పుడూ గౌరవించదు. ఆయన మా పార్టీని మాత్రమే కాకుండా మహారాష్ట్ర వెన్నును కూడా విరిచారు' అని విమర్శించారు.



# లొంగిపోయిన 19 మంది మావోయిస్టులు

**ప్రజాపక్షం/భద్రాచలం :** ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన 19 మంది మావోయిస్టులు మూకుమ్మడిగా గురువారం ఎస్‌పి రోహిత్ రాజ్ ఎదుట లొంగిపోయారు. లొంగిపోయిన వారిలో మోస్ట్ వాంటెడ్ హిడ్మ కమాండర్‌గా వ్యవహరించిన పిఎల్‌జిఎ ఆర్మీ మొదటి బెటాలియన్‌కు చెందిన ముగ్గురు మావోయిస్టులున్నారు. అదే విధంగా సౌత్‌బస్తర్ డివిసిఎం సరోటి మునీష్ అలియాస్ ఆకాష్ ఉన్నారు. ఇతనిపై 8 లక్షల రివార్డు ఉంది. మడివినంద, మడివి హండా ఉన్నారు. వీరిరువురిపై చెరో రూ.4 లక్షల రివార్డు ఉంది. వీరితో పాటు లొంగిపోయిన వారిలో పలువురు సెంట్రల్ కమిటీ మావోయిస్టులకు గార్డులుగా వ్యవహరించిన వారు ఉన్నారు. గురువారం స్థానిక ఏఎస్‌పి కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో మీడియా ముందు ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఎస్‌పి రోహిత్ రాజ్ మాట్లాడుతూ ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో పలు విధ్వంసకర సంఘటనల్లో భాగస్వామ్యం ఉన్న మావోయిస్టులు స్వచ్ఛందంగా లొంగిపోయినట్లు చెప్పారు. మావోయిస్టు పార్టీ కార్యకలాపాలపై విసిగిపోయిన వారు జనజీవన స్రవంతిలో కలిసేందుకు ముందుకు వచ్చారని చెప్పారు. ప్రభుత్వం చేపడుతున్న ఆపరేషన్ చేయూత కార్యక్రమానికి ఆకర్షితులై అజ్ఞాతాన్ని వీడుతున్నారని చెప్పారు. గత ఏడాది నుండి ఇప్పటి వరకు 78 మంది మావోయిస్టులు లొంగిపోయారని ఎస్‌పి తెలిపారు. లొంగిపోయిన వారికి ప్రభుత్వం తరుపున అందాల్సిన ప్రోత్సాహాన్ని అందిస్తామని, అంకా అడవుల్లో ఉన్న మావోయిస్టులు లొంగిపోయిన మంచి జీవనాన్ని కొనసాగించాలని, అలాంటి వారికి జిల్లా పోలీస్ యంత్రాంగం తప్పకుండా అండగా ఉంటుందని చెప్పారు. ఇదిలా ఉండగా గతంలో లొంగిపోయిన మావోయిస్టు అసిస్టెంట్ కమాండర్ వెట్టి దేవ, మండకం గంగిలకు చెరో రూ.4 లక్షల క్యాష్ రివార్డును చెక్కుల రూపంలో ఎస్‌పి అందజేశారు. ఈ విలేకరుల సమావేశంలో ఓఎస్‌డి పారితోష్ పంకజ్, ఏఎస్‌పి విక్రాంత్ కుమార్, సింగ్, సిఆర్‌పిఎఫ్ 141 బెటాలియన్ అదనపు కమాండెంట్ ప్రీతా, 81 బెటాలియన్ డిప్యూటి కమాండర్ రాజేష్ డోగ్రా,మణుగూరు డిఎస్‌పి రవీంధర్ రెడ్డి, దుమ్ముగూడెం, చర్ల,అశ్వాపురం సిఐలు అశోక్, రాజువర్మ, అశోక్ రెడ్డి తదితరులున్నారు.

# భారత్–అమెరికా మధ్య వ్యూహాత్మక భాగస్వామ్య చర్చలు

**వాషింగ్టన్ :** అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌తో భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీ జరిపే చర్చల్లో ఆరు ప్రధానాంశాలు చోటు చేసుకున్నాయి. వాణిజ్యం, రక్షణ రంగం, ఇండో–పసిఫిక్ భద్రత, అధికారిక పత్రాలు లేకుండా అక్రమ వలసలపై అమెరికా విధానం, సాంకేతిక పరిజ్ఞానం బదిలీ, ఉగ్రవాదంపై పోరాటం, సాంస్కృతికరంగంలో ఆదాన ప్రదానాలపై ప్రపంచ నాయకులిద్దరిమధ్యా ప్రధానంగా విస్తారమైన చర్చలు జరిగాయి. భారత్–అమెరికా మధ్య సమగ్ర ప్రపంచ వ్యూహాత్మక భాగస్వామ్యం నిర్మించే దిశగా చర్చలు కొనసాగాయి. నరేంద్రమోదీ అమెరికాలో రెండు రోజుల పర్యటన నిమిత్తం వాషింగ్టన్ డి.సికి చేరుకున్నారు. ట్రంప్ 2.0 ప్రభుత్వం ''అమెరికా ఫస్ట్'' అనే వాణిజ్య ఎజెండా నినాదం లేవదీయడంతో బ్రిటన్, యూరప్ అనే విచక్షణ లేకుండా అన్ని దేశాలలో ఆందోళన చెలరేగుతున్న తరుణంలో మోదీ–ట్రంప్‌ల సమావేశం అత్యధిక ప్రాధాన్యత సంతరించుకుంది. వీరిద్దరిమధ్య గురువారంనాడు సమావేశం జరిగింది. దేశాధ్యక్షుడుగా రెండోసారి మూడు వారాల క్రితం అధికార బాధ్యతలు చేపట్టిన ట్రంప్‌తో మోదీ తొలి సమావేశం ఇదే.

**భారత్ ప్రయోజనాలు**

**ప్రపంచ భవిష్యత్తే లక్ష్యం**



అమెరికా రాజధాని నగరంలోని గుండెకాయవంటి కీలక ప్రదేశంలో ఉన్న అధ్యక్షుడి అతిథిగృహం 'బ్లెయిర్ హౌస్'లో మోదీ విడిది చేశారు. ''మాదేశ ప్రజల ప్రయోజనాలకోసం, మీదుమిక్కిలి ప్రపంచ ఉత్తమ భవిష్యత్తుకోసం అమెరికాతో కలిసి సన్నిహితంగా పనిచేసేందుకు భారత్ తన సంబంధాలను కొనసాగిస్తుందని ఎక్స్ వేదికగా మోదీ పోస్టింగ్ పెట్టారు. మోదీ బ్లెయిర్ హౌస్‌కు చేరుకోగానే భారత్ – అమెరికా డయాస్పోరాలకు చెందిన సభ్యులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ''గడ్డకట్టే చలిమధ్య ఎంతో ఆదరంగా, ,నులివెచ్చని ప్రత్యేక స్వాగతం లభించింది, వారికి నా కృతజ్ఞతలు'' అని మోదీ ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. ఈ మేరకు కొన్ని ఇమేజ్‌లను కూడా ఫాలోయర్లకు ఆయన షేర్ చేశారు. ప్రధానమంత్రికి వాషింగ్టన్ డి.సిలో ఘన స్వాగతం లభించిందని ప్రధానమంత్రి కార్యాలయం కూడా ఎక్స్ వేదికగా మరో పోస్టింగ్ చేసింది. అదేవిధంగా కొత్తగా గురువారంనాడు బాధ్యతలు చేపట్టిన అమెరికా జాతీయ ఇంటిలిజెన్స్ డైరెక్టర్ తుల్సీ గబ్బార్‌తో కూడా మోదీ సమావేశమయ్యారు. భారత్–అమెరికా మైత్రీ సంబంధాలపై ఆయనతో చర్చించారు. అమెరికాలో అత్యున్నతమైన పదవిలో నియమితులైనందుకు ఆమెకు మోదీ అభినందనలు తెలియజేశారు. పారిస్‌లో మొన్న ఎ ఐ శిఖరాగ్ర సదస్సు సందర్భంగా జరిగిన డిన్నర్‌లో అమెరికా ఉపాధ్యక్షుడు జె.డి.వాన్స్‌ను మోదీ కలిసి పలు అంశాలపై చర్చించారు. భారత విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిశ్రీ తొలుత మాట్లాడుతూ, 50.40 లక్షలమంది ఎన్ఆర్ఐలతో కూడిన శక్తిమంతమైన భారత్ డయాస్పోరా అమెరికాలో ఎంతో ప్రాధాన్యత పొందిందన్నారు. 3.50 లక్షలమంది భారతీయ విద్యార్థులు అమెరికాలోని వివిధ విశ్వవిద్యాలయాలలో విద్యార్జన చేస్తూ ఇరు దేశాల సంబంధాలను మరింత పటిష్టవంతం చేస్తున్నారని చెప్పారు.

**వాణిజ్యవ్యూహంలో పరస్పర టారిఫ్‌లు**
**వాణిజ్యవేత్తల్లో ఆందోళన**

నరేంద్రమోదీ–డోనాల్డ్ ట్రంప్ మధ్య సమావేశాన్ని అతి పెద్ద సంఘటనగా భావిస్తూ భారీ అంచనాలు వేస్తున్న తరుణంలో ఈ సమావేశానికి ముందుగా డోనాల్డ్ ట్రంప్ తన సొంత సోషల్ మీడియా ''ట్రూత్ ఫ్లాట్‌ఫామ్''పై అతిపెద్ద ప్రకటన చేశారు. ''మూడువారాల మా ప్రభుత్వ యంత్రాంగ ప్రయాణంలో ఈ గురువారం అతి పెద్ద సుదినం, పరస్పర వాణిజ్య సుంకాల అమలులో ఇది ఒక బిగ్ డే, మేక్ అమెరికా గ్రేట్ ఎగైన్'' అంటూ ట్రంప్ క్యాపిటల్ లెటర్స్‌లో ప్రకటన చేశారు. కొత్త టారిఫ్‌లు ఈ గురువారం నుండీ ట్రంప్ పాలనలో అమలులోకి రానున్నాయి. దీని ప్రకారం, భారత్ వంటి దేశం గనుక అమెరికా దిగుమతులపై 25 శాతం సుంకాలు విధిస్తే అమెరికా కూడా అంతకు సమానంగా, అమెరికాకు వచ్చే దిగుమతుల నిష్పత్తికి అనుగుణంగా సుంకాలను అమలు చేస్తుంది. ఈ టారిఫ్‌ల ప్రకటనతో ఆర్థికవేత్తలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. భారత్, థాయ్‌లాండ్ వంటి కొత్తగా రూపుదిద్దుకుంటున్న ప్రపంచశ్రేణీ మార్కెట్లలో వస్తువులపై భారీగా సుంకాలు విధించడం వల్ల తీవ్ర నష్టం కలుగుతుందనీ, మార్కెట్ వ్యవస్థలో తీవ్ర ప్రభావం చూపిస్తుందనీ వారు హెచ్చరించారు. ''కంటికి కన్ను, పంటికి పన్ను....సుంకానికి సుంకం...'' అంటూ అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో పలుదేశాలపై విధించబోయే టారిఫ్‌ల గురించి ట్రంప్ విస్తారంగా ప్రచారం చేశారు. దానికి తగ్గట్టుగానే వెనక్కి తగ్గకుండా ఆయన ఆచరణలో చర్యలు తీసుకుంటున్నారు.


SHRIRAM Finance **వాహనముల బహిరంగ వేలం ప్రకటన**

సమస్త ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా ఈ క్రింది వాహనములు వాయిదాలు సకాలంలో చెల్లించని కారణంగా స్వాధీనపరుచుకొని, ఉన్నవి ఉన్నట్లుగా వేలం ద్వారా విక్రయించుటకు నిర్ణయించబడినది.

| S.No | VEHICLE NO | Customer Name | MAKE & MODEL | YEAR |
|---|---|---|---|---|
| 1 | AP24TB 5141 | SWAROOPA KUKATLA | TOYOTA ETIOS DIESEL-P | 2012 |
| 2 | TS03EN 7830 | PRADEEP ODELA | MAHINDRA XYLO-P | 2016 |
| 3 | TS03EJ 3280 | RAJU THOTTE | JOHN DEERE 5310 HARVESTER | 2015 |
| 4 | TS05UA 1407 | PAVANKALYAN YETTARI | MAHINDRA ARJUN NOVA 605 HARVESTER | 2014 |
| 5 | TS27C 8721 | SHAIK RAMZAN | SWARAJ 724FE | 2019 |
| 6 | KBH 5500 | POTLA RAJI REDDY | JOHN DEERE 5310 HARVESTER | 2021 |
| 7 | TS27C 1771 | BUTTI THIRUPATHI | KUBOTA DC68G COMBINE HARVESTER | 2015 |
| 8 | TS03UC 9038 | RESHMA MOHAMMAD | JOHN DEERE 5310 | 2020 |
| 9 | AP31AM 6009 | RAMESH GANAGONI | APE XTRA LDX BS6 DIESEL | 2006 |
| 10 | TS03UD 3349 | VIAJYA LAXMI PALLAPU | INNOVA EURO 3 2.5 G DIESEL 7 SEATER | 2022 |
| 11 | TS01EC 5206 | MALIKARJUN PALLAPU | EICHER 380 | 2015 |
| 12 | TS11UA 5675 | YUSUF KHAM GULAM | MOBILIO 1.5L S DIESEL 7 SEATER | 2015 |
| 13 | TS03EX 6316 | KUMARA SWAMY KATTA | CHEVROLET ENJOY-P | 2016 |
| 14 | AP36AU 7464 | RAGHU KOYYADA | MAHINDER 475 DI | 2013 |
| 15 | TS03EE 3550 | MUDAPU KUMARA SWAMY | CASE 770 BACKHOE WITH GRADER | 2014 |
| 16 | TS03EG 7331 | RAGHU KOYYADA | JOHN DEERE 5042 | 2014 |

**AUCTION DATE: 15-02-2025**

VENUE : SHRIRAM AUTOMALL INDIA LTD, PUNNEL CROSS ROAD, BOLLIKUNTA, WARANGAL

గమనిక : వేలం తేది ప్రకటన నుండి బండి అమ్ముడు అయ్యే వరకు వర్తించును

**SHRIRAM FINANCE LIMITED**

D.No: 24-7-29, 1st Floor, Fathima Complex, Fathima Nagar, Kazipet, Warangal Cell : 9959090723, 9666726222

## ప్రజలకు వారధి ప్రజాపక్షం



**ప్రజాపక్షం/నార్కట్‌పల్లి :** ప్రజాక్షేత్రంలో జరిగే అన్యాయాలను తెలుపుతూ, ప్రజలకు, అధికారులకు వారధిగా ఉంటూ సమన్వయం చేస్తూ నిజాలు బయటకి తీసేదే ప్రజాపక్షం అని నార్కట్ పల్లి ఎంపిడిఓ కె. ఉమేష్ కుమార్ అన్నారు. గురువారం స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో ఉమేష్ కుమార్ ప్రజాపక్షం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం చేసే సంక్షేమ కార్యక్రమాల అమలు, వాటి పనితీరు, వాటి లోపాలను వెలిబుచ్చుతూ ప్రజలకు ఎటువంటి సమస్యలు వచ్చినా వాటిని అధికారులకు అందిస్తూ బాధితులకు వెన్నుగా ఉంటూ తోడ్పాటు అందించేది ప్రజాపక్షం మని కొనియాడారు.ఈ కార్యక్రమంలో సిపిఐ నియోజకవర్గం ఇంచార్జి లోడంగి శ్రవణ్, మండల కార్యదర్శి పెండ్యాల శంకర్, మండల నాయకులు వెంపటి శ్రీను, వెంకట్ రెడ్డి, మండల రిపోర్టర్ రాధారపు రమేష్, నర్సి రెడ్డి తదితరులున్నారు.

## ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత



**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి :** ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత ఏర్పడుతుందని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. మండల కేంద్రంలో శ్రీ వెంకటేశ్వర నగర్‌లోని శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి ఆలయ మూడవ వార్షికోత్సవ వేడుకలకు ఆయన హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త సల్వాది ధనిష్టి సుశీల దంపతులు ఎమ్మెల్యేను, కాంగ్రెస్ నాయకులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈకార్యక్రమంలో మాజీ ఎంపిపి దూదిపాల రేఖ శ్రీధర్‌రెడ్డి, పిఏసిఎస్ చైర్మన్ డా. వేణుధర్‌రెడ్డి, పార్లమెంట్ కో ఆర్డినేటర్ సిరాజ్‌ఖాన్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఊట్కూరి వేమన్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపిపి కాసర్ల వెంకటేశ్వర్లు, మాజీ జెడ్పిటిసి సలహాదారుడు పసునూరి యుగేందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ కుంభం శ్రీనివాస్‌గౌడ్, పట్టణ అధ్యక్షుడు కైసర్‌ఖాన్, జితేందర్ తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక ఎన్నికలకు సహకరించాలి

**ప్రజాపక్షం/ఉండవెల్లి :** స్థానిక ఎన్నికల సంసిద్ధతకు అన్ని పార్టీల నాయకులు సహకరించాలని ఉండవెల్లి మండల అభివృద్ధి అధికారి తిరుపతన్న అన్నారు. గురువారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో పార్టీల నాయకులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నిర్ణయం మేరకు శాంతియుత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు అందరూ సహకరించాలని వారి కోరారు. త్వరలో జరిగే స్థానిక సమరంపై ప్రజలందరూ ఎదురుచూస్తున్న ప్రయత్నంలో భాగంగా ముఖ్యంగా పార్టీ మండల అధ్యక్షులు కార్యకర్తలు ఉద్దేశంతో సూచనలు సలహాలు ఎంతో అవసరమని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు భాస్కర్ వివిధ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## సరిహద్దు వద్ద ముమ్మరంగా వాహనాల తనిఖీలు



**ప్రజాపక్షం/నందికొండ:** తెలుగు రాష్ట్రాల్లో బర్డ్ ఫ్లూ విజృంభిస్తూ వైరస్ వేగంగా వ్యాప్తి చెందుతుండడంతో నాగార్జునసాగర్‌లోని అంతర్రాష్ట్ర సరిహద్దు తనిఖీ కేంద్రం వద్ద బుధవారం తనిఖీ కేంద్రాలు ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. అయితే ఈ తనిఖీలు గురువారం రెండో రోజుకు చేరుకోవడంతో అధికారులు తనిఖీలను ముమ్మరం చేశారు. ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి అయ్యే కోళ్లు, కోడిగుడ్లపై ప్రత్యేక నిఘా పెట్టి తెలంగాణ రాష్ట్రంలోనికి వాహనాలు రాకుండా అప్రమత్తంగా ఉన్నారు. ఆంధ్రప్రదేశ్ లో బర్డ్ ఫ్లూ కేసులు నమోదు కావడంతో తనిఖీ కేంద్రం వద్దపశు సంవర్ధక శాఖ, అటవీశాఖ, పోలీసు శాఖకు చెందిన సిబ్బంది తమ విధులను నిర్వహిస్తున్నారు. వీరు వాహనాలను పూర్తిగా తనిఖీ చేసిన అనంతరం రాష్ట్రంలోకి అనుమతిస్తున్నారు.

## బ్రహ్మోత్సవాలపై సమీక్ష సమావేశం



**ప్రజాపక్షం/బీబీనగర్ :** మండలంలోని పడమటి సోమవారం గ్రామంలో గల శ్రీ లింగ బసవేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు ఈనెల 22, 23, 24 తేదీల్లో జరిగే స్వామివారి బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాటు చేయాలని భువనగిరి ఆర్డీవో కృష్ణారెడ్డి తెలిపారు. గురువారం దేవాలయ ప్రాంగణంలో నిర్వహించిన అధికారుల సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ అత్యంత వైభవంగా నిర్వహించే స్వామివారికి బ్రహ్మోత్సవాలు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలవకుండా రవాణా సౌకర్యాలు, హెల్త్ క్యాంపులు, పోలీస్ పికెటింగ్, మంచి నీటి సౌకర్యాలకు ఇబ్బంది కలగకుండా ఎప్పటికప్పుడు అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. ఈ సమీక్ష సమావేశంలో ఉత్సాహ కమిటి చైర్మన్ సంధిగారి బసవయ్య, తాసిల్దార్ ఎం.శ్రీధర్, సిఐ ప్రభాకర్ రెడ్డి, ఎస్ఐ రమేష్, విద్యుత్ ఏఈ పంచాయతీ మనోహర్ రెడ్డి, ఎంపీఓ మాజీ దేవాలయ కార్య నిర్వహణ అధికారి గోలి నరేందర్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి వేణుగోపాల్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## సిసి రోడ్డు పనులు ప్రారంభం

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** భూదాన్ పోచంపల్లి మండలంలోని పెద్దగూడెం గ్రామంలో గురువారం భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి సహకారంతో రూ.10 లక్షల ఎన్ఆర్‌జీఎస్ నిధులతో సీసీ రోడ్డు పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పకీరు మల్లారెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు పక్కీరు నర్సి రెడ్డి, అరుణ, నాయకులు కందాడి యాదిరెడ్డి, గట్టు రాంరెడ్డి, మన్నే ప్రభాకర్ రెడ్డి, కాసుల మల్లేష్, బాబా పాల్గొన్నారు.

# ఎన్నికల నియమావళిని తప్పనిసరిగా పాటించాలి

**ప్రజాపక్షం/ నల్లగొండ ప్రతినిధి:** వరంగల్ ఖమ్మం నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థులు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని తప్పనిసరిగా పాటించాలని జిల్లా కలెక్టర్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఇలా త్రిపాఠి తెలిపారు. నామినేషన్‌ల ఉపసంహరణ అనంతరం గురువారం ఆమె ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థులు, వారి ఏజెంట్లతో జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో సమావేశం నిర్వహించారు. ఎన్నికలలో పోటీలో ఉన్న అభ్యర్థులు పాఠశాల సమయాలలో ప్రచారం చేయడం నిషిద్ధమని, అనుమతుల కోసం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నియోజకవర్గం పరిధిలో ఉండే ఆయా జిల్లా ఎన్నికల అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులతో అనుమతులు తీసుకోవచ్చని తెలిపారు. మొత్తం నియోజకవర్గానికి సంబంధించిన అనుమతులను నల్లగొండ ఆర్ఓ ద్వారా తీసుకోవచ్చని చెప్పారు. ముఖ్యంగా వాహనాలు, ర్యాలీలకు సంబంధించిన అనుమతులు ఆయా జిల్లాలలో తీసుకోవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పోలింగ్ ఏజెంట్ల నియామకం, కౌంటింగ్ ఏజెంట్ల వివరాలు వెంటనే సమర్పించాలని, గుర్తింపు కార్డులకు ఫోటోలను వెంటనే ఇవ్వాలని అన్నారు. ఈ నెల 10న ప్రచురించిన ఓటరూ జాబితా ప్రకారం ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ల వివరాలను ఆమె అభ్యర్థులకు తెలియజేస్తూ 25797 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. సమీపంలోని




నల్లగొండ ఆర్జాల భావి వద్ద ఉన్న గోదాంలో స్ట్రాంగ్ రూమ్‌తో పాటు ,ఓట్ల లెక్కింపు కేంద్రాన్ని అక్కడే ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవార్ మాట్లాడుతూ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా గట్టి బందోబస్తును ఏర్పాటు చేయడం జరుగుతుందని, అభ్యర్థులు ర్యాలీలు, సమావేశాలకు తప్పనిసరిగా ముందస్తు అనుమతి తీసుకోవాలని, అలాగే కాన్వాసింగ్ వెహికల్స్‌కు సైతం ముందే అనుమతి తీసుకోవాలని చెప్పారు. ఎన్నికల ఏజెంట్లను నియామకంలో ఎలాంటి నేరచరిత లేని వారిని ఎంపిక చేయాలని అన్నారు. అభ్యర్థుల వద్ద ఎలాంటి లైసెన్స్ ఆయుధాలు ఉన్న ముందే డిపాజిట్ చేయాలని, ఎన్నికల నిబంధనల ప్రకారం ఉదయం 6 గంటల నుండి రాత్రి 10 గంటల వరకు లౌడ్ స్పీకర్లకు అనుమతి ఉంటుందని, కౌంటింగ్ సందర్భంగా మూడంచల భద్రత ఉంటుందని, సీసీటీవీ కెమెరాల నిఘాలో భద్రతను పర్యవేక్షించడం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ జే.శ్రీనివాస్ ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థులు, వారి ఏజెంట్లు తదితరులు పాల్గొన్నారు.

**ముగ్గురు అభ్యర్థులు నామినేషన్ ఉపసహరణ.. బరిలో 19 మంది**

వరంగల్ ఖమ్మం నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నామినేషన్ల ఉపసంహరణలో భాగంగా గురువారం ముగ్గురు స్వతంత్ర అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. దీంతో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో 19 మంది అభ్యర్థులు నిలిచారు. అయితే 23మంది అభ్యర్థులు ఎన్నికలో పోటీచేయడానికి నామినేషన్ దాఖలు చేయగా ఇండిపెండెంట్ అభ్యర్థి తుండు ఉపేందర్ నామినేషన్ పత్రాలపై సంతకం లేని కారణంగా రిటర్నింగ్ అధికారి నామినేషన్‌ను తిరస్కరించారు. మళ్ళీ గురువారం ముగ్గురు అభ్యర్థులు కోమటిరెడ్డి గోపాల్ రెడ్డి, గంగిరెడ్డి కోటిరెడ్డి, బండ నాగరాజులు తమ నామినేషన్లు ఉపసంహరించుకున్నారు.

## ఒక జెడ్‌పి, 9 ఎంపిటిసి స్థానాలకు ఓటర్ల జాబితా

**ప్రజాపక్షం/చందంపేట :** నల్గొండ జిల్లా చందంపేట మండలంలో ఒక జెడ్పిటిసి, తొమ్మిది ఎంపిటిసి స్థానాలకు సంబంధించిన వివరాలు గ్రామాల వారిగా కంబాలపల్లి ఎంపిటిసి పరిధిలోని కంబాలపల్లి, పొగిళ్ళ గ్రామ పంచాయతీ పరిధిలో పురుషులు 2044, స్త్రీలు 1830, పాత కంబాలపల్లి ఎంపిటిసి పరిధిలోని గువ్వలగుట్ట, పాత కంబాలపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో పురుషులు 1119, స్త్రీలు 990, యలమలమంద ఎంపిటిసిల పరిధిలోని యలమల మంద, రేకులగడ్డ, యాపలబాయి తండా గ్రామ పంచాయతీలలో పురుషులు 1540, స్త్రీలు 1364, తేల్దేవరపల్లి ఎంపిటిసి పరిధిలోని తేల్దేవరపల్లి, పాత తేల్దేవరపల్లి, మోత్యతండా, బొల్లారం పట్టి గ్రామ పంచాయతీలో పురుషులు 2069, స్త్రీలు 1976, చిత్రియాల ఎంపిటిసి పరిధిలోని బుడ్డోనితండా, పెద్దమూల, నల్లచేర్లమూల గ్రామ పంచాయతీ పరిధిలో పురుషులు 2000, స్త్రీలు 1884, చందంపేట ఎంపిటిసి పరిధిలోని చందంపేట, అచ్చంపేట పట్టి, ముర్పునూతల, కోరుట్ల గ్రామ పంచాయతీ పరిధిలో పురుషులు 1800, స్త్రీలు 1797, ముదుదండ్ల ఎంపిటిసిల పరిధిలోని ముదుదండ్ల, పోల్యనాయక్ తండా, గుంటిపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో పురుషులు 1669, స్త్రీలు 1627, పోలేపల్లి ఎంపిటిసి పరిధిలోని బిల్డింగ్‌తండా, మానావత్‌తండా, పోలేపల్లి, బండమీదితండా గ్రామ పంచాయతీ పరిధిలో పురుషులు 1700, స్త్రీలు 1585, గాగిళ్లాపురం ఎంపిటిసి పరిధిలోని గాగిళ్ళాపుర్, కాట్రావత్ తండా, గన్నేర్లపల్లి, హంక్యతండా గ్రామ పంచాయతీ పరిధిలో పురుషులు 2067, స్త్రీలు 2030లు ఉన్నట్లు మొత్తం మండల వ్యాప్తంగా తొమ్మిది ఎంపిటిసిల పరిధిలో పురుష ఓటర్లు 16008, స్త్రీ ఓటర్లు 15083 మొత్తం 31092 మంది ఓటర్ల తుది జాబితాను ప్రకటించడం జరిగింది.

## కన్నుల పండువగా సీతారాముల కళ్యాణం



108 దివిటీలతో ఎదుర్కోలు

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

**ప్రజాపక్షం/హుజూర్‌నగర్ :** హుజూర్ నగర్ పట్టణ శివారులో ఫణిగిరి గుట్టపై స్వయంభుగా వెలసిన సీతారామచంద్రస్వామి వారి కళ్యాణం కన్నుల పండుగగా జరిగింది. మేళతాళాలతో స్వామివారిని గట్టుపై నుండి కళ్యాణ వేదికకు తీసుకువచ్చారు. మొదటగా 108 దివిటీలతో ఎదుర్కోలు ఉత్సవం జరిగింది. స్వామివారి వైపు అర్చకులు మురళీకృష్ణమాచార్యులు, అమ్మవారి వైపు యాగ్నీకులు వేదాంతం మోహనకృష్ణమాచార్యులు ఎదుర్కోలు ఉత్సవాన్ని ఆద్యంతం వైభవంగా నిర్వహించారు. కార్యనిర్వహణాధికారి గుజ్జుల కొండారెడ్డి ముత్యాల తలంబ్రాలు, పట్టువస్త్రాలు స్వామివారికి సమర్పించారు. తెల్లవారుజామున బ్రహ్మ ముహూర్తంలో స్వామివారికి అమ్మవారికి గూడ జిలకర్రను అర్చక స్వాములు అలంకరించారు. విశ్వేక్సేనారాధన, వాసుదేవ పుణ్యహవాచనం,చేసి కంకణ ధారణను అర్చకులు వేదోక్తంగా నిర్వహించారు. పాదప్రక్షాళన చేసి అమ్మవారి మెడలో మంగళసూత్రాన్ని అలంకరింపజేశారు. గుట్ట కింద కళావేధికపై రంగస్థలం కళాకారుల సంక్షేమసంఘం వారిచే డ్యాన్స్ బేబి డ్యాన్స్ కార్యక్రమం ఉర్రూతలూగించింది. అనంతరం సీతారామచంద్రస్వామి అన్నదానం కమిటీ వారిచే భక్తులకు అన్నదానం కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. గట్టుమీద స్టేజీపై అన్నమయ్య భక్త భజన మండలి వారిచే భజన కార్యక్రమం అద్యంతం రసరమ్యంగా సాగింది. సీతారాముల కళ్యాణం తిలకించేందుకు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు.

# పేద కుటుంబం... పెద్ద కష్టం

ఆపరేషన్‌కు రూ. 5లక్షలు

రెక్కాడితే గానీ డొక్కాడని నిరుపేదలు

ఆర్థిక సహాయం చేయాలని వేడుకోలు



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్ :** పేద కుటుంబంకు చెందిన సైదమ్మ అనే మహిళకు పెద్ద కష్టమే వచ్చింది. హుజూర్‌నగర్ మండలం లింగగిరి గ్రామానికి చెందిన శీలం సైదమ్మ అనే మహిళకు గత వారం రోజుల క్రితం హుజూర్‌నగర్ కోదాడ జాతీయ రహదారిపై సీతారామాపురం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదం జరిగింది. ఆ రోడ్డు ప్రమాదంలో ఆమెతలకు గాయాలు కాగా చికిత్స నిమిత్తం ఖమ్మం వైద్యశాలకు తరలించారు. అక్కడ వైద్యపరీక్షలు చేసిన డాక్టర్లు మెదడులో రక్తం గడ్డ కట్టిందని తెలిపారు. చికిత్సకు పెద్ద మొత్తంలో వైద్య ఖర్చులు అవుతాయని తెలపడంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని గాంధీ వైద్యశాలకు తరలించారు. అక్కడి వైద్యులు కూడా మెదడులో రక్తం గడ్డకట్టడం వలన శస్త్ర చికిత్సను చేయాలని చెప్పడం జరిగింది. సదరు మహిళకు ప్రైవేటు వైద్యశాలలో డాక్టర్లను సంప్రదించగా అక్కడి వైద్యులు ఆపరేషన్ చేయించాలంటే సుమారు. ఐదు లక్షల వరకు ఖర్చు అవుతుందని చెబుతున్నారని భర్త శీలం సురేష్ వాపోయారు. అసలే రెక్కాడితేగానీ డొక్కాడని నిరుపేద కుటుంబం కావడంతో ఎటు పాలుపోని అయోమయ పరిస్థితిలో ఉన్నారు. తమను ఎవరైనా పెద్ద మనుసు చేసుకొని తన భార్య వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థిక సహాయం చేయాలని భర్త సురేష్ వేడుకుంటున్నారు. తమకు ఆర్థిక సహాయం చేయాలనుకునే వారు సెల్: 9542 246859 నంబర్‌ను సంప్రదించవచ్చునని తెలిపారు.

# వృద్ధురాలి హత్య కేసును ఛేదించిన పోలీసులు

పుస్తెలతాడు, కారు, నగదు స్వాధీనం

**ప్రజాపక్షం/భువనగిరిరూరల్ :** వృద్ధురాలు హత్య కేసును చేధించినట్లు డిసిపి ఎం.రాజేష్ చంద్ర తెలిపారు. గురువారం భువనగిరిలోని డీసీపీ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన కేసు వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా డిసిపి మాట్లాడుతూ ఆలేరు మున్సిపాలిటీకి చెందిన తునికి మణెమ్మ(80) తన కొడుకు రామారావు కుటుంబ సభ్యులతో కలిసి ఉంటుంది. కుటుంబ సభ్యులు ఇంట్లో వెనక గదిలో, మృతురాలు ఇంటి ముందు గదిలో ఉంటున్నట్లు చెప్పారు. ఈ క్రమంలో బుధవారం ఆమె ముందు గదిలో నిద్రిస్తుంది. స్థానికులు ఆమెను పలకరించడానికి ఇంటికి రాగా ఆమె విగతజీవిగా పడి ఉందన్నారు. ఎవరో గుర్తు తెలియని వ్యక్తి ఆమెను ఊపిరి ఆడకుండా గొంతు నొక్కి హత్య చేసి ఒంటిపై ఉన్న బంగారు గొలుసులను, నగదు దొంగలించినట్లు తెలిపారు. తమ బంధువు పుల్లెంగుల శంకర్ ఇంటికి వచ్చినట్లుగా తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని యాదగిరిగుట్ట రూరల్ సిఐ ఏడు కొండల రావు ఆధ్వర్యంలో దర్యాప్తు చేపట్టారు. పోలీసులు ఆలేరు పట్టణ శివారులో రహదారిపై వాహనాల తనఖీ నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ఒక కారు డ్రైవర్ పోలీసులు వాహనాలను ఆపుతుండడాన్ని గమనించి తప్పించుకోవడానికి ప్రయత్నించగా అప్రమత్తమైన పోలీసులు వెంటనే అతడిని పట్టుకున్నారు. కార్లు చూడగా బంగారు పుస్తెలతాడు కనిపించిన వెంటనే అతన్ని పట్టుకొని పుస్తెలతాడు గురించి అడుగగా జనగామకు చెందిన పుల్లెంగుల



శంకర్ అని చెప్పాడు. బుధవారం ఆలేరులో ఉండే మా బంధువు మణెమ గొంతు నులిమి చంపి బంగారు గొలుసును అపహరించినట్లు ఒప్పుకున్నాడన్నారు. ఈ గొలుసును హైదరాబాదులో అమ్మి డబ్బులు తెచ్చుకుందామని వెళ్తున్నట్లు అతను చెప్పాడన్నారు. గతంలో జనగాంలో ఒక కిరాణా షాపులో దొంగతనం చేసి జైలుకు వెళ్లి వచ్చినట్లు చెప్పారు. వృద్ధులు తను ఒంటిపై విలువైన వస్తువులు ధరించి ఉన్నప్పుడు ఒంటరిగా ఉండకుండా జన సంచారంలో ఉండాలని ఆయన కోరారు. అతడిని కోర్టుకు రిమాండ్ చేయనున్నట్లు డిసిపి తెలిపారు. అతని నుంచి బంగారు గొలుసు ఒక కారు నగదును స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏసిపి పి.రమేష్ కుమార్, యాదగిరిగుట్ట రూరల్ సిఐ యం.కొండలరావు, ఆలేరు ఎస్సై కె.రజనికర్, సిబ్బంది యన్.సత్యనారాయణ, సిహెచ్ చంద్ర శేఖర్, మహేష్ పాల్గొన్నారు.

# అంగరంగ వైభవంగా కళ్యాణ మహోత్సవం

**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :** రాయగిరి శ్రీ అలివేలు మంగ పద్మావతి సమేత వెంకటేశ్వర స్వామి కళ్యాణం అంగరంగ వైభవంగా వేద పండితుల ఆధ్వర్యంలో యాదగిరిగుట్ట దేవస్థానం పక్షాన దేవస్థానం సూపరింటెంట్ ధీరావత రామారావు స్వామివార్లకు యాదగిరిగుట్ట దేవస్థానం పక్షాన పట్టు వస్త్రాలను సమర్పించినారు. అలాగే రాయగిరి గ్రామ ప్రజల ఆధ్వర్యంలో సుమారు 350 మంది దంపతులు కళ్యాణం జరిపించారు. ఈ కార్యక్రమం భువనగిరి మున్సిపల్ మాజీ చైర్మన్ మాజీ వైస్ చైర్మన్ ఎన్నబోయిన చింతల కిష్టయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ వివాహ మహోత్సవ కార్యక్రమంలో రాయగిరి మాజీ ఎంపీటీసీ పాల్త్య హనుమంతు నాయక్, మాజీ సర్పంచ్ కళ్లెం బాల నరసింహ, మాజీ ఉప సర్పంచ్ మేకల బాల నరసింహ యాదవ్, ఆకుల నరసింహారావు దంపతులు, దాసరి శ్రీనివాస్, దువ్వూరి అనంతప్ప, కాయితీ నర్సి రెడ్డి, కాయితి హనుమంత్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ నాయిని అరుణ పూర్ణచందర్, దాసరి



శ్రీనివాస్ దంపతులు, గడ్డమీద చంద్రం దంపతులు, పాల్త్యా కిషన్, శ్రీరామ భక్త భజన మండలి సభ్యులు పెదగాని శ్రీనివాస్ గౌడ్, బృందం రాయగిరి గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## రైతన్నలకు సాగునీటి కష్టాలు



పురుగులమందు డబ్బాతో పొలంలో రైతు నిరసన

**ప్రజాపక్షం/సూర్యాపేట:** సూర్యాపేట జిల్లాలోని పలు ప్రాంతాల రైతులకు సాగు నీటి కష్టాలు తప్పడం లేదు. గత ప్రభుత్వ హయాంలో ఎస్ఆర్ఎస్‌పి కాల్వ ద్వారా గత ప్రభుత్వంలో రెండు పంటలకు సాగు నీరు అందేదని పలువురు రైతులు పేర్కొంటున్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని కుడకుడలో వరి పొలానికి సాగు నీరు అందడం లేదని రైతు వేములకొండ లక్ష్మయ్య తన పొలంలో పురుగుల మందుడబ్బాతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తాను మాట్లాడుతూ గత ప్రభుత్వం రెండు పంటలకు సాగునీరు సమృద్ధిగా లభించేదని కాంగ్రెస్ ప్రభుత్వంలో సాగునీరు అందక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బోరు, బావుల ద్వారా సాగు చేసిన వరి పొలాలు ఎండలు పెరగదంతో భూగర్భజాలు అడుగంటి ఎండిపోతున్నాయన్నారు. ఇప్పటికైన ప్రభుత్వం, సంబంధిత అధికారులు స్పందించి ఎస్ఆర్ఎస్‌పి, మూసీ ప్రాజెక్టు ద్వారా చివరి రైతుకు కూడా సాగునీరు అందేలా చూడాలని కోరారు.

## సంతోష్‌బాబు ప్రాణత్యాగం యువతకు స్ఫూర్తి కావాలి



**ప్రజాపక్షం/సూర్యాపేట:** దేశ రక్షణ కోసం మహావీరచక్ర, కల్నల్ సంతోష్‌బాబు చేసిన ప్రాణత్యాగం నేటి తరం యువతకు స్ఫూర్తి కావాలని ఆయన సతీమణి బిక్కుమళ్ళ సంతోషి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని సంతోష్‌బాబు 42వ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వాసవి క్లబ్, వాసవి యూత్ క్లబ్, రెడ్ క్రాస్ సోసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరం, అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కల్నల్ సంతోష్ బాబు ఆశయాలను నెరవేర్చేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఆయన ఆశయం, ఆశయాలను భవిష్యత్ తరాలకు అందించడంలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ రెడ్ క్రాస్ సోసైటి జిల్లా మేనేజింగ్ కమిటీ సభ్యులు తోట శ్యాంప్రసాద్, వాసవి యూత్ క్లబ్ రీజియన్ కార్యదర్శి యామ సంతోష్, వెంపటి రవితేజ, మంచాల శ్రీనివాస్, సింగిరికొండ రవీందర్, పబ్బతి ప్రవీణ్, వేణుమాదవ్, కృష్ణ, ప్రవీణ్ కుమార్, శ్యాంసుందర్, సుధాకర్, సతీష్, శ్రీనివాస్, శ్రీధర్, రాము, రతన్ పాల్గొన్నారు.

## నిర్లక్ష్యం నీడలో విద్యుత్ శాఖ



**ప్రజాపక్షం/చివ్వెంల:** మండలంలోని బద్య తండా గ్రామంలోని శ్రీ ఆంజనేయస్వామి దేవాలయంలో సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్ షార్ట్ సర్క్యూట్ తో వస్తున్న మంటలతో విద్యుత్ శాఖ నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనబడుతుంది. ఈ విషయమై సంబంధిత అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసిన స్పందించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. మంటలు రావడంతో ఎవరికి ఏలాంటి నష్టం జరగలేదని, ఇప్పటికైన విద్యుత్ శాఖ జిల్లా అధికారులు స్పందించి ప్రమాదం జరగకుండా చర్యలు తీసుకోవాలని గిరిజనులు కోరుతున్నారు.

## చేనేత పరిశ్రమ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి




**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి:** చేనేత పరిశ్రమ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని దానికోసం పోరాటం చేయాలని సహకార భారతీ కార్మికుల ఆల్ ఇండియా అధ్యక్షులు అనంత కుమార్ మిషరా పిలుపునిచ్చారు. గురువారం సహకర్ భారతి ఆల్ ఇండియా చేనేత విభాగం ఆధ్వర్యంలో చేనేత సమస్యలపై అభిప్రాయ సేకరణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని దిశ నిర్దేశం చేశారు. క్రింది స్థాయిలో ఉన్న లక్ష మంది చేనేత కార్మికులు ఢిల్లీ జంతర్ మంతర్ వెళ్లి సహకార భారతి ద్వారా తమ గొంతు వినిపించి ప్రధానమంత్రి దృష్టికి తీసుకువెళ్లాలని రేపటి పిల్లల భవిష్యత్తు కోసం చేనేత కళాకారులు పలు సమస్యలను ఆయన ముందు ఉంచారు. సమస్యలపై సంఘటితమై పోరాటం చేయాలనీ సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ చేనేత సెల్ జిల్లా కన్వినర్ గంజి బసవ లింగం, సహకార భారతి రాష్ట్ర అధ్యక్షులు యాదగిరి, అసెంబ్లీ కన్వీనర్ చిక్కుకృష్ణ, బీజేపీ పట్టణ అధ్యక్షులు దబ్బికారు సాహెష్, చేనేత కార్మిక సంఘం అధ్యక్షులు అంకం పాండు, చేనేత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు చింతకింది రమేష్, బీజేపీ మాజీ సర్పంచ్ నోముల గణేష్, ఏలె బిక్షపతి, రుద్ర శ్రీశైలం, రుద్ర చెన్నకేశవులు, కడవేరు శేఖర్, ఏల శ్రీనివాస్, గొలనుకొండ ప్రభాకర్, చేనేత కళాకారులు తదితరులు పాల్గొన్నారు.

## 13మంది నామినేషన్ల ఉపసంహరణ

### గ్రాడ్యుయేట్‌కు 12, టీచర్స్‌కు ఒకరు

**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి:** మెదక్, నిజామాబాద్, కరీంనగర్, ఆదిలాబాద్ పట్టభద్రుల, ఉపాధ్యాయుల నియోజకవర్గాల ఎమ్మెల్సీ ఎన్నికలకు నామినేషన్లు వేసిన 13 మంది అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. ఇందులో 12 మంది గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థులు, ఒక్కరు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి ఉన్నారు. గ్రాడ్యుయేట్ ఎన్నికలకు విత్ డ్రా చేసుకున్న వారిలో గవ్వల లక్ష్మి, ఎడ్ల సాయికృష్ణ, కావూరి సత్యనారాయణ గౌడ్, ఆలగొండ కృష్ణ చారి, నాలకంటి యాదగిరి, బడే నరసయ్య, లింగాల శ్రీనివాస్, రేకల సైదులు, మదనం గంగాధర్, లింగం కృష్ణ, సోమగాని నరేందర్, దార మనోహర్‌లున్నారు. టీచర్స్ ఎమ్మెల్సీకి నామినేషన్ విత్‌డ్రా చేసుకున్నవారిలో గవ్వల శ్రీకాంత్ ఉన్నారు.

## తిమ్మాపూర్‌లో యూరియా కొరత



**ప్రజాపక్షం/తిమ్మాపూర్:** యూరియా కొరతతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. తిమ్మాపూర్ మండలం నుస్తులాపూర్ సొసైటీలో యూరియా బస్తాలు అందుబాటులో ఉన్నాయని సమాచారంతో గురువారం రైతులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. కాగా సొసైటీకి 470 బస్తాలు మాత్రమే రావడంతో కొంతమంది రైతులకు బస్తాలు దొరకలేదు. దీంతో పలువురు రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పలుకుబడి ఉన్నవారికే యూరియా బస్తాలు అందజేశారని మండిపడ్డారు. తక్కువ బస్తాలే ఉన్నప్పుడు అందరికీ వచ్చేలా చూడకుండా పక్షపాతంగా వ్యవహరించారని ఆందోళన చేశారు. దీంతో సొసైటీ చైర్మన్ గుజ్జుల రవీందర్‌రెడ్డి, సిఈవో ఆంజనేయులు వారిని సముదాయించారు. ఆందోళన చెందవద్దని, శుక్రవారం అందరికీ సరిపోయేలా యూరియా అందుబాటులోకి తీసుకొస్తామని హామీ ఇవ్వడంతో విరమించారు. అనంతరం డబ్బులు చెల్లించగా యూరియా బస్తాలు రాని వారికి నగదు వాపసు చేశారు.

## ఫర్టిలైజర్ షాపుల్లో ఆకస్మిక తనిఖీలు



**ప్రజాపక్షం/ముత్తారం :** పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంతో పాటు ప్రవేటు ఫర్టిలైజర్ షాపులను గురువారం మండల వ్యవసాయ శాఖ అధికారి అనూష ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. అనంతరం పిఏసిఎస్, ఏఆర్ఎస్.కెలో 120 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉంది అని వ్యవసాయ అధికారి అనూష తెలిపారు. అలాగే పలు గ్రామాల్లోని ఫెర్టిలైజర్ షాపుల్లోని రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. షాపుల్లో యాప్ యూరియా స్టాక్ వెరిఫికేషన్ నిర్వహించారు. వారు మాట్లాడుతూ ముత్తారం మండలంలోని రైతులకు ఎరువులు సరిపడ యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయని అన్నారు.యూరియాను రైతులకు అధిక ధరలకు అమ్మ రాదని, అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. మండలంలో అనుమతి లేకుండా ఫెర్టిలైజర్ షాపులు నిర్వహించరాదు ఏవో అన్నారు.

## ఇసుక రీచ్ పాయింట్‌లో తనిఖీలు



**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి:** మానకొండూర్ మం డలం ఊటూరులోని ఇసుక రీచ్ పాయింట్ వద్ద రవాణా, రెవె న్యూ, మైనింగ్, పోలీసు అధికారులు గురువారం తనిఖీలు చేశారు. రీచ్ రికార్డులను పరిశీలించారు. ఇసుక యార్డుకు వాహనాలు వెళ్లే దారిని పరిశీలించారు. సిసి కెమెరాల పనితీరును పర్యవేక్షించారు. అనుమతి కంటే ఎక్కువ లోడును తరలిస్తే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. వాహనాలను నిరంతరం తనిఖీ చేయాలని స్థానిక అధికారులను ఆదేశించారు. ఈ తనిఖీలో డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ పురుషోత్తం, ఎంవిఐ రవి కుమార్, అసిస్టెంట్ జియాలజిస్ట్ వెంకటేశ్వర్ రావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## పోలింగ్ కేంద్రాల పెంపునకు వినతి

**ప్రజాపక్షం/రామగిరి:** పెద్దపల్లి జిల్లా కమాన్‌పూర్ మండలం గుండారం, కమాన్ పూర్ గ్రామాలలో ఓటర్లు అధికంగా ఉన్నందున కమాన్‌పూర్‌లో మరో రెండు, గుండారం లో మరో రెండు పోలింగ్ కేంద్రాలను పెంచాలని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో లత, తహసిల్దార్ వాసంతికి గురువారం బిజెపి మండల ప్రధాన కార్యదర్శి మల్లారపు అరుణ్ కుమార్ వినతి పత్రం అందజేశారు. పోలింగ్ కేంద్రాల పరిధిలో 700 కి పైగా ఓటర్లు ఉంటే ఓట్లు వేసే క్రమంలో సమయం ఎక్కువగా పడుతుందని కావున మరో నాలుగు కేంద్రాలు పెంచితే ఓటర్లకు త్వరగా ఓటు వేసేందుకు అవకాశం కల్పించడం జరుగుతుందని మల్లారపు అరుణ్ వినతి పత్రంలో పేర్కొన్నారు.

## 69 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు

**ప్రజాపక్షం/మల్యాల:** జగిత్యాల జిల్లా మల్యాల మండలంలో 19 గ్రామ పంచాయితీలలో మండల ప్రాదేశిక , జిల్లా ప్రాదేశిక ఎన్నికల నిర్వహణ కోసం ఈ నెల 10న ప్రదర్శించబడిన వార్డుల వారిగా ఓటరు జాబితాలలో ఏమైనా అభ్యంతరాలు ఆక్షేపణల కోసం మల్యాల మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడివో స్వాతి ఆధ్వర్యంలో మండలంలోని ప్రధాన రాజకీయ పార్టీల అధ్యక్షులు, ఉపాధ్యక్షులు కార్యదర్శిలతో గురువారం సమావేశం ఏర్పాటు చేశారు. వార్డుల వారీగా ఓటరు జాబితాలో మండల ప్రాదేశిక నియోజకవర్గం , జిల్లా ప్రాదేశిక నియోజకవర్గం 2వ సాధారణ ఎన్నికలలో భాగంగా ప్రచురించిన 69 పోంలిగ్ కేంద్రాలపై ఎలాంటి ఆక్షేపణలు రాలేదని మల్యాల మండలంలో 69 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఎంపీడివో స్వాతి తెలిపారు.

## సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

**ప్రజాపక్షం/కొహెడ:** సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని కొహెడ ఎస్ఐ అభిలాష్ అన్నారు.బుధవారం సిద్దిపేట జిల్లా కొహెడ మండలం వింజపల్లి గ్రామన్ని కొహెడ ఎస్ఐ అభిలాష్ సందర్శించారు.ఆయన మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలల్లో ప్రజలందరూ కలిసిమెలిసి ఉండాలని ఎన్నికలు వస్తుంటాయి పోతుంటాయి వాటిని అడ్డం పెట్టుకొని గొడవలకు దిగవద్దని, శాంతియుత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించడానికి గ్రామస్తులు సహకరించాలని సూచించారు.గంజాయి డ్రగ్స్ ఇతర మత్తు పదార్థాల జోలికి వెళ్ళవద్దని, ఆన్‌లైన్ మోసాల బారిన ఎవరు కూడా పడవద్దని, ఎవరైనా సైబర్ నేరాల బారిన పడితే వెంటనే 1930 సైబర్ సెల్ జాతీయ ప్లైన్ నెంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు నమోదు చేయాలన్నారు.గ్రామంలో ఎవరైనా చట్ట వ్యతిరేకమైన కార్యక్రమాలు నిర్వహించిన, అనుమానస్పదంగా కనిపించిన వెంటనే డయల్ 100కు కాల్ చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, గ్రామ ప్రజలు, ప్రజా ప్రతినిధులు, గ్రామ యువకులు, తదితరులు పాల్గొన్నారు.

# మహిళల సాధికారత, రక్షణకు ప్రాధాన్యత

### కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి





**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి:** మహిళాభివృద్ధి శిశు సంక్షేమశాఖ ఆద్వర్యంలోని సఖి కేంద్రం, మహిళా సాధికారత విభాగం సేవలపై ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. సఖి కేంద్రం, జిల్లా మహిళా సాధికారత కేంద్రం మేనేజ్‌మెంట్ కమిటీ సమావేశం గురువారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో జరిగింది. కలెక్టర్ మాట్లాడుతూ సఖి సేవలను అందరికీ తెలిసేలా ప్రజలు సందర్శించే స్థలాల్లో కలెక్టరేట్ ప్రాంగణంలో బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. వయోవృద్ధుల సమస్యలపై ఆర్డీవో కార్యాలయానికి, ప్రజావాణికి వస్తున్న వారికి అవసరమైన సహాయం,కౌన్సిలింగ్అందించాలనిఆదేశించారు.సఖి కేంద్రానికి వచ్చే బాధిత మహిళలకు ఏదైనా సహాయం కావాలంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. వయోవృద్ధుల సమస్యలపైఆర్డీవో కార్యాలయానికి ప్రజావాణికి వస్తున్న వారికి అవసరమైన సహాయం, కౌన్సిలింగ్ అందించాలని ఆదేశించారు. సఖి కేంద్రానికి వచ్చే బాధిత మహిళలకు ఏదైనా సహాయం కావాలంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. పనిచేసే ప్రదేశాలలో మహిళల రక్షణకు ఏర్పాటు చేసిన ఐసిసి కమిటీల గురించి తెలిసే బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. ఈ కమిటీలను బలోపేతం చేయాలన్నారు. విధ్యార్థులు పెడదోవ పట్టకుండా పాఠశాలలు, కళాశాలలను సందర్శించి అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని సూచించారు. పోలీసులు కూడా ఈ కౌన్సిలింగ్‌లో భాగస్వాములు కావాలన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.వెంకటేష్ మాట్లాడుతూ పాఠశాల స్థాయి నుంచి కొంత మంది మత్తు పధార్థాలకు అలవాటు పడడం బాధాకరమని అన్నారు. విద్యాశాఖ, పోలీసులు ఈ విషయమై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. సఖి కేంద్రం, మహిళా సాధికారత కేంద్రం సేవలను అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇ చ్చారు. ట్రైనీ కలెక్టర్ అజయ్ యాదవ్, జిల్లా సంక్షేమ అధికారి కె.సబిత,బిఎండబ్ల్యూవో పవన్‌కుమార్, డిఈవో జనార్దన్, సఖి కేంద్రం అడ్మిన్ లక్ష్మి, మహిళా సాధికారత కేంద్రం కో ఆర్డినేటర్ శ్రీలత అధికారులున్నారు.

### ఎన్నికలు ఎప్పుడొచ్చినా సిద్ధంగా ఉండాలి

**కరీంనగర్ ప్రతినిధి:** స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు వచ్చినా రిటర్నింగ్ అధికారులు సిద్ధంగా ఉండాలని పమేలా సత్పతి అన్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికల విధుల నిర్వహణపై కలెక్టరేట్ ఆడిటోరియంలో గురువారంరిటర్నింగ్ అధికారులు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులకు మాస్టర్ ట్రైనర్లు శిక్షణ ఇచ్చారు. కలెక్టర్ మాట్లాడుతూ పంచాయతీ ఎన్నికల్లో రిటర్నింగ్ అధికారులు ముఖ్యపాత్ర పోషిస్తారన్నారు. అందువల్ల ఎన్నికల విధులను ఎంతో జాగ్రత్తగా నిర్వర్తించాలని సూచించారు.నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, పార్టీ గుర్తుల కేటాయింపు, బ్యాలెట్ పద్దతిలో ఓటింగ్ విధానం, ఓట్ల లెక్కింపు, ఎన్నికల నియమావళి తదితర అంశాలపై మాస్టర్ ట్రైనర్లు దేవి శ్రీనివాస్, టి.సంపత్, ఆర్.రవీందర్, పరశురాం శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, డిపివో పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## 42 పడకల ఆసుపత్రి భవనం సిద్ధం

### పెద్దపల్లికలెక్టర్ కోయ శ్రీ హర్ష



**ప్రజాపక్షం/పెద్దపల్లిప్రతినిధి:** ఆసుపత్రి ప్రాం గణంలోనూతనంగా చేపట్టిన 42 పడకల ఆసు పత్రి భవన నిర్మాణం పూర్తయిందని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు.గురువారం జి కోయ శ్రీ హర్ష ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలో నిర్మాణం అవుతున్న 42 పడకల ఆసుపత్రి భవనాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూజిల్లాలో ప్రజల సౌకర్యార్థం ఆసు పత్రి ప్రాంగణంలో మరో 42 పడకల ఏర్పాటు చేసేలా భవనాన్ని నిర్మించామని, వీటిని సమర్థవంతంగావినియోగించుకునేలాఆసుపత్రి యంత్రాంగం ఏర్పాటు చేయాలన్నారు. నూతన భవనంలోకి డయాలసిస్ యూనిట్ తరలింపు కోసం అదనపు స్పెస్ అవసరం పడుతుందని, దీనికోసం చేపట్టాల్సిన చర్యల గురించి కలెక్టర్ సంబంధిత నిర్మాణ ఏజెన్సీలకు సూచనలు చేశారు. జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీధర్, డాక్టర్ వాసుదేవ రెడ్డి, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

### బాలల సమస్యలపై '1098'కు ఫోన్ చేయాలి

**పెద్దపల్లి ప్రతినిధి :** బాలల సమస్యలపై ఫిర్యాదులు అందించేందుకు 1098 ఫోన్ నెంబర్ కు ఫోన్ చేయాలని శ్రీ హర్ష అన్నారు.గురువారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లో బాలల సంరక్షణ చర్యలపై సంబంధిత మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఉన్న అనాథ పిల్లలు, సెమీ ఆర్ఫన్ పిల్లలో స్పాన్సర్షిప్ కు అర్హులైన పిల్లలను గుర్తించి వారి వివరాలు సేకరించాలని ఆదేశించారు. బాల్య వివాహాలు జరగకుండా సంబంధిత అధికారులు సమన్వయం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలో ఎక్కడ చట్ట వ్యతిరేక దత్తతలు జరగకుండా సంబంధిత ఆసుపత్రి సూపరింటెండెంట్ లతో సమన్వయం చేసుకోవాలని, గ్రామీణ బాలల పరిరక్షణ కమిటీలకు అవసరమైన శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ తెలిపారు. బాలల పై జరిగే లైంగిక దాడులను నివారించేందుకు సంబంధిత వ్యవస్థలతో సమయం చేసుకుని పని చేయాలని కలెక్టర్ ఆదేశించారు. బాల కార్మికులు లేని జిల్లాగా పెద్దపల్లిని తీర్చిదిద్దాలని ఇటుక బట్టీలలో పనిచేసే పిల్లలు గుర్తించి వారికి విద్య అదే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. పిల్లల ద్వారా జరిగే భిక్షాటన వివరాలు, బాల్య వివాహాలు, బాల కార్మికులు ఎక్కడైనా కనబడితే 1098 కు ఫోన్ చేసి వివరాలు అందించాలని అన్నారు.అనాథ పిల్లలను బాల సదనంలో చేర్పించ వచ్చని కలెక్టర్ తెలిపారు.ఈ సమావేశంలో జిల్లా బాలల పరిరక్షణ అధికారి కమలాకర్, చైల్డ్ హెల్ప్ లైన్ కోఆర్డినేటర్ ఉమాదేవి, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## పత్తి రైతులకు మద్దతు ధర కల్పించాలి



**ప్రజాపక్షం/జమ్మికుంట:** పత్తి రైతులకు మద్దతు ధర వచ్చేలా అన్ని చర్యలు చేపడుతున్నామని కరీంనగర్ జిల్లా మార్కెటింగ్ అధికారి ఎండి షాబుద్దీన్ అన్నారు. గురువారం జమ్మికుంట పత్తి మార్కెట్‌లో మార్కెట్ చైర్మన్ పుల్లూరి స్వప్న సదానందం, మార్కెట్ కార్యదర్శి ఆర్.మల్లేశం, ద్వితీయ శ్రేణి కార్యదర్శి ఎన్.రాజాతో కలిసి మార్కెట్‌లో క్రయవిక్రయాలు, తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. అంతకుముందు ఖరీదు వ్యాపారులు, అడ్తి వ్యాపారులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సంధర్భంగా పత్తి రైతులకు మద్దతు ధర కల్పించడంతో పాటు రైతులకు అండగా ఉండాలని వారికి సూచించారు. ఆదార్‌కార్డు ఆన్‌లైన్‌లో చూపించకపోవడం వల్ల సిసిఐ కొనుగోలు నిలిచిపోయాయని, ప్రభుత్వం అన్ని చర్యలు చేపడుతుందని అప్పటి వరకు రైతులు ప్రైవేట్ వ్యాపారులకుఅమ్ముకునేందుకు వస్తారన్నారు. వారికి మంచి మద్దతు ధర వచ్చేలా చూడాలని సూచించారు. మార్కెట్‌లో జరిగే వేలం పాటలో షాబుద్దీన్ పాల్గొని రైతుల మద్దతు ధర విషయంలో కఠినంగా ఉంటామని ఆయన రైతులకు భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో మార్కెట్ వైస్ చైర్మన్ సతీష్ రెడ్డి, డైరెక్టర్లు , సిబ్బంది పాల్గొన్నారు.

## ఎంఎల్‌సి ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగురవేయాలి

### చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



**ప్రజాపక్షం/గంగాధర:** ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాం గ్రెస్ అభ్యర్థి వి.నరేందర్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ, స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ సత్తా చాటాలన్నారు. గంగాధర మండలం మంగపేట గ్రామ పంచాయతీ పరిధిలోని జివిఆర్ ఫంక్షన్‌హాలులో ఎమ్మె ల్సీ ఎన్నికల, స్థానిక సంస్థల ఎన్నికల సంధర్భంగాసన్నాహక సమావేశం నిర్వహించారు. అం తకుముందు భారీబైక్‌ర్యాలీ నిర్వహించారు. ఎమ్మె ల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ పట్టభద్రులు, నిరుద్యోగుల సమస్యలపై వూట్కూరి నరేందర్‌రెడ్డికి సంపూర్ణ అవగాహన ఉందన్నారు. గత పదేళ్లలో పట్టభద్రులు, నిరుద్యోగులు, ఉద్యోగులను బిఆర్ఎస్ ప్రభుత్వం ఎలా మోసిందో ప్రజలందరికీ తెలుసన్నారు. పోటీ పరీక్షలను నిర్వహించిన క్రమంలో పేపర్ లీక్ చేసిన చరిత్ర బిఆర్ఎస్ పార్టీదన్నారు. పాన్‌షాపులు, జిరాక్స్ సెంటర్లలో పోటీ పరీక్షల పేపర్లు అమ్మిన చరిత్ర బిఆర్ఎస్ పాలనలో జరిగిందని గుర్తు చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత జాబ్ క్యాలెండర్ ఏర్పాటు చేసి ఉద్యోగాలను భర్తీ చేసే ప్రక్రియ సీఎం రేవంత్‌రెడ్డి ఆద్వర్యంలో జరుగుతుందన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ జాగిరపు రజిత శ్రీనివాస్‌రెడ్డి, కురిక్యాల సింగిల్ విండో చైర్మన్ వెలిచాల తిర్మల్‌రావు, పుల్కం నర్సయ్య, మాజీ వైస్ ఎంపిపి రాజగోపాల్ రెడ్డి, వేముల భాస్కర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పురుమల్ల మనోహర్, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ముత్యం శంకర్, చొప్పదండి నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు వొడ్నాల యగ్నేస్, తోట సంధ్య కరుణాకర్, దుబ్బాసి బుచ్చయ్య, బూరుగు గంగన్న, కర్ర విద్యాసాగర్ రెడ్డి, దోర్నాల శ్రీనివాస్ రెడ్డి, సత్తు కనకయ్య, పద్నాల రాజన్న, చక్రపాణి, అట్ల శేఖర్ రెడ్డి, రోహిత్ రెడ్డి, మల్లేశం, చందు, మధు, శంకరయ్య, మ్యాక వినోద్ తదితరులున్నారు.

## పారదర్శకంగా ఎన్నికల నిర్వహణ

**ప్రజాపక్షం / రాజన్న సిరిసిల్ల ప్రతినిధి :** గ్రామ పంచాయతీ సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికల నిర్వహణ బాధ్యతలను పారదర్శకంగా నిర్వర్తించాలని డిపివో, నోడల్ అధికారి శేషాద్రి సూచించారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో రిటర్నింగ్ సహాయ అధికారులు, ఎంపిడివోలు, ఎంపివోలకు పంచాయతీ ఎన్నికల నిర్వహణపై గురువారం శిక్షణ తరగతులు ఏర్పాటు చేశారు. డిపివో, నోడల్ అధికారి శేషాద్రి మాట్లాడారు. ఎన్నికల నియమ నిబంధనల గురించి స్పష్టమైన అవగాహన ఉన్నప్పుడే పొరపాట్లకు ఆస్కారం ఉందని స్పష్టం చేశారు. ఎన్నికల సంఘం ద్వారా అందించిన హ్యాండ్ బుక్( కరదీపిక)ను చదువుకుని సజావుగా ఎన్నికలు జరిగేలా కృషి చేయాలని ఆదేశించారు. ఏ సందేహాలు ఉన్నా, అధికారులను అడిగి నివృత్తి చేసుకోవాలని అన్నారు. నామినేషన్ల స్వీకరణ ప్రక్రియకు అనువుగా ఉండే గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని ముందుగానే ఎంపిక చేసుకుని, నామినేషన్ల స్వీకరణ, స్క్రూటీని, ఉపసంహరణ ప్రక్రియలను ఈసి మార్గదర్శకాలకు అనుగుణంగా రిటర్నింగ్ అధికారులు తమ స్వీయ పర్యవేక్షణలో నిర్వహించాలని సూచించారు. సమయ పాలనను పక్కాగా పాటిస్తూ నామినేషన్ల స్వీకరణ కేంద్రం గదిలో తప్పనిసరిగా గోడ గడియారం అందుబాటులో ఉండేలా చూసుకోవాలన్నారు. అభ్యర్థులు ఎన్నిసెట్ల నామినేషన్లు సమర్పిస్తే, అన్ని నామపత్రాలను తప్పనిసరిగా పరిశీలించాలని, వాటిలో ఎన్ని ఆమోదించబడ్డాయి. ఎన్ని తిరస్కరణకు గురయ్యాయి. అందుకు గల కారణాలను ఏమిటి అనే అంశాలను వెల్లడించాల్సి ఉంటుందన్నారు. ఎలాంటి ఆక్షేపణలు తావులేకుండా పూర్తి పాదర్శకంగా ఎన్నికలను నిర్వహణ బాధ్యతలను నిర్వర్తించాలని పేర్కొన్నారు. ఆర్వోలు 194 మంది, ఏఆర్వోలు 75 మంది, ఎంపిడివోలు, ఎంపివోలు శిక్షణకు హాజరయ్యారు. శిక్షణ తరగతుల్లో డిఎల్ పివో నరేష్, మాస్టర్ ట్రైనర్లు తదితరులు పాల్గొన్నారు.

## మహాశివరాత్రి జాతరకు పకడ్బందీ ఏర్పాట్లు

### జిల్లా ఎస్‌పి అఖిల్ మహాజన్



**ప్రజా పక్షం/వేములవాడ :** మహా శివరాత్రి జాతర సందర్భంగా ప్రధాన ఆలయ ప్రాంగణంలో, పార్కింగ్ ప్రదేశాల్లో, ఆలయంలోకి వచ్చివెళ్లే దారులు,క్యూ లైన్లలో, కళ్యాణ కట్ట, ధర్మ గుండం, ఆలయ ప్రాంగణంలో చేస్తున్న ఏర్పాట్లను పోలీస్,ఆలయఅధికారులతో కలసి గురువారం పరిశీలించారు. ఎస్పీ మాట్లాడుతూ ఈ నెల 25 నుంచి 27వ వరకు నిర్వహించనున్న మహ శివ రాత్రి జాతర వేడుకలలో గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని పకడ్బందీగా జాతర ఏర్పాట్లను నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. పార్కింగ్ ప్రదేశాల్లో విధులలో ఉన్న సిబ్బందికి టెంట్ మంచి నీటి సదుపాయలు కల్పించాలన్నారు. పట్టణ కేంద్రంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ట్రాఫిక్ డ్రైవర్షన్ల వద్ద సూచిక బోర్డ్స్, ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని సూచించారు.ప్రధాన అలయంతో పాటుగా అనుబంధ దేవాలయాల వద్ద ,పార్కింగ్ ప్రదేశాల వద్ద, శివార్చన ప్రదేశంలో,ట్రాఫిక్ జంక్షన్‌ల వద్ద బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వేములవాడ ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి, స్పెషల్ బ్రాంచ్ డిఎస్పీ మురళి కృష్ణ, సిఐలు వీరప్రసాద్, శ్రీనివాస్,స్పెషల్‌బ్రాంచ్ సిఐ శ్రీనివాస్,మున్సిపల్‌కమిషనర్ అన్వేష్, ఆలయ ఈ.ఓ. వినోద్ రెడ్డి, ఆలయ ఈ.ఈ రాజేష్, డిఈ మహిపాల్‌రెడ్డి ఉన్నారు.

## పట్టభద్రుల బలం నరేందర్‌రెడ్డి గళం



**ప్రజాపక్షం/వేములవాడ:** మెదక్ నిజామాబాద్ ఆదిలాబాద్ కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా ఎమ్మెల్సీ కాంగ్రెస్ అభ్యర్థిగా నరేందర్‌రెడ్డిని గెలిపించుకోవాల్సిన బాధ్యత మనపై ఉందని శాసనసభ్యులు, ప్రభుత్వవిప్ ఆదిశ్రీనివాస్ అన్నారు.గురువారం కాంగ్రెస్ నాయకుల,ముఖ్య కార్యకర్తలసమావేశంలో ఆది శ్రీనివాస్ మాట్లాడారు. ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డికి భారీ మెజార్టీ వచ్చేలా మండలాల అధ్యక్షులు, మార్కెట్ కమిటీ చైర్మన్‌లు, తాజా మాజీ కౌన్సిలర్లు, సర్పంచులు కృషి చేయాలన్నారు. ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్ రెడ్డి మాట్లాడుతూ పేద విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం తాను కట్టుబడి ఉంటానన్నారు. ఉద్యోగ, నిరుద్యోగ, పట్టభద్రుల సమస్యలపై చట్టసభల్లో పట్టభద్రుల గొంతుక వినిపిస్తానని స్పష్టం చేశారు. గ్రంధాలయ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్, మాజీ జెడ్పిటిసి నాగం కుమార్, కాంగ్రెస్‌జిల్లా ఉపాధ్యక్షులు కూరగాయల కొమురయ్య, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సాగరం వెంకటస్వామి, పట్టణ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చంద్రగిరి శ్రీనివాస్, బింగి మహేష్, మార్కెట్ చైర్మన్ రొండి రాజు,రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు పాత సత్యలక్ష్మి పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబానికి పరామర్శ



**ప్రజాపక్షం/చిగురుమామిడి:** మండలంలోని రేకొండ గ్రామానికి చెందిన చెంచల సంపత్ అనే యువ రైతు చింత చెట్టుపై నుంచి పడి ఇటీవల మృతిచెందిన విషయం తెలుసుకున్న సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి వారి కుటుంబ సభ్యులను గురువారం పరామర్శించారు.సంపత్ చిత్రపటానికి నివాళులర్పించిన అనంతరం సంపత్‌కుటుంబ సభ్యులను ఓదార్చారు. అధైర్య పడొద్దని బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకునేలా తమ వంతు ప్రయత్నం చేస్తామని చాడ వెంకటరెడ్డి హామీ ఇచ్చారు. సిపిఐ మండల కార్యదర్శి నాగెల్లి లక్ష్మారెడ్డి, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బోయిని అశోక్, సిద్దిపేట జిలా కార్యదర్శి మంద పవన్, గ్రామ కార్యదర్శి బోయిని వల్లభాయ్ పటేల్, మాజీ ఎంపిటిసి పరకాల కొండయ్య, రైతు సంఘంజిల్లానాయకులువిలాసాగరం అంజయ్య, కార్యవర్గ సభ్యులు బోయిని సంజీవ్, సూరం ఐలయ్య పాల్గొన్నారు.

## సమన్వయంతో పనిచేస్తేనే సత్ఫలితాలు

### బ్రహ్మోత్సవాలు విజయవంతం చేయాలి

### జగిత్యాల కలెక్టర్ సత్యప్రసాద్



**ప్రజాపక్షం / ధర్మపురి :** ప్రసిద్ధ పుణ్యక్షేత్రం జగిత్యాల జిల్లా ధర్మపురి శ్రీ లక్ష్మి నృసింహ స్వామి బ్రహ్మోత్సవాలకై తరలి వచ్చే భక్తులు సంతృప్తి కరమైన అనుభూతిని పొందేలా సమన్వయంతో చక్కటి ఏర్పాటు చేసి బ్రహ్మోత్సవాల జాతరను విజయవంతం చేయాలని జగిత్యాల జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం ధర్మపురి క్షేత్రంలో మార్చి 10 నుండి 13 రోజుల పాటు శ్రీ లక్ష్మి నృసింహ స్వామి, శ్రీ వెంకటేశ్వర స్వామి వారిల వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరగనున్నాయి. ఈ సందర్భంగా స్థానిక టిటిడి కళ్యాణ మండపంలో గురువారం జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ అధ్యక్షతన దేవస్థానం అధికారులతో కలిసి జిల్లాలోని వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జాతర నిర్వహణలో ఒక్కో శాఖ పక్షాన చేపట్టాల్సిన ఏర్పాట్లను కలెక్టర్ అధికారులకు వివరించారు. ప్రధాన వేడుకల్లో భక్తుల తాకిడి అధికంగా ఉంటుందని భక్తుల సంఖ్యకు అనుగుణంగా పటిష్ట పోలీస్ బందోబస్తు పారిశుధ్య నిర్వహణ త్రాగునీటి సౌకర్యం రద్దీకి తగ్గట్లు ఆర్టీసి బస్సుల ఏర్పాట్లు ఉండాలని పేర్కొన్నారు. జాతరకు మరో 25 రోజులు గడువు ఉన్నందున అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు పూర్తి చేయాలనిఆదేశించారు. జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ మాట్లాడుతూ పోలీస్ శాఖ పక్షాన పటిష్ట బందోబస్తు ఏర్పాట్ల పగడ్బంధీగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని తెలిపారు. వ్యాపారులు స్థానికులు భక్తుల భాగస్వామంతో 13 రోజుల పాటు భక్తులకు ఉచిత అన్నదాన వితరణ ఏర్పాట్లు చేస్తున్నామని ఆలయ కార్యనిర్వహణాధికారి సంకటాల శ్రీనివాస్ చెప్పారు. ఈ కార్యక్రమంలో డిఎస్పీ రఘు చందర్, ఆర్డీవో మధుసూధన్, మున్సిపల్ కమిషనర్ కందుకూరి శ్రీనివాస్, తహశీల్దార్ కృష్ణ చైతన్య, ఎంపిడివో రవీందర్, వివిధ శాఖల జిల్లా అధికారులు హాజరయ్యారు.

## 'ఎమ్మెల్సీ' బరిలో ఉన్నోళ్లు..విద్యా వ్యాపారవేత్తలే!

### ఫార్వర్డ్ బ్లాక్ ఎమ్మెల్సీ అభ్యర్థి సర్దార్ రవీందర్‌సింగ్



**ప్రజాపక్షం/కరీంనగర్ప్రతినిధి:** కరీంనగర్గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేస్తూ విద్యావేత్తలుగా చెప్పుకుంటున్న వారంతా విద్యా వ్యాపారవేత్తలేనని ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి సర్దార్ రవీందర్‌సింగ్ అన్నారు. బిఆర్ఎస్ నుంచి టికెట్ ఆశించినప్పటికీ పార్టీ నుంచి అభ్యర్థిని నిలపకుండా తీసుకున్న నిర్ణయానికి కట్టుబడి ఉన్నానన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బ్యాలెట్ పేపర్‌లో ముందు వరుసలో పేరు, గుర్తు ఉండేందుకు ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ నుంచి నామినేషన్‌వేయడంజరిగిందన్నారు.కరీంనగర్‌లో ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. తానిప్పుడుఏఐఎఫ్‌బిలోనే కొనసాగుతున్నట్లేనన్నారు. కాంగ్రెస్ అధిష్టానానికి డబ్బులిచ్చే టికెట్లు తెచ్చుకున్నది నిజం కాదా? ప్రమాణం చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీలో ఉన్న మంత్రులు బంధుప్రీతి అంటూ చెప్పుకుంటూ కులాలకు ప్రాధాన్యత ఇస్తున్నారే తప్ప పార్టీకి కాదన్నారు. పట్టభద్రుల బరిలో ఉన్న నరేందర్‌రెడ్డి, ప్రసన్న హరికృష్ణతో పాటు ఎవరికి ఓటు వేసినా కాంగ్రెస్ ఖాతాలోకే చేరుతుందన్నారు. బిఆర్ఎస్ టికెట్ కోసం హరికృష్ణను ఉసిగొల్పింది కాంగ్రెస్ నేతలేనని, అయితే కెసిఆర్‌తిరస్కరించారన్నారు. వీరంతా ప్రజా ఉద్యమాల్లో పాల్గొన్న చరిత్ర ఉందా?అని ప్రశ్నించారు. 75వేల ప్రైవేట్ టీచర్లకు అసోసియేషన్ లేకు ండా కొంత మంది కోసమే ట్రస్మా నెలకొల్పారన్నా రు. తాను మున్సిపల్ కార్మికులకు పిఎఫ్‌తో ఉద్యో గ భద్రత కల్పించానని, రూపాయికే నల్లా కనెక్షన్, దహనసంస్కారాలతో దేశ చరిత్రలో రూపాయి విలువను చూపించానన్నారు.సమస్యలు పరిష్కరించి12నెలలజీతానికిచట్టభద్రతతోపాటు రూ.5 లక్షల ఇన్సూరెన్స్ కల్పిస్తానన్నారు. బిఆర్ఎస్ నాయకులు పెండ్యాల మహేష్, కెంసారం తిరుపతి, ఏఐఎఫ్‌బి రాష్ట్ర నాయకుడు తేజ్‌దీప్‌రెడ్డి ఉన్నారు.

ఫోకస్

# వ్యవసాయం

# బహుళ ప్రయోజనాల మొక్కజొన్న

మొక్కజొన్నబహుళ ఉపయోగాలున్న పంట. ఆహార పంటగా, పశుగ్రాసంగా, కోళ్ల మేతగా, పశువుల దాణాగా, ఇథనాల్ తయారీలో, బేకరీ ఉత్పత్తుల తయారీలో దీనిని ఉపయోగిస్తారు. మార్కెట్‌లో మంచి ధర ఉన్నప్పుడు పచ్చి కండెలను కోసి అమ్ముతుంటారు. బేబీ కార్న్, స్వీట్ కార్న్, పాప్ కార్న్ గా కూడా మొక్కజొన్న సాగుచేస్తారు. మొక్కజొన్న సాగు చేసే రైతులు బేబీ కార్న్, స్వీట్ కార్న్, సాధారణ మొక్కజొన్నపచ్చి కండెలుగా కూడా అమ్ముకొని మంచి ఆదాయం పొందవచ్చు. గింజ కోసం సాగు చేసే మొక్కజొన్నలో కండెలు ఏర్పడే తొలి దశలో వర్షాభావ పరిస్థితులు ఏర్పడి నీటి తడులు ఇవ్వలేని పరిస్థితులుంటే పైరు 50 రోజుల దశలో బేబీకార్న్‌గా తీసుకోవచ్చు. అలాగే గింజలు పాలు పోసుకునే దశలో నీటిఎద్దడి పరిస్థితుల వల్ల నీటితడులు ఇవ్వలేని పరిస్థితులుంటే పచ్చి కండెలుగా కోసి మార్కెట్ చేసుకోవచ్చు.



### బేబీ కార్న్‌కు పెరుగుతున్న డిమాండ్

బేబీకార్న్ అనేది మొక్కజొన్న జాతికి చెందిన కూరగాయ పంట. హోటళ్లలో, విందు భోజనాల్లో బేబీ కార్న్ తో పలు రకాల వంటకాలు చేస్తున్నారు. లేత మొక్కజొన్నపొత్తులను కూరగాయగా వాడతారు. సన్న ముక్కలుగా చేసి సలాడ్ గా, కూరగా తింటారు. దీనికి పెద్ద పెద్ద హెూటళ్ళలో మంచి డిమండ్ ఉంది. సూపర్ మార్కెట్లలో కూడా కూరగాయగా అమ్ముతున్నారు. పట్టణ ప్రాంతాలకు దగ్గరగా ఉన్న రైతులు, మార్కెట్ సౌలభ్యం చూసుకొని పండించుకోవాలి. తగినంత నీటి వసతి ఉంటే ఏడాదిపొడవునా సాగుచేసుకోవచ్చు. బేబీకార్న్ పొత్తులు విత్తిన యాభై రోజుల నుంచి మొదటి కోత తీసుకోవచ్చు. 75 నుంచి 80 రోజుల్లో పంట పూర్తవుతుంది. పంట కాలం తక్కువ కావడం వల్ల రైతులు ఏడాదికి మూడు నుంచి నాలుగు పంటలు తీసుకోవచ్చు. మాధురి, సిఒబిసి 1 రకాలను బేబీ కార్న్ కోసం సాగుచేసుకోవచ్చు. సాగుచేసే రకం, నీటివసతిని బట్టి ఎకరాకు 1200 నుంచి 2600 కిలోల దాకా దిగుబడి పొందే అవకాశం ఉంటుంది. బేబీ కార్న్ మొక్కజొన్నలో సరైన కోత దశను గుర్తించి పంట కోతను చేపడితే రైతుకు మార్కెట్లో మంచి ధర లభిస్తుంది. తద్వారా అధిక నికరాదాయం పొందే వీలుంటుంది. బేబీ కార్న్‌గా పంట తీసుకునేందుకు గింజ కట్టక ముందే పీచు తొలి దశలోనే కోయాలి. పీచు 23 సెం.మీ. దశలో (పీచు వచ్చిన 13 రోజులకు) అంటే పైరు 4550 రోజులప్పుడు బేబీకార్న్‌గా కండెలను కోసుకోవాలి. ఆలస్యం చేస్తే ఒక్క రోజులోనే కండెల్లో గింజల అంకురార్పణ జరిగి బేబీకార్న్ గా ఉపయోగించేందుకు పనికిరాకుండా పోతాయి. వేడి తక్కువగా ఉండే ఉదయం లేదా సాయంత్రం వేళల్లో కోస్తే కండెల నాణ్యత బాగా ఉంటుంది. ఖరీఫ్ సీజన్‌లో వేసిన పంటలో బేబీ కార్న్ కోసం ప్రతి రోజు కోయాలి. రబీలో సాగుచేసే పంటలో అయితే రోజు విడిచి రోజు కోసుకోవచ్చు. ముందుగా మొక్కల్లో పైన ఉన్న బేబికార్న్ కండెలను కోసి, తర్వాత రోజు కిందవి కోయాలి. సాగుచేసిన రకాన్ని బట్టి ఏడెనిమిది కోతల వరకు తీసుకోవచ్చు. కోసిన కండెలపైన ఉన్న పీచు, పైపొర తీసివేసి శుభ్రం చేసి, కండెలు విరిగిపోకుండా మార్కెట్ చేసుకోవాలి. కండెలు 6 11 సెం.మీ. పొడవు, ఒకటి నుంచి ఒకటిన్నర సెం.మీ. మందంతో ఉన్న బేబీ కార్న్ కండెలకు మంచి ధర లభిస్తుంది. 9 10 సెం.మీ. పొడవున్న కండెలు ఎగుమతికి అనుకూలం. కోసిన కండెలను సైజుల వారిగా వేరుచేసి ప్యాకింగ్ చేసుకోవాలి. వీటిని 10 డిగ్రీల సెంటిగ్రేడ్ ఉష్ణోగ్రత వద్ద 34 రోజుల వరకు నిల్వ చేసుకోవచ్చు.





## పర్యావరణం

జంతువుల నుంచి నేర్చుకోవాల్సిన విషయాలు చాలానే ఉన్నాయి. తోడేళ్ల ప్రవర్తనను ఉదాహరణగా పేర్కో-వచ్చు. రెండు తోడేళ్లు తలపడినప్పుడు భీకర-పోరాటం జరుగుతుంది. ఏదో ఒకటి చనిపోతుందే-మోనన్న స్థాయిలో దాడులు ఉంటాయి. అయితే, ఓటమి అంచులో ఉన్న తోడేలు ఈ యుద్ధాన్ని నిలిపివేయాలన్న సందేశం ఇస్తున్న రీతిలో, దాడి చేస్తున్న ప్రత్యర్థి ముందు మోక-రిల్లుతుంది. సాధారణంగా ఇలాంటి పరిస్థితుల్లో మనిషి ఉంటే, ఓడి-పోతున్న వ్యక్తిని మరింత తీవ్రంగా గాయపరుస్తాడు. కొన్ని సందర్భాల్లో ప్రాణాలు కూడా తీస్తాడు. కానీ, విజయం సాధించే స్థితిలో ఉన్న తోడేలు అందుకు భిన్నంగా వ్యవహరిస్తుంది. హఠాత్తుగా దాడిని విరమించుకుంటుంది. అప్పటి వరకూ ఉగ్రవరూపంలో ఉన్న ఆ తోడేలు క్షణాల వ్యవధిలోనే తన నిర్ణ-యాన్ని మార్చుకొని, ప్రత్యర్థికి క్షమాభిక్ష పెడుతుంది. ఇది ఒకరు నేర్పిస్తే వచ్చిన గుణం కాదు. అవి ఏ పుస్తకాల్లోనూ నేర్చుకోలేదు. తమ జాతిని రక్షించుకోవడానికి, జీవ వైవిధ్యాన్ని కాపాడుకోవడానికి వాటికి తెలిసిన మార్గం ఇది. భూమిని అగ్నిగోళంగా మారుస్తూ, తన వినాశనాన్ని తానే కొనితెచ్చుకుంటున్న మనిషికి జంతువులు చెప్తున్న పాఠాలు ఎప్పటికి అర్థమవుతాయో ఏమో!



# ఖరీఫ్‌లో రికార్డు ఉత్పత్తి!

ఈ ఏడాది జూన్ మాసంతో ముగిసే 2024–25 వ్యవసాయ సంవత్సరంలో ఖరీఫ్ (వేసవి) ఆహారధాన్యాల ఉత్పత్తి రికార్డు స్థాయిలో 164.7 మిలియన్ టన్నులుగా అంచనా. 2024 డిసెంబర్ రెండో వారాంతానికి 29.31 మిలియన్ హెక్టార్లలో విత్తిన గోధుమలతో శీతాకాలపు పంటల సాగు స్థిరమైన పురోగతిని కొనసాగించింది. కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ ప్రకటనను అనుసరించి, ఈసారి ఖరీఫ్‌లో పప్పు ధాన్యాలు, నూనె గింజల ఉత్పత్తిలో గంనీయమైన సవాళ్లు తప్పకపోవచ్చు. సాధారణ వర్షపాతం నమోదైన కారణంగా పంటలు బాగా పండాయి. ఫిబ్రవరి–మార్చి మాసాల్లో శీతాకాలపు గోధుమ పంటను ప్రభావితం చేసే సంభావ్య ఉష్ణ తరంగాలు తప్పవని వాతావరణ శాఖ హెచ్చరించినప్పటికీ, మొత్తం మీద ప్రస్తుత వ్యవసాయ సంవత్సరంలో ఉత్పత్తి ఆశాజనకంగానే ఉంది. 2024 నవంబర్‌లో భారత ఎగుమతులు పెరిగాయి. కేవలం ఆస్ట్రేలియాకే ఎగుమతులు 64.4 శాతం పెరగడం విశేషం. వ్యవసాయ రంగం 2024–25లో 3.54 శాతం వృద్ధి అంచనాలతో బలంగా పుంజుకోగలదని అంటున్నారు. ఇది గత ఆర్థిక సంవత్సర వృద్ధి కంటే 1.4 శాతం ఎక్కువ.



# కాలుష్యరహిత భూగోళం సాధ్యమే!

ఇప్పుడు సాంకేతికత కొత్తపుంతలు తొక్కుతున్నది. అద్భుతాలు సృష్టించడానికి సిద్ధమవుతున్నది. పర్యావరణంపై కొనసాగుతున్న వినూత్న ప్రయోగాలు సఫలమైతే, కాలుష్యరహిత భూగోళం సాధ్యమేనని శాస్త్రవేత్తలు అంటున్నారు. ఈ ప్రయోగాల్లో అత్యం కీలకమైనది కర్బన ఉద్గారాలను ఏక మొత్తంగా వాతావరణం నుంచి తొలగించడం. సాధ్యాసాధ్యాల గురించిన చర్చ ప్రస్తుతానికి అప్రస్తుతం. ప్రయోగాల ప్రాధాన్యమే నేటి అవసరం. గాలి లేదా ఆకాశం నుంచి కర్బనాన్ని సేకరించడం అనేది కొందరికి బంగారుగని.. మరికొందరికి మూర్ఖపు పని. ఆశావాదులు ఇది కష్టమేగానీ, అసాధ్యం మాత్రం కాదని స్పష్టం చేస్తున్నారు. ప్రాణాంతక కాలుష్యాన్ని వాతావరణం నుంచి తొలగించి, దాని స్థానంలో శుభ్రమైన, స్థిరమైన వాయువును భర్తీ చేయడానికి జరుగుతున్న ప్రయత్నం ఓ అద్భుతం. ఇప్పటికే మితిమీరిన కర్బన ఉద్గారాల కారణంగా భూమి క్రమంగా నివాసయోగ్యం కాకుండా పోతున్నది. పరిస్థితి ఇదే విధంగా ఉంటే, భవిష్యత్ తరాలకు ఉష్ణ కాసారాలు, కష్ట జీవావరణాలు మాత్రమే మిగులుతాయి. ఆకాశంలో ఆవరిస్తున్న కర్బన వాయువును భూమిపైకి తీసుకొచ్చి, దానిని పూర్తిగా తొలగించడం లేదా ఇతరత్రా మార్గాల్లో వినియోగించడమే ప్రస్తుతం జరుగుతున్న ప్రయోగాల ప్రధాన లక్ష్యం. యాంత్రిక లేదా రసాయన ఫిల్టర్ ద్వారా గాలిని లాగడం అనే ప్రక్రియ ద్వారా వాతావరణ నుంచి కర్బనాన్ని తొలగింగించే పద్ధతిని మిషన్ జీరో ప్రాజెక్టు చేపట్టింది. సోర్బెంట్‌గా పిలిచే ఘనపదార్థంతో లేదా ద్రావకంతో గాలి వడపోత జరుగుతుంది. గాలిని సంగ్రహించిన తర్వాత, అందులో నుంచి కార్బన్‌ను తొలగించడానికి ఫిల్టల్ మెటీరియల్‌కు వేడి లేదా విద్యుత్‌ను ప్రయోగిస్తారు. ఫిల్టన్‌ను తిరిగి ఉపయోగించుకోవడానికి, కర్బనాన్ని విడదీయడానికి ఈ రెండూ ఉపయోగపడతాయి. ఈ ప్రక్రియకు అత్యంత అధిక మొత్తంలో శక్తి అవసరమవుతుంది కాబట్టి, ప్రస్తుతానికి చాలా ఖరీదైన ప్రక్రియ. అయితే, ప్రస్తుతం ప్రయోగాలు ఆరంభదశలోనే ఉన్నాయని, అవి సత్ఫలితాలనిస్తే, గాలి నుంచి కర్బనాన్ని వేరుచేయడం అసాధ్యమేమీ కాదని శాస్త్రవేత్తలు ధీమా వ్యక్తం చేస్తున్నారు. వారి కృషి ఫలించాలని కోరుకుందాం.







## విద్యుత్ ఆర్టిజన్స్‌ను పర్మినెంట్ చేయాలి

ఆర్టిజన్స్ నూతన క్యాలెండర్ ఆవిష్కరణ

**ప్రజాపక్షం/పాల్వంచ :** తెలంగాణలో విద్యుత్ రంగంలో పనిచేస్తున్న 20వేల మంది ఆర్టిజన్ కార్మికులను వెట్టిచాకిరి నుండి విముక్తి చేసి రెగ్యులర్ ఉద్యోగులుగా పర్మినెంట్ చేసి వారి కుటుంబాల్లో వెలుగులు నింపాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివవావు ప్రభుత్వాన్ని కోరారు. గురువారం పాల్వంచలో తెలంగాణ రాష్ట్ర విద్యుత్ ఆర్టిజన్స్ నూతన క్యాలెండర్‌ను ఎమ్మెల్యే కూనంనేని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ.. 20వేల మంది తెలంగాణ మొత్తం 4కోట్ల మందికి విద్యుత్ వెలుగులు అందిస్తూ ఆర్టిజన్స్ కుటుంబాలు కొవ్వొత్తిలా కరిగి పొతున్నాయని, చాలి చాలని వేతనంతో జీవిస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్టిజన్స్‌కి ఇచ్చిన హామీ మేరకు రెగ్యులర్ ఉద్యోగులుగా కన్వర్షన్ చేసి హామీని నిలబెట్టుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్కె సాబీర్ పాషా, ఆర్టిజన్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు నరాటి ప్రసాద్, ఎఐటియుసి రాష్ట్ర సీనియర్ నాయకులు బి.అయోధ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బానోత్ శంకర్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అల్లం ఓదెలు, కోలా శ్యాం, ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు కంచెర్ల జమలయ్య, దేవరకొండ శంకర్, కె.సాయర్య, బండి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



# కేంద్ర బడ్జెట్‌ను సవరించాలి

సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్య పద్మ



**ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి :** కేంద్ర బడ్జెట్‌ను సవరించాలని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్య పద్మ అన్నారు. గురువారం నగరంలోని స్థానిక అంబేద్కర్ కాలనీలోని హమాలీ యూనియన్ ఎఐటియుసి కార్యాలయంలో సిపిఐ జిల్లా కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథులు హాజరైన సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్య పద్మ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2025–26 బడ్జెట్ కేవలం సంపన్నవర్గానికి ప్రయోజనకరంగా ఉందన్నారు. రైతులకు, కార్మికులకు, నిరుపేద ప్రజలకు వ్యతిరేకంగా ఉందన్నారు. రైతులు సుధీర్ఘకాలంగా చేస్తున్న డిమాండ్లు పంటలకు మద్దతు ధరల గ్యారెంటీ చట్టం చేసి అమలుకు నిధులు కేటాయించకపోవడం రుణమాఫీ చట్టం చేసి ఎలాంటి ప్రస్తావన ఈ బడ్జెట్‌లో చేయకపోవటం దుర్మార్గమన్నారు. ఆదాయ పన్ను రూ.12 లక్షల వరకు మినహాయింపు ఇవ్వటం కేవలం 80 నుంచి 85 లక్షల మందికి లబ్ధి చేకూరుతుందని కానీ రెండు కోట్ల 50 లక్షల మంది ధనికులకు, కార్పొరేట్ కంపెనీల యజమానులకు ఉపయోగపడేలా ఉందన్నారు. రెండు కోట్ల 27 లక్షల 315 మంది కోటి రూపాయల ఆదాయం ఉన్నవారు 265 మంది 100 కోట్లు ఆదాయం ఉన్నవారు 25 మంది 500 కోట్ల ఆదాయం వచ్చే వారికి లాభం చేకూర్చేలా ఈ బడ్జెట్ ఉందన్నారు. నిరుద్యోగ సమస్య పరిష్కరించి అధిక ధరల తగ్గింపుకు గ్రామీణ ఉపాధిహామీ పథకం పూర్తిస్థాయిలో అమలు చేయటానికి బిసి, ఎస్‌సి, ఎస్‌టి ప్రజల అభివృద్ధి తగ్గట్లుగా ఈ బడ్జెట్‌లో కేటాయింపులు లేవన్నారు. గ్రామీణ ఉపాధిహామీ పథకానికి నిధులను తగ్గించారు నిరుపేదల వ్యవసాయ కార్మికుల ఉపాధిని దెబ్బ తీసేలా బడ్జెట్ కేటాయింపులు చేశారు. అత్యంత సంపన్నవర్గంపై నాలుగు శాతం సంపద పన్ను చేయాలన్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి సుధాకర్, నాయకులు భూమయ్య, దశరథ్, ఓమయ్య, రాజేశ్వర్, రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## కనీస వేతన చట్టం లేక కార్మికుల ఇబ్బందులు

భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు

**ప్రజాపక్షం/వేములవాడ టౌన్:** వేములవాడ పట్టణంలో భవన నిర్మాణ కార్మి క సంగం జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు గురువారం మాట్లాడుతూ, లేబర్ కార్డులు ఉన్న వారికి హెల్త్ చెకప్ పేరుతో భవన నిర్మాణ కార్మిక సంక్షే మ బోర్డులో ఉన్న ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని, చేసిన పరీక్ష రిపోర్టులు, వేరే హాస్పిటల్లోకి తీసుకుపోతే పక్కన పారేస్తున్నారని, మళ్ళీ టెస్టులు చేస్తున్నారని అన్నారు. 1996లో కొట్లాడి తెచ్చుకున్న లేబర్ కార్డుల చట్టం, గత బిఆర్ఎస్, ప్రస్తుత బిజెపి ప్రభుత్వాల వల్ల 44 చట్టాలు రద్దయి, 4 కోడ్‌లుగా విభజించబడయని, కనీస వేతన చట్టం లేక, నిత్యావసరాల మీద జిఎస్‌టి వేయడం, గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు పెంచడంతో ధరలు పెరిగి కార్మికులు తమ కొనుగోలు శక్తిని కోల్పోతున్నారన్నారు. లేబర్ కార్డుల విధానంలో ఆన్‌లైన్ విధానం తీసుకు రావడం మూలంగా, ఫింగర్ ప్రింట్ రాక, ఆన్‌లైన్ రావడం లేదని, వెంటనే ఆన్‌లైన్ రద్దు చేసి, పెండింగ్ ఫైల్స్ క్లియర్ చేయాలని, కార్మికులకు అందించే బెనిఫిట్స్ అందించాలని, సహజ మరణంపై 5లక్షలు,ఆక్సిడెంట్ కు 10 లక్షలు, డెలివరీ 50 వేలు, మ్యారేజ్ 1 లక్ష రూపాయలు. 55 ఏండ్లు నిండిన కార్మికులకు 5 వేల పెన్షన్ ఇవ్వాలని, మెడికల్ టెస్టుల పేరుతో జరుగుతున్న దోపిడీని కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంగం జిల్లా అధ్యక్షులు గాజుల పోశెట్టి, కోరేపు శ్రీను, మల్లేశం, రాజయ్య తదితర కార్మిక సంగం నాయకులు పాల్గొన్నారు.

## ఏడు నెలల పెండింగ్ వేతనాలు చెల్లించకపోతే 19న వైద్య విధాన కమిషనర్ కార్యాలయం ముట్టడి

ఎఐటియుసి మెడికల్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి పి.సురేష్

బిక్షమెత్తుతూ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో పారిశుద్ధ్య కార్మికుల వినూత్న నిరసన



**ప్రజాపక్షం/జడ్చర్ల :** తెలంగాణ వైద్య విధాన పరిషత్ పరిధిలోని ప్రభుత్వ జిల్లా ఏరియా సామాజిక ఆరోగ్య కేంద్రాలలో పనిచేస్తున్న పారిశుద్ధ్య సెక్యూరిటీ పేషెంట్ కేర్ సూపర్‌వైజర్ కార్మికులకు గత సంవత్సరం జూలై నుండి వేతనాల బడ్జెట్ విడుదల కాలేదని మండిపడుతూ తెలంగాణ మెడికల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి నేతృత్వంలో గురువారం జడ్చర్ల ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి పారిశుద్ధ్య సెక్యూరిటీ కార్మికులు పట్టణంలోని కల్వకుర్తి రహదారిపై ప్రజలతో వ్యాపారస్తులతో వాహనదారులతో వినూత్నంగా బిక్షాటన చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఎఐటియుసి మెడికల్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి పి.సురేష్ మాట్లాడుతూ తెలంగాణ వైద్య విధాన పరిషత్ ప్రభుత్వ ఆసుపత్రులలో వరాక్కర వేతనాలతో వెట్టి చాకిరికి గురవుతున్న పారిశుద్ధ్య కార్మికులకు పోయిన సంవత్సరం జులై నుండి నేటి వరకు వేతనాలు బడ్జెట్ విడుదల చేయకపోతే కార్మికులు జీవనం గడిచేది ఎలా అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. సంబంధిత ఏజేన్సీ నిర్వాహకులను నిలదీస్తే ప్రభుత్వం నుండి బడ్జెట్ రావడం లేదని అయినా అధికారులు సూచన మేరకు మూడు నెలల వేతనాలు అడ్వాన్సుగా చెల్లించామని మిగిలిన ఆరు నెలలు జీతాలు బడ్జెట్ వస్తేనే తప్ప చెల్లించలేమని చేతులెత్తేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులకు నెలల తరబడి వేతనాలు చెల్లించని ఫలితంగా కార్మికులు తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పిల్లల ఫీజులు ఇంటి అద్దెలు నెల వారి ఇఎంఐలు పొదుపు సంఘాల డబ్బులు చెల్లింపులు చేయలేని దుస్థితి నెలకొన్నదని కార్మికుల జీతం అప్పుల వడ్డీకి కూడా సరిపోదని వాపోయారు. బకాయి వేతనాల కోసం గత నెలలో రాష్ట్ర వైద్య విధాన కమిషనర్ డా.అజయ్ కుమార్ కి ఆందోళన నోటీసులు అందజేసిన చలనం లేని కారణంగా దాదాపు పది రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా కార్మికులు అనేక రూపాలలో ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు.

ఈ నెల 19న రాష్ట్ర వ్యాప్తంగా వేలాది మందితో హైదరాబాద్ కోఠిలోని తెలంగాణ వైద్య విధాన పరిషత్ కమిషనర్ కార్యాలయం ము ట్టడి జరుపుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎఐటయుసి జిల్లా నాయకులు భాగి కృష్ణయాదవ్ , ఆసుపత్రి బ్రాంచ్ యూనియన్ అధ్యక్షు లు నరసింహ, ప్రధాన కార్యదర్శి విజయలక్ష్మి , నేత లు కార్మికులు నవీన్, పేర్మల్, రాజేష్, యాదమ్మ, శ్రీలత, భార్గవి, చెన్నమ్మ, నీరజా, నర్సమ్మ, అలివేల, మంగమ్మ, సుక్కమ్మ, తదితరులు ఉన్నారు.

## 'సదరం' సర్టిఫికెట్ల అవకతవకలపై చర్యలు తీసుకోవాలి

ఎఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి యుగేందర్ డిమాండ్



**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి :** సదరం సర్టిఫికెట్ల అవకతవకలపై సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఎఐవైఎఫ్) జిల్లా ప్రధాన కార్యదర్శి బ్రాహ్మణపల్లి యుగేందర్ డిమాండ్ చేశారు. తాము చేసే పనులకు లెక్క లేదు అన్న చందంగా జిల్లా రూరల్ డెవలప్‌మెంట్ అథారిటీ(డిఆర్‌డిఎ) అధికారులు సంబంధిత సూపరిండెంట్ వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. సదరం సర్టిఫికెట్‌లలో లక్షల రూపాయల కుంభకోణంపై సిబిసిఐడి విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. అధికారులందరూ లక్షల రూపాయలను పప్పు బెల్లంలా పంచుకున్నారని ఆరోపించారు. పాత్రదారులు, సూత్రదారులందరూ ఆ శాఖలోనే ఉన్నారని ఆరోపించారు. ఒక డిపార్ట్‌మెంట్ వారు తప్పు చేస్తే ఇతర డిపార్ట్‌మెంట్ అధికారితో పూర్తిస్థాయిలో పారదర్శకంగా విచారణ జరిపిస్తారని, కానీ దాని కి విరుద్ధంగా ఈ విచారణ జరిగిందన్నారు. నిబంధనల ప్రకారం సదరం క్యాంపు 200 మందికి మాత్రమే స్లాట్ బుకింగ్ విధానం ఉంటుందని, కానీ దానికి భిన్నంగా హుజురాబాద్‌లో సదరం క్యాంపు ఆకస్మికంగా నిర్వహించడంలో ఆంతర్యమేమిట ని ప్రశ్నించారు. అడిషనల్ డిఆర్‌డిఒ వెంకటేశ్వర్లు నేతృత్వంలో జరిగిన విచారణ కమిటీ గతేడాది జనవరి 2021 నుంచి 2022 ఫిబ్రవరి వరకు విచారణ జరిపి కలెక్టరేట్‌కు నివేదిక సమర్పించిందని, కానీ హుజురాబాద్‌లో జరిగిన సదరం సర్టిఫికెట్ల పై విచారణ ఎందుకు జరగలేదని ప్రశ్నించారు. జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో ఇద్దరు కంప్యూటర్ ఆపరేటర్లు లక్షల రూపాయలు వసూలు చేశారని, వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి వారి వెనుక ఉన్న పాత్రదారులు, సూత్రదారులను బయటకు లాగాలన్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు వారిపై చర్యలు తీసుకోవాలన్నారు.

## సిపిఐ (ఎంఎల్) మాస్‌లైన్ కేంద్ర కమిటీ సభ్యుడు ధృవ నారాయణ మృతి



**ప్రజాపక్షం /హైదరాబాద్ :** సిపిఐ (ఎం.ఎల్) మాస్ లైన్ కేంద్ర కమిటీ సభ్యు లు ధృవ నారాయణ మరణం పట్ల సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. బుధవారంరాత్రి ఢిల్లీలో ఆయన గుండె పోటుతో ఆకస్మికంగా మరణించారని తెలిపారు. విప్లవోద్యమం సీనియర్ నాయకుడు ధృవ నారాయణ ఎన్నో పోరాటాల అనుభవం కలిగిన గొప్ప నేత అని కొనియాడారు. 2024 మార్చిలో ఖమ్మంలో జరిగిన మూడు పార్టీల ఐక్యతా సభలో కేంద్ర కమిటీ సభ్యులుగా ఎన్నికకావడంతోపా టు ఇటీవలే నెల రోజుల క్రితం మాస్ లైన్ పార్టీ తరుపున నేపాల్లో జరిగిన ఎంఎల్ పార్టీల అంతర్జాతీయ సభల్లో పాల్గొన్నారన్నారు. ధృవ నారాయణ అకాల మరణం పట్ల విచారం వ్యక్తం చేయడంతో పాటు ఆయన విప్లవ ఆశయాల సాధనకు సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ కృషి చేస్తుందని పోటు రంగారావు తెలిపారు.

## ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటాలు

మహమ్మద్ మౌలానా, దండి సురేష్



**ప్రజాపక్షం/కూసుమంచి :** ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై రాజీలేని పోరాటాలు నిర్వహిస్తామని సిపిఐ తెలంగాణ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మొహమ్మద్ మౌలాన, జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ అన్నారు. మండలంలోని గైగోళ్ళపల్లిలో సిపిఐ గ్రామ శాఖ మహాసభ బుధవారం రాత్రి పార్టీ జిల్లా సమితి సభ్యులు గుండె పంగు మల్లేష్ అధ్యక్షతన జరిగింది. సమావేశంలో మొహమ్మద్ మౌలాన, దండి సురేష్ మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో పోటీ చేసేందుకు పార్టీ శ్రేణులు సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర గిరిజన సమైక్య రాష్ట్ర అధ్యక్షులు రామ్మూర్తి నాయక్ మాట్లాడుతూ బంజారాల ఆరాధ్య దైవం శ్రీ సంత్ సేవాలాల్ జయంతిని సెలవు దినంగా ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం పార్టీ గ్రామ శాఖ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి భూక్య నరసింహ, సహాయకారదర్శి జిల్లా లింగయ్య, నాయకులు కత్రోజు పాండు రంగాచారి, సంగబత్తుల ఉపేందర్ రెడ్డి, సత్యం, అల్లి వెంకటేష్, జిల్లా నాగరాజు, శ్రీకాంత్, ప్రశాంత్, రామ్ కోటి, జగన్, జిల్లా నాగరాజు, జిల్లా సైదులు, నరేష్ రెడ్డి, తేలు వెంకన్న, తురక వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

## వేతనాల కోసం మోకాళ్లపై నిరసన




**ప్రజాపక్షం/కల్లూరు :** కల్లూరులోని తెలంగాణ వైద్య విధాన పరిషత్ ఆసుపత్రి ముందు వేతనాల కోసం మోకాళ్లపై నిరసన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు దండు ఆదినారాయణ మాట్లాడుతూ గత నాలుగు నెలలుగా వేతనాలు లేక ఇబ్బందులు పడుతున్న ప్రభుత్వం మరియు కాంట్రాక్టర్ కు చలనం లేదని జనవరి నెలలో సమ్మె నోటీస్ ఇచ్చిన కూడా రెండవ నెలలు స్పందన లేకపోవడంతో కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. గత వారం రోజులుగా పలు విధాలుగా రోజువారి కార్యక్రమంలో భాగంగా వేతనాల కోసం నిరసన చేస్తూ ఆందోళన కార్యక్రమం చేస్తున్నా స్పందన లేకపోవడంతో ఆసుపత్రిలో పనిచేస్తున్న శానిటేషన్, పేషంట్ కేర్, సెక్యూరిటీ గార్డులు ఇబ్బందులు పడుతున్నారని గత ఏడు నెలల క్రితం సమ్మె నోటీస్ ఇస్తే వేతనాలు వేశారని మళ్ళీ సమ్మె నోటీస్ జనవరి నెలలో ఇచ్చామని నాలుగు నెలలుగా కార్మికుల జీతాలు ఇవ్వడంలో కాంట్రాక్టర్ మరియు ప్రభుత్వ అధికారులు, నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారన్నారు. గత వారం రోజులుగా ప్రతిరోజు ఒక గంట నిరసన కార్యక్రమాన్ని నిర్వహిస్తూ ఆసుపత్రి అధికారికి వినతి పత్రం సమర్పిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా ఉపాధ్యక్షులు వేము రాంబాబు, సత్తుపల్లి డివిజన్ మహిళా సమైక్య కన్వీనర్ షేక్ రంజాన్ బి, ఎఐటియుసి మండల నాయకులు దామాల దయాకర్‌రావు, ఆసుపత్రి కార్మికులు వంశీ, ప్రమోద్, నాగమణి, కోటేశ్వరి, సరోజినీ, జాన్ బి తదితరులు పాల్గొన్నారు.

## కస్తూర్బా పాఠశాలకు వీధిలైట్ల ఏర్పాటు

ఎఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి వంశీ డిమాండ్



**ప్రజాపక్షం/జూలూరుపాడు :** కస్తూర్బా పాఠశాలకు వెళ్ళేందుకు రాత్రి అయితే చాలు అటువైపు వెళ్ళాలంటే సిబ్బంది మరియు విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నారని, తక్షణమే వీధిలైట్లు ఏర్పాటు చేయాలని ఎఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి గుగులోతు వంశీ డిమాండ్ చేవారు. గురువారం ఎఐఎస్ఎఫ్ మండలంలో ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా సహాయ కార్యదర్శి వంశీ పాల్గొని మాట్లాడుతూ జూలూరుపాడు మండల కేంద్రంలో ఉన్న కస్తూరి బాలికల విద్యాలయానికి సాయంత్రం అయితే చాలు వెళ్లడానికి భయాందోళన గురవుతున్నారన్నారు. కస్తూర్బా బాలికల విద్యాలయం మండల కేంద్రం నుంచి దాదాపు ఒక కిలోమీటర్ దూరంలో రాత్రి సమయంలో వీధిలైట్లు ఉండకపోవడం వల్ల సిబ్బంది గానీ ఏమైనా మెడికల్ ఎమర్జెన్సీకి ఎవరైనా వెళ్లాలంటే భయాందోళనకు గురవుతున్నారన్నారు. ఇప్పటికైనా ఉన్నత అధికారులు, రాష్ట్ర యంత్రాంగం స్పందించి కస్తూర్బా పాఠశాలలో సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు బాలాజీ, శివ అనిల్, విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఛాంపియన్లుగా నిలవాలి

సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్‌పాషా



**ప్రజాపక్షం/పాల్వంచ :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న జిల్లా యూత్ అథ్లెటిక్స్ సెలక్షన్ ట్రయల్స్‌ను గురువారం సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా పారంభించారు. పట్టణ పరిధి శ్రీనివాసకాలనీలోని స్టేడియంలో జరుగుతున్న జిల్లా యూత్ అథ్లెటిక్స్ సెలక్షన్ ట్రయల్స్‌కు సాబీర్‌పాషా ముఖ్యఅతిధిగా హాజరైయ్యారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ గత సంవత్సరం భద్రాద్రి జిల్లా అథ్లెటిక్స్ రాష్ట్ర స్థాయిలో ఛాంపియన్లుగా నిలవడం అభినందనీయమన్నారు. అదే స్పూర్తితో ఈ సంవత్సరం కూడా రాష్ట్ర స్థాయిలో ఛాంపియన్లుగా నిలవాలని కోరారు. జిల్లా క్రీడాకారులకు గ్రౌండ్స్, క్రీడా పరికరాలు, పుస్తకాలు అందించడానికి తనవంతు కృషి ఎప్పుడు ఉంటుందని హామీ ఇచ్చారు. జిల్లా, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలలో పతకాలు సాధించడం ద్వారా జిల్లాకు పేరు, గుర్తింపొస్తుందన్నారు. అనంతరం జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ యుగేందర్ మాట్లాడుతూ జిల్లాలో రాష్ట్ర, జిల్లా పోటీల నిర్వహణకు సాబీర్‌పాషా సహకారం మరువలేనిదని అన్నారు. జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ కె.మహీధర్ మాట్లాడుతూ..ఈ పోటీలకు జిల్లా నలుమూలల నుండి సుమారు 120 మంది హాజరయ్యారని అన్నారు. వారి నుండి 30 మంది అథ్లెట్లను ఎంపిక చేసి ఈ నెల 18న హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీ గ్రౌండ్‌లో జరగబోవు రాష్ట్ర యూత్ అథ్లెటిక్స్ ఛాంపియన్స్‌కు పంపుతామని తెలిపారు. ఈ ఎంపికలు జిల్లా అథ్లెటిక్ కోచ్‌లు పి.నాగేందర్, జన్ను గిరిప్రసాద్, కృష్ణ, ఉదయ, ఎర్రయ్య, పిడి శ్వేతలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు కొండలరావు, అడ్వకేట్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# రైతుల జీవితాలను కమ్మేస్తున్న పొగ

### శాపంగా మారిన కర్మాగారాలు

### నల్లబారిన పంటలు, పచ్చదనం కరువు

### కనుమరుగైన నెమళ్లు, వలస జీవాలు

రెండు కర్మాగారాలు రైతుల జీవితాలను ఛిద్రం చేస్తున్నాయి. ఆ ఫ్యాక్టరీల పొగలు రైతుల జీవితాలను కమ్మేస్తూ భవితను అంధకారం చేస్తున్నాయి. కర్మాగారం నుంచి వచ్చే పొగ చుట్టూ మూడు కిలోమీటర్ల మేర పచ్చదనాన్ని హరించివేసింది. పంటలు పొగబారి ఎదుగు బొదుగు లేకుండా పోయాయి. ఇక్కడ పొలంలో పనిచేస్తే సాయంత్రానికి శరీరమంతా మంటలు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు ఏర్పడి పనిచేసేందుకు కూలీలు రావడం లేదు. ఫ్యాక్టరీల నుంచి వచ్చే వ్యర్థాలు నీటిలో కలవడంతో ఈ నీటిని తాగిన జీవాలు, పశువులు గర్భస్రావానికి గురవుతున్నాయి. జీవాలు పెంచుకునే వారు ఈ గ్రామం నుంచే వలస వెళ్లిపోయారు. ఇంతటి దయనీయ స్థితిని ఎదుర్కొంటున్నా ఏ ఒక్కరూ స్పందించడం లేదు. ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం అప్పలనర్సింహాపురం రైతుల దయనీయ దీనగాథ ఇది.

**ప్రజాపక్షం/ఖమ్మం :** ఆంధ్రా సరిహద్దుల్లో భద్రాద్రి స్పాంజ్ ఐరన్ పేరిట 20 ఏళ్ల క్రితం ఓ కర్మాగారాన్ని నిర్మించారు. అప్పట్లో ఈ ప్రాంతంలో దొరికే ఐరన్‌వోర్‌తో స్పాంజ్ ఐరన్ తయారు చేసేవారు. ఈ ప్రాంత రైతులు ఆందోళన చేస్తే పంట పండిన పండకపోయినా కౌలు ఇస్తామంటూ హామీ ఇచ్చి కొంతకాలం చెల్లించారు. ఏదో కారణాలతో ఫ్యాక్టరీ మూతపడింది. రెండేళ్ల క్రితం కర్మాగారాన్ని మరింత విస్తరించి పునఃప్రారంభించారు. బళ్లారి ప్రాంతం నుంచి ముడి సరుకు తెచ్చి కర్మాగారాన్ని నడుపుతున్నారు. ఈ కర్మాగారం నుంచి వెలువడే పొగ చుట్టూ మూడు కిలో మీటర్ల దూరం వ్యాపించి పంటలను నాశనం చేస్తుంది. పత్తి, మిర్చి, మొక్కజొన్న పంటలను ఈ ప్రాంతంలో సాగు చేస్తుండగా ఆ పంటలు పచ్చదనాన్ని కోల్పోయి మసిబారి కనిపిస్తున్నాయి. ఎదుగు బొదుగు లేకుండా దిగుబడి రాక రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### కూలీలు రావడం లేదు

పొగబారిన వ్యవసాయ భూముల్లో మిర్చి కోసేందుకు పత్తి తీసేందుకు లేదా ఇతర వ్యవసాయ పనులకు కూలీలు రావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పొగబారిన మొక్కలను తాకితే చేతులు దురదలు వస్తున్నాయని, శరీరమంతా మంటలు, రాత్రిపూట శ్వాస తీసుకునేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని కూలీలు రావడం లేదు. అప్పల నర్సింహాపురం ప్రాంతంతో పాటు చుట్టుపక్కల గ్రామాల వారు కూడా ఈ వైపునకు వచ్చేందుకు జంకుతున్నారంటే అతిశయోక్తి



కాదు. పత్తి, మిర్చి నల్లబారడంతో సగం ధరకు మాత్రమే అడుగుతున్నారని రైతులు వాపోతున్నారు. ఓ గిరిజన రైతు ఎకరం రూ.30వేల చొప్పున రెండు ఎకరాలు కౌలుకు తీసుకుని మిర్చి సాగు చేస్తే కూలీలు రాక కుటుంబ సభ్యులే మిర్చి కోసుకుంటున్నారంటే పరిస్థితి ఏవిధంగా ఉందో అవగతమవుతుంది. పండిన పంటలను సైతం మసిబారి నాణ్యత కోల్పోవడంతో సగం ధరకే అడుగుతున్నారని రైతులు వాపోతున్నారు.

### మాయమవుతున్న నెమళ్లు

అప్పలనర్సింహాపురం ఆంధ్రా ప్రాంతానికి సరిహద్దున ఉంటుంది. గుట్టలు, పచ్చదనంతో ఉండు వ్యవసాయ భూముల్లో, పచ్చిక మైదానాల్లో నెమళ్లు నాట్యం చేసేవి. ఇప్పుడు ఆ దృశ్యాలు కనిపించడం లేదు. పొగబారిన మొక్కలు, చెట్లు కనిపిస్తుండగా నెమళ్లు, ఇతర అటవీ పక్షులు, వలస జీవాలు కనుమరుగయ్యాయి.



### పుండు మీద కారంలా కెమికల్ ఫ్యాక్టరీ

స్పాంజ్ ఐరన్ కర్మాగారానికి అత్యంత సమీపంలో కెమికల్ ఫ్యాక్టరీ నిర్మించారు. ఫ్యాక్టరీ నుండి వచ్చే వ్యర్థాలను తీసుకుని వచ్చి ఈఫ్యాక్టరీలో శుద్ధిచేసి ఆంధ్రా ప్రాంతంలోని సిమెంట్ ఫ్యాక్టరీలకు సరఫరా చేస్తున్నారు. ఈ ఫ్యాక్టరీ పనిచేస్తున్నప్పుడు విపరీతమైన దుర్గంధం వెలువడుతుంది. చుట్టు రెండు కిలోమీటర్ల మేర పొలాల్లో పని చేస్తున్న రైతులు, వ్యవసాయ కూలీలు ఈ దుర్గంధంతో దీర్ఘకాలిక వ్యాధులకు గురవుతున్నారు.

### రైతుల మొర ఆలకించేదెవరు ?

పంటలు పోయి, అనారోగ్యాల బారీనపడటమే కా కుండా పర్యావరణానికి ముప్పుగా మారిన ఈ ఫ్యాక్టరీలపై చర్యలు తీసుకోవాలని రెండేళ్లుగా అధికారులకు, ప్రజా ప్రతినిధులకు పలుమార్లు దరఖాస్తు చేసిన స్పందించిన నాధుడే లేడని రైతులు అంటున్నారు. ఈ ఫ్యాక్టరీలపై తగు చర్యలు తీసుకుని ప్రజల ప్రాణాలను కాపాడాలని, పర్యావరణాన్ని పరిరక్షించాలని, భూమితో ముడిపడిన రైతులను తిరిగి సాగు చేసుకునే విధంగా తగు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

## మార్కుల మూల్యాంకనం పరిశీలన

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** రఘునాథపాలెం మండలంలోని పలు పాఠశాలల్లో పదవ తరగతి అంతర్గత మార్కుల మూల్యాంకనాన్ని పరిశీలించారు. గురువారం మండల పరిధిలోని కెజిబివి పాఠశాల, దానవాయి గూడెం, మహాత్మ జ్యోతిబాయి పూలే, బిసి ఉన్నత పాఠశాలలో మంచు కొండ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు ఆర్. కరుణకుమారి బృందం సందర్శించి అంతర్గత మార్కుల మూల్యాంకనాన్ని పరిశీలించారు. పదవ తరగతి విద్యార్థులకు గతంలో నిర్వహించిన ఫార్మేటివ్ మూల్యాంకనం మార్కులు, నోటు పుస్తకాలు, రికార్డులను పరిశీలించి ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. మూల్యాంకనం, రికార్డులు సరిగ్గా నిర్వహించినందుకు బృందం సంతృప్తి వ్యక్తం చేసి ఉపాధ్యాయులను, విద్యార్థులను అభినందించారు. అనంతరం పదవ తరగతి విద్యార్థులతో సమావేశం నిర్వహించి పరీక్షల్లో ఎటువంటి జాగ్రత్తలు పాటించాలి, ఎక్కువ మార్కులు ఎలా సాధించాలో సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో బృందంలోని ఉపాధ్యాయులు జూకంటి సుజాత, షేక్ రంజాన్ అలీ, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



# మద్దులపల్లి మార్కెట్‌ను సందర్శించిన మంత్రి పొంగులేటి





**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్:** ఖమ్మంరూరల్ మండలం మున్సిపాలిటీ పరిధిలోని మద్దులపల్లిలో వ్యవసాయమార్కెట్‌ను రాష్ట్ర రెవిన్యూ, గృహనిర్మాణం, సమాచారశాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి గురువారం సందర్శించారు. పాలేరు నియోజకవర్గ పర్యటనలో భాగంగా పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. కాగా మద్దులపల్లి మార్కెట్ రెండోరోజు భద్రమ్మ అనే రైతు 55బస్తాల మిర్చి తీసుకురాగా క్వింటాకు రూ.13,811 ధర పలికింది. పంటను అమ్మడానికి తీసుకువచ్చిన రైతులను మార్కెట్ కమిటీ చైర్మన్ భైరు హరినాథ్‌బాబు సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు బాలసాని లక్ష్మి నారాయణ, తుళ్లూరి బ్రహ్మయ్య, ఆత్మకమిటీ చైర్మన్ చావా శివరామకృష్ణ, డైరెక్టర్లు కర్లపూడి భద్రకాళి, ఉప్పుగండ్ల ప్రసాద్, వంసరి రవి, డిఎంఒ అలాం, డిఇఇ ఎల్లేష్, కార్యదర్శి ఆంజనేయులు పాల్గొన్నారు.

### మంత్రి సమక్షంలో పలువురు కాంగ్రెస్‌లో చేరిక

**నేలకొండపల్లి :** మండలంలోని రాజేశ్వరపురం గ్రామంలో పలు పార్టీలకు చెందిన పలు కుటుంబాలు గురువారం మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సమక్షంలో పలు సొసైటీల చైర్మన్ తన్నీరు కృష్ణమూర్తి, దండా సత్యనారాయణ, చిట్యాల రమేష్ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు.

**పలు కుటుంబాలకు పొంగులేటి పరామర్శ...**మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మండలంలో విస్తృతంగా పర్యటించారు. మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన బెస్ట్ టీషాపును ప్రారంభించారు. మండలం కేంద్రంలోని పాలడుగు పూర్ణచంద్రరావు, భైరవునిపల్లి కాంగ్రెసు పార్టీ అధ్యక్షుడు గోళ్ల శ్రీనివాస్ లను పరామర్శించారు. కార్యక్రమాల్లో మార్కెట్ కమిటీ చైర్మన్ వెన్నుపూసల సీతారాములు, నాయకులు మేకల వేంకటేశ్వర్లు, కొమ్మినేని విజయ్ బాబు, శాఖమూరి రమేష్, కొడాలి గోవిందరావు, బచ్చలికూర నాగరాజు, నెల్లూరి భద్రయ్య, వజ్య రమ్యా, బొడ్డు బోందయ్య, గూడవల్లి రామబ్రహ్మం, చెరువు స్వర్ణ, జెర్రిపోతుల అంజనీ, బోయిన వేణు, కుక్కల హనుమంతరావు, కడియాల నరేష్, సూరేపల్లి రామారావు, మరికంటి రమేష్ ఉమారాణి, గండు సైదులు, పెద్దపాక సైదులు, డిల్లా ఉపేందర్,ఇస్లావత్ బాలాజీ పాల్గొన్నారు.

# అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తే చర్యలు



కలెక్టర్ జితేష్ వి పాటిల్



**ప్రజాపక్షం/భద్రాచలం :** అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ జితేష్ వి పాటిల్ హెచ్చరించారు. గురువారం ఆయన చర్ల మండల పరిధిలోని చింతకుంట, మొగళ్లపల్లి ఇసుక ర్యాంపులను పరిశీలించారు. స్టాక్ రిజిష్టర్‌లు,పాయింట్‌లను పరిశీలించారు. లోడింగ్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. సొసైటీ అందించి వే బిల్లులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇసుక రీచ్‌లలో నిబంధనలు విరుద్ధగా వ్యవహరిస్తే సహించేంది లేదన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్‌తో పాటు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

**ంతరాష్ట్ర సరిహద్దుల్లో మూడు చెక్‌పోస్టులు ...**బర్డ్ ఫ్లూ నివారణలో ఇతర రాష్ట్రాల నుండి దిగుమతి అవుతున్న కోళ్లను అరికట్టేందుకు రాష్ట్ర సరిహద్దులైన తేగడ, అల్లిపల్లి, అశ్వారావుపేటలో పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో చెక్ పోస్టులు ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ ఒక ప్రకటనలో తెలపారు. అంతరాష్ట్ర చెక్‌పోస్టుల వద్ద ముమ్మర తనిఖీలు చేసి కోళ్లు, గుడ్లు వాహనాలు వస్తుంటే వాటిని తిరిగి వెనక్కు పంపిస్తున్నట్లు చెప్పారు. కోళ్లకు ఏదైనా సమస్య ఉంటే పశుసంవర్ధక శాఖ అధికారులకు తెలియజేయాలని సూచించారు.

### ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలి

**చర్ల :** ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందిస్తూ ప్రభుత్వాస్పత్రులపై నమ్మకాన్ని కలిగించాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. గురువారం స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో డయాల్సిస్ సెంటర్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వైద్యులు, సిబ్బంది ప్రజలకు మెరుగైన వైద్య సదుపాయాలు అందించాలన్నారు. కార్యక్రమంలో డిసిహెచ్‌ఎస్ రవిబాబు, ఆస్పత్రి సూపరింటెండెంట్ సాయి వర్ధన్, డాక్టర్లు కాంత్, జగన్, డయాల్సిస్ ఆపరేషన్ మేనేజర్ భాస్కర్ పాల్గొన్నారు.

## జెఇఇ మెయిన్స్‌లో మెరిసిన బ్రిలియంట్ ఆణిముత్యం




**ప్రజాపక్షం/బూర్గంపాడు:** బూర్గంపాడు మండలం నుండి స్థానిక సారపాకలో గల బ్రిలియంట్ జూనియర్ కళాశాల లో ఇంటర్మీడియట్ ఎంపిసి చదువుతున్న బి.సంయుక్త ఇటీవల విడుదలైన జెఇఇ మెయిన్స్‌లో 79శాతంతో జాతీయ స్థాయిలో ఉత్తీర్ణత సాధించింది. ఈసందర్భంగా గురువారం కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో బ్రిలియంట్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ బిఎన్ఆర్, సారపాక గ్రామ పంచాయితీ ఇఒ మహేష్ జెఇఇ మెయిన్స్‌లో ఉత్తీర్ణత సాధించిన సంయుక్తను శాలువా, మెమోంటోలతో సత్కరించి, అభినందించారు. ఈసందర్భంగా ఇఒ మహేష్ మాట్లాడుతూ ఇలాంటి మారుమూల ప్రాంతమైన ఏజెన్సీ ప్రాంతంలో ఎన్నో కాంపిటేషన్ పరీక్షలకు విద్యార్థులకు తయారు చేస్తూ మా గ్రామంలో ఒక మంచి విద్యాసంస్థ ఉన్నందున ఈ గ్రామ ఇఒగా గర్వపడుతున్నానన్నారు. జెఇఇ మెయిన్స్, జేఎన్‌టీయూ, నవోదయ, సైనిక్, ఏకలవ్య వంటి ప్రముఖ, విద్యాసంస్థల చేరడానికి కోచింగ్ ఇస్తూ ప్రోత్సహిస్తున్న బ్రిలియంట్ విద్యాసంస్థల చైర్మన్ బిఎన్ఆర్ కృషిని కొనియాడారు. కార్యక్రమంలో కాలేజ్ అధ్యాపక బృందం, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## అన్నం ఫౌండేషన్‌కు రూ.5లక్షల సామాగ్రి వితరణ

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** రిలయబుల్ ట్రస్టు హైదరాబాద్ ఆధ్వర్యంలో అన్నం సేవా ఫౌండేషన్‌కు ఐదు లక్షల రూపాయల విలువ చేసే నిత్యావసరాలను వితరణగా అందించారు. గురువారం అన్నం ఫౌండేషన్‌లో జరిగిన కార్యక్రమంలో ఖమ్మంజిల్లా జడ్జి చంద్రశేఖర్ చేతుల మీదుగా ఐదు లక్షల రూపాయల విలువ చేసే బియ్యం, ఆహార పదార్థాలు, దుస్తులు, ఇతర వస్తువులను రిలయబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు ఛైర్మన్ రవి, డా॥ టివి పుల్లంరాజు, బాలస్వామి, అల్వాల రామనాథం, పరిపూర్ణాచారి, ట్రస్టు సభ్యులు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా అన్నం ఫౌండేషన్‌లో మధురానగర్ సాయిబాబా ఆలయ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు.

## బాధ్యతలు స్వీకరించిన కమ్మ సంఘం నూతన కమిటీ

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఇటీవల ఏకగ్రీవంగా ఎన్నికైన కమ్మ మహాజన సంఘం నూతన కమిటీ బాధ్యతలు స్వీకరించింది. గురువారం సంఘం కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో నూతన కమిటీ ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం బాధ్యతలు స్వీకరించారు. సంఘం చేపట్టబోయే కార్యక్రమాల గురించి చర్చించారు. అందరి సహకారంతో కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు కొల్లు రఘు సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి చావా రాము, ఉపాధ్యక్షులు కర్నాటి రమాదేవి, జాయింట్ సెక్రటరీ వజ్జా శ్రీనివాసరావు, కోశాధికారి తాళ్లూరి నిర్మల, కార్యవర్గ సభ్యులు మోత్కూరి సత్యనారాయణ, పోతినేని భూమేశ్వరరావు, మేదరమెట్ల స్వరూపరాణి, నల్లమల ఆనంద్, నంబూరి ప్రసాద్, తుమ్మలపల్లి నాగేశ్వరరావు, కోలేటి నవీన్, సంఘం మాజీ అధ్యక్షులు వెజళ్ల సురేష్, తాళ్లూరి మురళీకృష్ణ, బండి రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఇష్టానుసారంగా వ్యవహరిస్తే వేటు తప్పదు



ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఖమ్మం కార్పొరేషన్‌లో రూల్స్‌ను అతిక్రమించి ఇష్టరీతిన వ్యవహరిస్తే వేటు తప్పదని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ హెచ్చరించారు. ప్రజలకు సమర్థవంతమైన పరిపాలనతో మెరుగైన సేవలను అందించాలన్నారు. కార్పొరేషన్ పరిధిలోనూతనంగా నిర్మించే రోడ్లు నాణ్యత పరీక్షించే వరకు బిల్లులు చెల్లించవద్దని సూచించారు. గురువారం ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కార్యకలాపాలపై కార్పొరేషన్ కార్యాలయంలో అదనపు కలెక్టర్, ఇంచార్జి మున్సిపల్ కమిషనర్ డా.పి.శ్రీజతో కలిసి అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఖమ్మం కార్పొరేషన్ పరిధిలో చెత్త పేరుకుపోతున్న 1248 ఖాళీ స్థలాలను గుర్తించడం జరిగిందని వీటిలో ఎన్ని శుభ్రం చేశామో వాస్తవిక వివరాలతో నివేదిక అందించాలన్నారు. రాబోయే వేసవి కాలంలో తాగునీటి సరఫరాకు ఇబ్బందులు కలుగకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని, నీటి లీకేజీని అరికట్టాలని, పైపులైన్‌లో మరమ్మతులు పూర్తి చేయాలన్నారు. కార్పొరేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో దుకాణాల సామాగ్రి బయటకు రావడం వల్ల ట్రాఫిక్ సమస్య అధికమవుతుందని ట్రాఫిక్ పోలీసులు, మున్సిపల్ అధికారులు సమన్వయంతో రోడ్లపైకి వచ్చిన దుకాణాల తొలగింపునకు నోటీసులు జారీ చేయాలన్నారు. నిర్మాణాలకు సంబంధించిన సామాగ్రిని రోడ్లపై వేస్తున్నారని ఎవరైనా వేస్తే వారిపై భారీ జరిమానాలను విధించాలని కలెక్టర్ తెలిపారు. సమావేశంలో అసిస్టెంట్ కమిషనర్ షఫీవుల్లా, ఎస్ఇ రంజిత్, ఇఇ కృష్ణలాల్, ఎసిపి వసుంధర, ఉద్యానవన శాఖాధికారిణి రాధిక, శానిటరి సూపర్‌వైజర్ సాంబయ్య, రెవెన్యూ అధికారి శ్రీనివాసరావు, ఇం చార్జి డిసిపి రాజ్‌కుమార్, ట్రాఫిక్ ఎస్ఐ రవి, మెప్మా పిడి మహేందర్, టిఎంసి సుజాత, అధికారులు పాల్గొన్నారు.

### నగరాన్ని పరిశుభ్రంగా తీర్చిదిద్దాలి

ఖమ్మం నగరాన్ని పరిశుభ్రంగా తీర్చిదిద్దాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ తెలిపారు. అదనపు కలెక్టర్ డా.పి.శ్రీజతో కలిసి మున్నేరు నది పరివాహక ప్రాంతంలో పర్యటించి శానిటేషన్, తాగునీరు, విద్యుత్, ఉపాధి పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నీటి ప్రవాహానికి అడ్డులేకుండా కాలువలను శుభ్రం చేయాలన్నారు. డ్రైన్ల మరమ్మతులను పూర్తి చేయాలని, సిసి రోడ్లు ఏర్పాటు చేయాలని, ప్రతి ఇంటికి చెత్త సేకరణ బండి వచ్చేలా చూడాలని, మూడు బ్రిడ్జిల వద్ద చెత్త ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని సూచించారు. మున్నేరు నది పరివాహక ప్రాంత మహిళలతో కలెక్టర్ మాట్లాడారు. వ్యాపార యూనిట్ల ఏర్పాటుకు ప్రణాళికలు తయారు చేసుకోవాలని వాటి గ్రౌండింగ్‌కు రుణాలు మంజూరు చేస్తామని తెలిపారు. వరద కష్టాలు పునరావృతం కావద్దంటే మున్నేరు రిటైనింగ్ వాల్ నిర్మించాలని దీని కోసం ఎవరి ఇండ్లు తీయాల్సి వచ్చినా ఇండ్లు అందించిన తర్వాత తొలగిస్తామన్నారు.

# ఆధార్ నమోదు కోసం మెగా క్యాంపులు

కలెక్టర్ వెంకటేష్ దోత్రే



**ప్రజాపక్షం/ఆసిఫాబాద్:** ఆధార్ నమోదు, అప్ డేట్ కొరకు ఆసిఫాబాద్, కాగజ్ నగర్ లో మెగా క్యాంపులు నిర్వహించాలని, ప్రతి ఒక్కరూ ఆధార్ కార్డు కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే స్పష్టం చేశారు. గురువారం హైదరాబాద్ నుండి యుఐడిఏఐ డిప్యూటీ డైరెక్టర్ చైతన్య కుమార్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలో జిల్లా స్థాయి మానిటరింగ్ కమిటీ సభ్యులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని పాఠశాలలు, కళాశాలల్లో చదివే విద్యార్థులు వివిధ సంక్షేమ పథకాల లబ్ధి పొందేందుకు ప్రతి ఒక్కరూ ఆధార్ కార్డు తప్పనిసరిగా కలిగి ఉండాలని తెలిపారు. 5 సంవత్సరాలలోపు పిల్లలు సుమారుగా 36,679 మంది ఉన్నారని, వీరందరికీ ఆధార్ నమోదుకు జిల్లా సంక్షేమ శాఖ, విద్యాశాఖ, గిరిజన సంక్షేమ శాఖల సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. 5 సంవత్సరాల లోపు పిల్లలు ఆధార్ నమోదు సేవలు ఉచితంగా పొందవచ్చని, 15 సంవత్సరాలు దాటిన వారు మానిటరింగ్ బయోమెట్రిక్ అప్ డేట్ చేసుకోవాలని తెలిపారు. ఆసరా పింఛన్ దారులు, ఉపాధి హామీ కూలీలు, వేలిముద్రలు పడని వారు అప్ డేట్ చేసుకోవాలని తెలిపారు. తపాలా శాఖ అధికారులు ఆధార్ కార్డులు ఇంటింటికి త్వరగా పంపిణీ జరిగేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావు, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి దత్తారాం, ముఖ్య ప్రణాళిక అధికారి కోటయ్య, జిల్లా గిరిజనాభివృద్ధి అధికారి రమాదేవి, జిల్లా సంక్షేమ అధికారి ఆడెపు భాస్కర్, విద్యాశాఖ అధికారులు, ఈడిస్ట్రిక్ట్ మేనేజర్ గౌతమ్ రాజు, తపాలా శాఖ అధికారులు పాల్గొన్నారు.

## విద్యార్థులు ఉన్నత స్థానాలకు ఎదగాలి



**ప్రజాపక్షం/బాన్సువాడ:** విద్యార్థులు కష్టపడి చదివి పదవ తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలను సాధించి సమాజంలో ఉన్నతస్థానానికి ఎదగాలని సబ్ కలెక్టర్ కిరణ్మయి అన్నారు. గురువారం బాన్సువాడ పట్టణంలోని రెడ్డి సంఘంలో డివిజన్ స్థాయి షెడ్యూల్ కులాలు, గిరిజన అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విజయస్ఫూర్తి, ప్రేరణ కార్యక్రమానికి సబ్ కలెక్టర్ ముఖ్య అతిథిగా విచ్చేసి పదవ తరగతి విద్యార్థులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ విద్యార్థులు ప్రణాళికా బద్ధంగా చదివి పరీక్షల్లో ఎలాంటి భయాందోళనకు గురికాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాసి ఉత్తీర్ణులు కావాలన్నారు. పదవ తరగతి ప్రతి విద్యార్థికి తొలి మెట్టు లాంటిదని, సమాజంలో ఉన్నత స్థానానికి ఎదిగేలా విద్యార్థులు ఇప్పటినుండి లక్ష్యాన్ని ఏర్పరుచుకోవాలన్నారు. కార్యక్రమంలో వసతి గృహ నిర్వాహకులు గంగసుధ, విజయభారతి, వెంకట్‌రావు, పురుషోత్తం, నరసింహాచారి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాల్గొన్నారు.

## ఏడుపాయల ఆలయ హుండీ ఆదాయం రూ. 47.33 లక్షలు



**ప్రజాపక్షం/పాపన్నపేట:** ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ఏడుపాయల వన దుర్గ భవాని ఆలయ హుండీ ఆదాయం 47 లక్షల 33 వేల 787 రూపాయల ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి చంద్రశేఖర్, దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ అంజలి దేవి వెల్లడించారు. గురువారం ఏడుపాయల క్షేత్రంలో గల గోకుల్ షెడ్ లో హుండీ లెక్కింపు నిర్వహించారు. శ్రీ వెంకట అన్నమాచార్య సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో హుండీ లెక్కింపు నిర్వహించగా ఆలయ అధికారులు పర్యవేక్షించారు. వెండి బంగారం మినహా 52 రోజులకు గాన 47 లక్షల 33 వేల 787 రూపాయల అదే వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది సేవా సమితి సభ్యులు పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

## మహా శివరాత్రికి ప్రత్యేక బస్సులు..



**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్:** మహా శివరాత్రి సందర్భంగా నిర్మల్ డిపో పరిధిలోని ప్రముఖ శైవ క్షేత్రాలకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు డిపోమేనేజర్ ప్రతిమా రెడ్డి తెలిపారు.గురువారం డిపోమేనేజర్ కార్యాలయములో నిర్మల్ డిపోకు సంబందించిన కంట్రోలర్ లతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు.మన డిపో పరిధిలోని కదిలే పాప హరేశ్వర్,బూర్గుపల్లి,కాల్వ,ఇతర శైవ క్షేత్రాలకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నాము,భక్తులకు ఇబ్బంది కలుగకుండా రద్దీకి అనుగుణంగా అన్ని పుణ్య క్షేత్రాలకు అవసరమయిన బస్సులు తిప్పాలని,అందరూ సమిష్టి కృషితో పనిచేయాలని ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా భక్తులను తమ గమ్యస్థానాలకు చేరవేయాలని బస్సులు ఎలాంటి బ్రేక్ డౌన్ కు గురి కావద్దని సూచించారు.ఈ కార్యక్రమంలో అసిసెంట్ మేనేజర్ ఐ.రాజశేఖర్,అసిస్టెంట్ ఇంజనీర్(ఎం) నవీన్ కుమార్ కంట్రోలర్లు,ఏ.డి.సిలు పాల్గొన్నారు.

## సర్వేయర్‌పై దాడి

**ప్రజాపక్షం/పాపన్నపేట:** భూమిని సర్వే చేసి తిరిగి వస్తున్న సర్వేయర్ పై ఇద్దరు వ్యక్తులు దాడి చేసిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై శ్రీనివాస్ గౌడ్ కథనం ప్రకారం మండలంలో సర్వేయర్ గా విధులు నిర్వహిస్తున్న హహోబిలం శ్రీనివాస్ ఇదే మండలం యూసుఫ్‌పేట గ్రామానికి చెందిన తీగల మల్లేశం అనే వ్యక్తి భూమిని సర్వే చేయడానికి బుధవారం యూసుఫ్‌పేట గ్రామానికి వెళ్ళాడు. సర్వేచేసి తిరిగి వస్తుండగా గ్రామ బస్టాండ్ సమీపంలో అదే గ్రామానికి చెందిన ఎరుపుల శ్రీనివాస్, ఎరుపుల గంగయ్య అనే ఇద్దరు వ్యక్తులు సర్వేయర్ బైక్ ను ఆపి భూతూ మాటలు తిట్టి చేతులతో, హెల్మెట్ తో ముఖంపై కొట్టారు. సర్వేయర్ శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు దాడి చేసిన ఇద్దరు వ్యక్తులపై గురువారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

## ఎలక్షన్ డ్యూటీ నుంచి గర్భిణులను మినహాయించాలి



**ప్రజాపక్షం/శివ్వంపేట :** రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల విధుల నుంచి గర్భిణీస్త్రీలను ప్రభుత్వం మినహాయింపు ఇవ్వాలని టీఎస్‌యూటీఎఫ మండల అధ్యక్షులు చక్రుసింగ్ అన్నారు. గురువారం ఎంఈఓ బుచ్యానాయక్‌కు, ఎంపీడీఓ నాగేశ్వర్‌గుప్తాలకు టీఎస్‌టీయూఎఫ్ ఆధ్వర్యంలో వినతిపత్రాలు అందజేశారు. ఎన్నికల్లో స్టేజ్ 2 ఆఫీసర్స్ డ్యూటి వేయడంలో సీనియారిటిని ప్రాతిపదికన తీసుకోవాలని వినతిపత్రం కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి కనకరాజు, ఉపాధ్యక్షులు రాజేంద్రప్రసాద్, ఎఫ్‌డబ్ల్యూఎఫ్ కన్వీనర్ సంతోష్, జిల్లా నాయకులు శ్రీనివాస్ ఉన్నారు.

## ఎమ్మార్పీ ధరలకు ఎరువులను విక్రయించాలి



**ప్రజాపక్షం/కౌడిపల్లి:** మండల పరిధిలోని మహమ్మద్ నగర్ గేట్ సమీపంలో గల పిఎసిఎస్ సొసైటీ ఫర్టిలైజర్ దుకాణాన్ని గురువారం ఏడీఏ పుణ్యవతి ఏవో స్వప్న జాదవ్ తో కలిసి తనిఖీ నిర్వహించారు. షాపులోని రిజిస్టర్, బిల్ పుస్తకాలను ఆమె తనిఖీ చేశారు. ఎంఆర్‌పి ధరల కే ఎరువులను విక్రయించాలని, నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవన్నారు. ప్రస్తుత వరిలో ఆశిస్తున్న కాండం పురుగు సమస్య కారణంగా యూరియాని తగ్గించాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సీఈఓ దుర్గా గౌడ్, సిబ్బంది కిషన్, అనిల్ తదితరులు ఉన్నారు.

## అర్హత గల ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకోవాలి

అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్

**ప్రజాపక్షం/మంచిర్యాల:** మెదక్‌నిజామాబాద్‌ఆదిలాబాద్‌కరీంనగర్ నియోజకవర్గాల ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికలలో భాగంగా ఈ నెల 27వ తేదీన జిల్లాలో జరుగనున్న పోలింగ్‌లో రాష్ట్ర ప్రభుత్వ, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, ప్రైవేట్ సంస్థలు, వ్యాపారం, పరిశ్రమలు, ట్రేడ్ ఇతర సంస్థలలో పని చేస్తున్న అర్హత గల ఓటర్లు తమ ఓటు హక్కు తప్పనిసరిగా వినియోగించుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 27వ తేదీన ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగుతుందని, భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రభుత్వ ఉద్యోగులకు పోలింగ్ రోజు సెలవు దినంగా ప్రకటించడం జరిగిందని, ప్రైవేట్ సంస్థలలో పని చేసే ఉద్యోగులు, అధికారులకు ఓటు హక్కు వినియోగించుకునేందుకు వీలుగా విధులలో వెసలుబాటు కల్పించడం జరుగుతుందని, సెలవు దినం ఇవ్వడం జరుగుతుందని, ఆయా సంస్థల యాజమాన్యాలు ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం సహకరించాలని తెలిపారు.

## నీటి యాజమాన్య పద్ధతులు పాటించి అధిక దిగుబడి పొందాలి



**ప్రజాపక్షం/ కాగజ్‌నగర్ రూరల్:** నీటి యాజమాన్య పద్ధతులు పాటించి అధిక దిగుబడి పొందాలని కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా వ్యవసాయాధికారి రావూరి శ్రీనివాసరావు అన్నారు. గురువారం కాగజ్‌నగర్ మండలం వంజిరి గ్రామ రైతు వేదికలో వాలంటరీ హైదరాబాద్ వారు రైతులకు వివిధ పంటలలో నీటి యాజమాన్యం, వాటర్ షెడ్ మేనేజ్మెంట్ పై రైతు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయాధికారి మాట్లాడుతూ రైతులు నీటి యాజమాన్య పద్ధతులు పాటించి అధిక దిగుబడి పొందాలని, సేంద్రీయ వ్యవసాయ పద్ధతులలో పంటలు పండించి లబ్ది పొందాలని సూచించారు. నేల, నీటి వినియోగం భూ సంరక్షణ పద్ధతులు, సేంద్రీయ వ్యవసాయం ఆయిల్ ఫామ్ తోటల సంరక్షణ ప్రాంతాల్లో నేల, నీటి సంరక్షణ పద్ధతులు డ్రిప్ ఇరిగేషన్ వర్షపు నీటిని నిల్వ చేసే పద్ధతులు, నీటి కుంటలు మల్చింగ్ విధానం కలిగే ప్రయోజనాలు, ఇంకుడు గుంతలపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వాలంటరి సహాయ వ్యవసాయ అధికారులు కె.సునిత, ఎస్ అన్నపూర్ణ, సిర్పూర్ కాగజ్‌నగర్ సహాయ వ్యవసాయ సంచాలకులు మనోహర్, వ్యవసాయాధికారి జి. రామకృష్ణ, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## పకడ్బందీగా పంచాయతీ ఎన్నికల నిర్వహణ

కలెక్టర్ అభిలాష అభినవ్





**ప్రజాపక్షం/నిర్మల్ ప్రతినిధి:** పంచాయితీ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పంచాయతీ ఎన్నికల నిర్వహణ, ఆర్ఓ, ఏ ఆర్పిఓ ల విధులు తదితర అంశాలపై రిటర్నింగ్ అధికారులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. రిటర్నింగ్ అధికారులకు మాస్టర్ ట్రైనర్ లు ఎన్నికల నిర్వహణ, విధుల నిర్వహణపై అవగాహన కల్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ,రానున్న పంచాయతీ ఎన్నికల నిర్వహణను పకడ్బందీగా చేపట్టాలని ఆదేశించారు. నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం మొదలుకొని, ఎన్నికల లెక్కింపు వరకు అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు.ఎన్నికల విధుల నిర్వహణలో అన్ని రకాల ఫారములను జాగ్రత్తగా పూరించాలన్నారు.రోజువారిగా ఎన్ని నామినేషన్ల వివరాలను గ్రామపంచాయతీ కార్యాలయ నోటీసు బోర్డు నందు అందుబాటులో ఉంచాలన్నారు. నామినేషన్ల పరిశీలన ప్రక్రియను ప్రకడ్బందీగా నిర్వహించి, అనర్హమైన నామినేషన్లను తొలగించాలన్నారు. ఒక వ్యక్తి గరిష్టంగా నాలుగు సెట్ల నామినేషన్లను దాఖలు చేయవచ్చును అన్నారు. నామినేషన్ల చివరి రోజు నాటికి ఏదేని ఒక నామినేషన్‌కు మాత్రమే కట్టుబడి ఉండాలన్నారు. ఒక వేళ నామినేషన్లు తిరస్కరణకు గురైతే సదరు వ్యక్తికి తిరస్కరణ పై అపీలు చేసుకునేందుకు వెసులుబాటు కల్పించాలన్నారు. ఎన్నికలకు 44 గంటల ముందు నుంచి ప్రచారానికి అనుమతి ఉండదన్నారు.ఎన్నికల ఏజెంట్ల సమక్షంలో బ్యాలెట్ బాక్స్ తనిఖీ, సీల్ వేయుట, తదితర ప్రక్రియలను పూర్తి చేయాలన్నారు. ఓటర్లు తమ వెంట ప్రభుత్వంచే గుర్తించబడిన ఏదేని ఒక గుర్తింపు కార్డును తీసుకురావాలని, గుర్తింపు కార్డు యొక్క చివరి 4 అంకెలు సంబంధిత ఫారంలో నమోదు చేయాలన్నారు. అధికారులంతా సమన్వయంతో పనిచేసి పంచాయితీ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్‌లు, డిపిఓ శ్రీనివాస్, మాస్టర్ ట్రైనర్‌లు, రిటర్నింగ్ అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల నిర్వహణలో ‘స్టేజ్ -02’ అధికారుల పాత్ర కీలకం

కలెక్టర్ రాహుల్ రాజ్



**ప్రజాపక్షం/మెదక్‌ప్రతినిధి:** మెదక్ జిల్లాలో త్వరలో జరగబోయే గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణలో స్టేజ్ 02 అధికారుల పాత్ర కీలకమని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ సూచించారు. గురువారం సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో జడ్పిటిసి ఎంపిటిసి, సర్పంచ్ ఎన్నికలకు సంబంధించి, స్టేజ్02 రిటర్నింగ్ ఆఫీసర్స్ శిక్షణా కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పక్కా ప్రణాళికతో చర్యలు తీసుకుంటున్నామని గ్రామ పంచాయతీ ఎన్నికలలో స్టేజ్02 అధికారులు కీలకంగా వ్యవహరించాలని ఆయనే కౌంటింగ్ చేసి ఫలితాలు ప్రకటించే అధికారిగా ఉంటారన్నారు. పోలింగ్‌ముందు రోజు, పోలింగ్ రోజు కౌంటింగ్ రోజు నిబద్ధతతో పని చేయాలని తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లో వసతులను పరిశీలించుకోవాలని, పోలింగ్ కేంద్రాలను పరిశీలించుకుని మౌలిక వసతులు సరిగా ఉన్నాయా లేదా లేకపోతే సంబంధిత ఎంపీడీవో దృష్టికి తీసుకుని వెళ్లి తద్వారా చర్యలు చేపట్టాలన్నారు. రెండో రోజు డిస్ట్రిబ్యూషన్ సెంటర్ నుండి పోలింగ్ కేంద్రాలకు బ్యాలెట్ బాక్స్ లతో విధులు నిర్వహించే వారితో వెళ్లి పోలింగ్ కేంద్రాల్లో ఉండి మరుసటి రోజు ఎన్నికల నిర్వహించుకుని వార్డ్ వైజ్ , కౌంటింగ్, సర్పంచ్ కౌంటింగ్ చేసి ఉపసర్పంచిని ఎన్నిక చేసుకోవాల్సి ఉంటుంది అన్నారు. ఎన్నికల నియమ నిబంధనలను తూచా తప్పకుండా పాటిస్తూ వార్డ్ మెంబర్స్, సర్పంచ్ ఎంపికలో ఎలాంటి పొరపాట్లు తావు లేకుండా పక్కా ప్రణాళికతో వ్యవహరించాల్సిన బాధ్యత ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, ఆర్డీవో రమాదేవి,జడ్పీ సీఈఓ ఎల్లయ్య, డిపిఓ యాదయ్య, విద్యాశాఖ అధికారి రాధా కిషన్, సైన్స్ అధికారి రాజిరెడ్డి, స్టేజ్02 అధికారులు పాల్గొన్నారు.

## రైతుభరోసా కోసం ఎదురుచూపులు




**ప్రజాపక్షం/నందిపేట్:** రాష్ట్ర ప్రభుత్వం ఈ యాసంగి పంటకు రైతు భరోసా డబ్బులు వేస్తున్నామని చెబుతున్నా చాలా మంది రైతులు బ్యాంకు ఖాతాలో పడటం లేదని వాటికోసం ఎదురుచూస్తున్నామని ఆరోపణలు వస్తున్నాయి. డబ్బులు వస్తాయా, రావా అనే సందిగ్దంలో రైతులు ఉన్నారు. నందిపేట్ మండలంలో పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపికైన గ్రామాలలో జనవరి 26న రైతుభరోసా డబ్బులు ప్రభుత్వం వేసింది. ఆ తరువాత ఎన్నికల కోడ్ అని డబ్బులు వేయలేదని తెలిసింది. మొదటి విడతలో భాగంగా ఎకరం లోపు వారికి బ్యాంకులోజమచేశారు. అప్పుడే చాలా మంది రైతు భరోసా డబ్బులు రాలేవని బ్యాంకు, వ్యవసాయాధికారుల చుట్టు తిరిగినా ఫలితం కానరాలేదు. రెండవ విడత ఎకరం పైన ఉన్న వారికి డబ్బులు వేశారు. అప్పటికి మొదటి విడత వారికి రాకపోవడంతో రైతులు సందిగ్దంలో పడ్డారు. ఈ విషయంలో బ్యాంకు అధికారులను కలిసిన బ్యాంకు బ్యాలెన్సు చూసి డబ్బులు రాలేవని చెప్పడంతో రైతులు అసలు డబ్బులు వస్తాయా రావా అంటూ ఆలోచనలో పడ్డారు. ఇదే విషయం మండల వ్యవసాయ విస్తరణ అధికారులను కలిస్తే మీ పేరున రైతు భరోసా డబ్బులు విడుదల అయినాయని, కాకపోతే అప్‌డేట్, ప్రాసెస్‌లో ఉన్నట్టు కంప్యూటర్‌లో చూపెడుతుందని సమాధానం ఇస్తున్నారు. వ్యవసాయాధికారిణి జ్యోత్స్న భవాని ఇదే చెప్పడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. డబ్బులు ఎలాగైనా వస్తాయని వారు చెబుతున్నారు. ఈ విషయంలో జిల్లా కలెక్టర్, జిల్లా వ్యవసాయాధికారులు తగు చర్యలు తీసుకొని అందరు రైతులకు న్యాయం చేయాలని మండల రైతులు కోరుతున్నారు.

## అప్పుల వేధింపులతోనే నా భర్త ఆత్మహత్య

విచారణ జరిపి న్యాయం చేయండి



**ప్రజాపక్షం/మెదక్ ప్రతినిధి:** మెదక్ పట్టణ ప్రముఖ కిరాణ వ్యాపారి సాయి దీప్ సూపర్ మార్కెట్ యజమాని రమేష్ ఆత్మహత్యకు అప్పుల వేధింపులే కారణం అంటూ భార్య గాయత్రి పట్టణ పోలీసు స్టేషన్ లో గురువారం ఫిర్యాదు చేసింది. మెదక్ పట్టణంలోని ప్రముఖ సూపర్ మార్కెట్ యజమాని మల్లికార్జున రమేష్ ఈ నెల 11న ఇంటి వద్ద పై గల పెంట్ హౌస్ లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన తెలిసిందే. రమేష్ ఆత్మహత్య కు అప్పులు ఇచ్చిన వారి వేధింపులే ప్రధాన కారణమంటూ భార్య ఫిర్యాదు చేయడం చర్చనీయాంశంగా మారింది. తన భర్త రమేష్ ఈ నెల 11న ఉదయం 7:30 గంటలకు ఇంట్లో నుంచి బయలుదేరి షాప్ కు వెళ్ళాడని, అక్కడ అప్పులు ఇచ్చిన వాళ్ళు వచ్చి ఇచ్చిన అప్పు తిరిగి ఇవ్వమని బెదిరించారని తెలిపారు. అప్పు ఇస్తావా... చస్తావా... నీ అంతు చూస్తామని బెదిరించారని తెలిపారు. అందుకు మనస్థాపం చెందిన తన భర్త ఉరివేసుకొని మృతి చెందినట్లు తెలిపారు. షాప్ నిర్మాణం కోసం దాదాపు 30 మంది నుంచి రూ.30 కోట్ల వరకు అప్పు తీసుకున్నట్లు చెప్పారు. అప్పుల కోసం వేధించిన వారు షాప్ కు వచ్చిన వారి వివరాలు సీసీ కెమెరాల్లో రికార్డు అయ్యాయని, విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరినట్టు గాయత్రి తెలిపారు. సాయి దీప్ రమేష్ అప్పుల భారంతో ఆత్మహత్య చేసుకున్నట్టు ఇప్పటి వరకు ప్రచారం జరిగింది కానీ భార్య ఫిర్యాదులో అప్పుల వాళ్ళ బెదిరింపుల వల్లే ఆత్మహత్య చేసుకున్నట్టు వెలుగులోకి వచ్చింది. రమేష్ ను బెదిరించింది ఎవరు, ఎంత మంది అప్పులు ఇచ్చిన వాళ్ళు ఉన్నారు అనేది పోలీసుల విచారణలో తేలే అవకాశం ఉంది.

## మాదక ద్రవ్యరహిత సమాజ నిర్మాణానికి సమష్టిగా కృషి




**ప్రజాపక్షం/మంచిర్యాల ప్రతినిధి:** యువత, విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని, మంచి భవిష్యత్తును నిర్మించుకోవాలని, మాదక ద్రవ్య రహిత సమాజ నిర్మాణానికి సమిష్టిగా కృషి చేద్దామని మంచిర్యాల సిఐ ప్రమోద్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో జిల్లా మహిళ, శిశు, వయోవృద్ధులు, దివ్యాంగుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నషా ముక్త్ భారత్ అభియాన్, మిషన్ పరివర్తన కార్యక్రమంలో భాగంగా నిర్వహించి యాంటీ డ్రగ్స్ అవగాహన కార్యక్రమానికి ఎక్సైజ్ శాఖ ఇన్స్పెక్టర్ మనీషా రాథోడ్, కళాశాల ప్రిన్సిపల్ ఎం.డి. సులేమాన్ లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా మంచిర్యాల సి.ఐ. మాట్లాడుతూ బాల బాలికలు, యువత డ్రగ్స్కు దూరంగా ఉండాలని, మాదక ద్రవ్యాలు తీసుకోవడం వలన భవిష్యత్తు నాశనం అవుతుందని తెలిపారు. ఎవరైనా డ్రగ్స్ విక్రయించినా, యువత తాము ఉన్న పరిసరాలలో ఇతరలు ఎవరైనా మాదక ద్రవ్యాలు తీసుకున్నట్లయితే వెంటనే డ్రగ్స్ హెల్ప్స్ నం. 14446 ద్వారా పోలీసులకు సమాచారం అందించాలని, సామాజిక బాధ్యత తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపల్ రేఖ, కమ్యూనిటీ ఎడ్యుకేటర్ సందీప్, సంబంధిత అధికారులు, అధ్యాపక వర్గం, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

## రక్షణతో బొగ్గు ఉత్పత్తి సాధించాలి



**ప్రజాపక్షం /కాసి-పేట:** ఉద్యోగులు రక్షణతో కూడిన ఉత్పత్తిని సాధిస్తూ సంస్థ మనుగడను కాపాడాలని సింగరేణి సి అండ్ ఎండి బలరాం నాయక్ అన్నారు. మందమర్రి ఏరియా కాసిపేట 1,2వ ఇంక్లైన్ గనులను డైరెక్టర్ ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్స్ కె వెంకటేశ్వర్లు, డైరెక్టర్ ఆపరేషన్, ఎల్ వి సూర్యనారాయణ లు సందర్శించారు. గనులపై కార్మికులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పనిముట్లు, రక్షణ పరికరాలు ఇవ్వాలని కార్మికులు తెలిపారు. ఈ సందర్భంగాసి అండ్ ఎండి మాట్లాడుతూ కంపెనీకి ఉత్పత్తి, రక్షణ అనేది రెండు కళ్ళ లాంటివని సంస్థ అభివృద్ధికి, లక్ష్యసాధనకు సమిష్టిగా పని చేయాలని సూచించారు. అనేక లక్షల మందికి సింగరేణి తల్లి ఉపాధి కల్పించిందని అన్నారు. కాసి పేట గని కార్మికులు సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేస్తానని అన్నారు. సంస్థల్లో చేరిన మహిళలకు ఈపి ఆపరేటర్లుగా వెళ్లడానికి అవకాశం ఉందని, దానిని మహిళా ఉద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులు తప్పనిసరిగా విధులకు హాజరవుతూ నిర్దేశిత లక్ష్యసాధనకు కృషి చేయాలని సూచించారు. సి అండ్ ఎండి ని యూనియన్ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ జి దేవేందర్, గని మేనేజర్ నాగుల భూశంకరయ్య, ఎఐటియూసి బ్రాంచ్ సెక్రటరీ దాగం మల్లేష్, ఫిట్ కార్యదర్శి మినుగు లక్ష్మీ నారాయణ, కాసిపేట 2వ గని ఫిట్ సెక్రటరీ శ్రీనివాస్, కార్మికులు పాల్గొన్నారు.

## పెండింగ్ స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి



**ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి :** మెడికల్ సీట్ల కేటాయింపులో బిసి కేటగిరిల్లో బిసి రిజర్వేషన్లు అమలు చేయాలని బిసి విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షులు విక్రమ్‌గౌడ్ అన్నారు. గురువారం బిసి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు నరాల సుధాకర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో విక్రమ్‌గౌడ్ మాట్లాడారు. పెండింగ్‌లోని 4650 కోట్ల స్కాలర్‌షిప్ ఫీజు రిఎంబర్స్‌మెంట్స్ బకాయిలను వెంటనే విడుదల చేయాలన్నారు. రాష్ట్రంలో పేద బడుగు బలహీన వర్గాల విద్యార్థులు ఫీజులు కట్టలేక ఒత్తిడితో చదువుకు దూరమయ్యే పరిస్థితి ఎదుర్కొంటున్నారన్నారు. ఒకవైపు ఎగ్జామ్స్ దగ్గర పడుతుండగా మరోవైపు ఈ ఫీజు భారం విద్యార్థులపై పడి అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. కామారెడ్డి డిక్లరేషన్‌లో ప్రభుత్వం ఏర్పడ్డ ఆరు నెలల్లో పూర్తి ఫీజులు చెల్లిస్తామని బిసి విద్యార్థులకు షరతులు లేని విద్యనందిస్తామని ఒక రూపాయి కూడా ఇవ్వకపోవటం చాలా బాధాకరమన్నారు. పది రోజుల్లో పూర్తి పెండింగ్ ఫీజులు విడుదల చేయకపోతే ఖచ్చితంగా రాష్ట్రవ్యాప్తంగా విద్యాసంస్థల బంద్‌కు అదేవిధంగా రాష్ట్ర సచివాలయాన్ని కూడా ముట్టడిస్తామని బిసి జాతీయ సంఘం జాతీయ అధ్యక్షులు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు సుధాకర్, ఆంజనేయులు, శంకర్, సంతోష్, రాజు, రవీందర్ పాల్గొన్నారు.

క్రీడ

# హర్షిత్ రాణా ఇన్.. షమీ ఔట్!

## ఛాంపియన్స్ ట్రోఫీ ఆడే భారత తుది జట్టు



ఇంగ్లండ్‌తో మూడు వన్డేల సిరీస్‌ను క్లీన్ స్వీప్ చేసిన టీమిండియా.. కీలకమైన ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ 2025కి సిద్దమైంది. పాకిస్థాన్ వేదికగా ఫిబ్రవరి 19న ఈ మినీ వన్డే ప్రపంచకప్‌కు తెరలేవనుండగా.. టైటిలే లక్ష్యంగా టీమిండియా బరిలోకి దిగుతోంది. హైబ్రిడ్ మోడల్‌లో పాకిస్థాన్ క్రికెట్ బోర్డు(పీసీబీ) ఈ టోర్నీని నిర్వహిస్తుండగా.. భారత్ మ్యాచ్‌లు తటస్థ వేదికైన దూబాయ్‌లో జరగనున్నాయి. గ్రూప్‌లో ఉన్న భారత్.. ఫిబ్రవరి 20న బంగ్లాదేశ్‌తో జరిగే తొలి మ్యాచ్‌తో తమ క్యాంపైన్‌ను ప్రారంభించనుంది.

**జోష్‌లో టీమిండియా..**

ఫిబ్రవరి 23న జరిగే హైఓల్టేజ్ మ్యాచ్‌లో చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌తో తలపడనుంది. మార్చి 2న న్యూజిలాండ్‌తో తమ చివరి లీగ్ మ్యాచ్ ఆడనుంది. ఒకవేళ భారత్ సెమీస్, ఫైనల్ చేరితే ఆ మ్యాచ్‌లు కూడా దుబాయ్‌లోనే జరగనున్నాయి. ఈ టోర్నీ కోసం టీమిండియా అన్ని విధాల సిద్దమైంది. జట్టులోని ప్రతీ ఆటగాడు ఫామ్‌లో ఉన్నాడు. పేలవ బ్యాటింగ్‌తో ఇబ్బంది పడిన కెప్టెన్ రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ కూడా లయను అందుకున్నారు. వికెట్ కీపర్ కేఎల్ రాహుల్ కూడా టచ్‌లోకి రాగా.. శ్రేయస్ అయ్యర్, శుభ్‌మన్ గిల్ సూపర్ ఫామ్‌లో ఉన్నారు.

**భారత్ తుది జట్టు(అంచనా):**

రోహిత్ శర్మ(కెప్టెన్), శుభ్‌మన్ గిల్, విరాట్ కోహ్లీ, శ్రేయస్ అయ్యర్, కేఎల్ రాహుల్(కీపర్), అక్షర్ పటేల్, హార్దిక్ పాండ్యా, రవీంద్ర జడేజా, కుల్దీప్ యాదవ్, హర్షిత్ రాణా, మహ్మద్ షమీ/అర్ష్‌దీప్ సింగ్.

**భారత జట్టు:**

రోహిత్ శర్మ(కెప్టెన్), శుభ్‌మన్ గిల్, విరాట్ కోహ్లీ, శ్రేయస్ అయ్యర్, కేఎల్ రాహుల్(కీపర్), హార్దిక్ పాండ్యా, అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్, కుల్దీప్ యాదవ్, హర్షిత్ రాణా, మహమ్మద్ షమీ, అర్ష్‌దీప్ సింగ్, యశస్వి జైస్వాల్, రిషభ్ పంత్, రవీంద్ర జడేజా

# నేడు మహిళల ఐపిఎల్..



మహిళల ప్రీమియర్ లీగ్(డబ్ల్యూపీఎల్) 2025 సీజన్‌కు రంగం సిద్దమైంది. మరికొద్ది గంటల్లో ఈ ధనాధన్ లీగ్‌కు తెరలేవనుంది. గురువారం (నేడు) జరిగే తొలి మ్యాచ్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, గుజరాత్ జెయింట్స్ తలపడనున్నాయి. వడోదర వేదికగా రాత్రి 7 గంటలకు ఈ మ్యాచ్ ప్రారంభం కానుంది. టీమిండియా స్టార్ ప్లేయర్ స్మృతి మంధాన ఆర్‌సీబీకి సారథ్యం వహిస్తుండగా.. ఆస్ట్రేలియా స్టార్ ఆష్లీ గార్డ్‌నర్ గుజరాత్ జెయింట్స్‌ను నడిపించనుంది.

**టోర్నీ ఫార్మాట్..**

డబ్ల్యూపీఎల్‌లో మొత్తం ఐదు జట్లు డబుల్ రాబిన్ ఫార్మాట్‌లో తలపడనున్నాయి. లీగ్ దశలో ప్రతీ జట్టు తమ ప్రత్యర్థితో రెండేసి మ్యాచ్‌లు ఆడుతాయి. పాయింట్స్ అగ్రస్థానంలో నిలిచిన టీమ్ నేరుగా ఫైనల్ మ్యాచ్ ఆడనుండగా.. రెండు, మూడో స్థానంలో నిలిచిన జట్లు ఎలిమినేటర్ ఆడుతాయి. ఇందులో గెలిచిన జట్టు ఫైనల్ చేరుతోంది.
మొత్తం నాలుగు వేదికల్లో ఈ టోర్నీ జరగనుంది. వడోదరలోని కోటాంబి స్టేడియం, బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం, లక్నోలోని ఎకానా స్టేడియం, ముంబైలోని బ్రాబౌర్న్ స్టేడియం ఈ టోర్నీకి ఆతిథ్యం ఇవ్వనున్నాయి.

## అందుకే రజత్ పటీదార్‌కు కెప్టెన్సీ: ఆర్‌సిబి డైరెక్టర్



భారత పిచ్‌లపై పూర్తి అవగాహన ఉన్న ఆటగాడనే రజత్ పటీదార్‌ను రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు నూతన సారథిగా ఎంపిక చేశామని ఆ జట్టు డైరెక్టర్ మో బోబట్ తెలిపాడు. స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ కూడా ఓ ఆప్షన్‌గా ఉండటంతోనే ధైర్యంగా ఈ నిర్ణయం తీసుకున్నామని వెల్లడించాడు. అందుకు గల కారణాలను ఆ జట్టు డైరెక్టర్ మో బోబట్ తెలియజేశాడు. విరాట్ కోహ్లీకి కెప్టెన్సీ అవసరం లేదని, లీడర్‌షిప్ గ్రూప్‌లో అతను ఓ మెంబర్ అని స్పష్టం చేశాడు. 'ఆర్‌సిబి నూతన సారథిగా ఎవరిని నియమించాలనే విషయంపై తీవ్రంగా చర్చించాం. భారత్ క్రికెటర్ లేదా ఓవర్‌సీస్ ప్లేయర్ అనేది ప్రధానం అంశంగా మాట్లాడుకున్నాం. అయితే టీమిండియా ప్లేయర్ అయితేనే బాగుంటుందని రజత్ పటీదార్ వైపు మొగ్గు చూపాం. అంతేకానీ, విదేశీ ఆటగాళ్లపై ఎలాంటి వ్యతిరేకత లేదు. భారత పిచ్‌లపై పూర్తి అవగాహన ఉన్న ఆటగాడైతే మంచిదని భావించాం.



## ప్రభాస్ సినిమాలో బాలీవుడ్ సీనియర్ నటుడు

ప్రభాస్ హీరోగా హను రాఘవపూడి దర్శకత్వంలో ఓ సినిమా రూపొందుతోన్న విషయం తెలిసిందే. ఈ సినిమాలో బాలీవుడ్ సీనియర్ నటుడు అనుపమ్ ఖేర్ భాగమయ్యారు. ఈవిషయాన్ని తెలియజేస్తూ తాజాగా ఆయన ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టారు. ''ఇండియన్ చిత్ర పరిశ్రమకు బాహుబలిగా పేరుపొందిన ప్రభాస్‌తో కలిసి నా 544వ ప్రాజెక్ట్ చేయడం ఎంతో సంతోషంగా ఉంది. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై టాలెంటెడ్ హను రాఘవపూడి ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. అద్భుతమైన కథ.. జీవితంలో ఇంతకంటే ఇంకేం కావాలి ఫ్రెండ్స్'' అని ఆయన రాసుకొచ్చారు. పీరియాడికల్ యాక్షన్ డ్రామాగా ఈ సినిమా రూపుదిద్దుకుంటోంది. విభిన్నమైన కథ, భారీ బడ్జెట్‌తో సిద్ధమవుతున్న ఈ చిత్రానికి 'ఫౌజీ' అనే టైటిల్ ప్రచారంలో ఉంది. ''మీరు ఇంతవరకూ చూడని కథను చూపిస్తున్నాం. ప్రభాస్ ఉన్నారు కాబట్టి ఎన్ని అంచనాలను అయినా అది అందుకుంటుంది. ఇప్పటివరకూ ఎప్పుడూ చూడని ప్రపంచంలోకి తీసుకువెళ్తుంది. 'సీతా రామం' తర్వాత దీనిని రాయడానికే సుమారు ఏడాదికి పైగా సమయం పట్టింది. ప్రేక్షకులు తప్పకుండా సర్‌ప్రైజ్ ఫీలవుతారు'' అని ఇటీవల ఓ ఇంటర్వ్యూలో హను రాఘవపూడి తెలిపారు. ప్రభాస్‌కు జంటగా సోషల్‌మీడియా స్టార్ ఇమాన్వీ నటిస్తున్నారు. ఇమాన్వీని ఈ సినిమాలోకి ఎంచుకోవడంపై హను గతంలో మాట్లాడారు.

రీల్





## 'హిట్-3'లో మరో ఇద్దరు హీరోలు?

న్యాచురల్ స్టార్ నాని నటిస్తున్న 'హిట్3' ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటోంది. ఈ సినిమాను దర్శకుడు శైలేష్ కొలను హిట్ ఫ్రాంచైజీలో మూడో భాగంగా తెరకెక్కిస్తున్నాడు. ఇక ఈ సినిమాలో అర్జున్ సర్కార్ అనే పవర్‌ఫుల్ పాత్రలో నాని తనదైన పర్ఫార్మెన్స్‌తో ప్రేక్షకులను ఆకట్టుకునేందుకు సిద్ధమవుతున్నాడు. ఈ సినిమాను వేసవి కానుకగా రిలీజ్ చేసేందుకు చిత్ర యూనిట్ రెడీ అవుతోంది. అయితే, ఈ సినిమాకు సంబంధించి తాజాగా ఓ ఇంట్రెస్టింగ్ వార్త సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. ఈ సినిమాలో నానితో పాటు మరో ఇద్దరు యంగ్ హీరోలు కనిపిస్తారని తెలుస్తోంది. హిట్ తొలి భాగంలో నటించిన విశ్వక్ సేన్, హిట్2 హీరో అడివి శేష్ ఇప్పుడు హిట్3లో కేమియో పాత్రల్లో కనిపిస్తారని తెలుస్తోంది. దీంతో హిట్3 మూవీలో వారి ఎంట్రీ ఎప్పుడెప్పుడు ఉంటుందా అని అభిమానులు ఆసక్తిగా చూస్తున్నారు. ఇక ఈ సినిమాలో అందాల భామ శ్రీనిధి శెట్టి హీరోయిన్‌గా నటిస్తోంది.

## రిలేషన్‌షిప్‌లో వేధింపులు ఎదుర్కొన్నా

**ఐశ్వర్యా రాజేశ్**

'సంక్రాంతికి వస్తున్నాం'తో ఈ ఏడాది తెలుగులో విజయాన్ని అందుకున్నారు నటి ఐశ్వర్యా రాజేశ్. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆమె తన సినీ కెరీర్, వ్యక్తిగత జీవితానికి గురించి ఎన్నో విషయాలు పంచుకున్నారు. తన తల్లి (నటి నాగమణి) నుంచే తాను ఎంతో స్ఫూర్తి పొందానని ఆమె చెప్పారు. స్వతహాగా ఇండస్ట్రీలోకి అడుగుపెట్టి.. వచ్చిన అవకాశాల్లో నచ్చిన సినిమాలు చేసుకుంటూ ఈ స్థాయికి వచ్చినందుకు తాను ఎంతో గర్వంగా ఉన్నానని అన్నారు. 'మా అమ్మే నాకు స్ఫూర్తి. మా తల్లిదండ్రులకు మేము నలుగురు సంతానం. చిన్నతనంలోనే నా తండ్రి చనిపోయారు. అమ్మ ఒక్కరే ఎంతో కష్టపడి మమ్మల్ని పెంచింది. ఈ ప్రయాణంలో ఆమె మానసికంగా ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంది. ఆమెకు అండగా నిలబడాలనే ఉద్దేశంతోనే చిన్న వయసులోనే పార్ట్‌టైమ్ ఉద్యోగాలు చేశాను. సినిమాల్లోకి అడుగుపెట్టాను. నాకు నచ్చిన సినిమాలు ఎంచుకుంటూ ముందుకుసాగుతున్నాను. అమ్మను చూసుకుంటున్నాను. అందుకు నేను ఎంతో గర్వంగా ఉన్నా'' అని ఐశ్వర్య చెప్పారు. రిలేషన్‌షిప్ గురించి మాట్లాడుతూ.. ''లవ్ కంటే కూడా అది బ్రేకప్ అయినప్పుడు వచ్చే బాధ అంటే నాకెంతో భయం. నేను చాలా ఎమోషనల్. ప్రేమించే సమయం కంటే అది మిగిల్చిన బాధ నుంచి బయటకు రావడానికే ఎక్కువ సమయం తీసుకుంటాను. గతంలో నేను రిలేషన్‌లో ఉన్నాను. సినిమాల్లోకి అడుగుపెట్టిన కొత్తలో ఒక వ్యక్తిని ఇష్టపడ్డాను. అతడి నుంచి వేధింపులు ఎదుర్కొన్నా. దానికంటే ముందు కూడా అలాంటి ప్రేమనే చూశా. రిలేషన్‌షిప్‌లో ఎందుకు ఇలా జరుగుతుంది? అని భయపడ్డా. ప్రస్తుతానికి ప్రశాంతంగా ఉన్నా. గత అనుభవాల వల్ల ప్రేమలో పడాలంటే ఎంతగానో ఆలోచిస్తున్నా'' అని ఆమె తెలిపారు.

## కృష్ణా నదీ జలాల కేటాయింపుల్లో రాష్ట్రానికి అన్యాయం జరగనివ్వబోం

మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి



ప్రజాపక్షం/హైదరాబాద్ : కృష్ణా నదీ జలాల అంశంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాష్ట్రానికి అన్యాయం జరగనివ్వబోమని, తెలంగాణ ప్రజల హక్కులను రక్షించేందుకు ప్రభుత్వం పూర్తిస్థాయిలో కట్టుబడి ఉందని నీటిపారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాల మధ్య కృష్ణా నదీ జలాల కేటాయింపులకు సంబంధించి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ధాఖలు చేసిన పిటిషన్ డబ్ల్యూపి1230/2023 సుప్రీం కోర్టు లో గురువారం విచారణకు వచ్చిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వ అధికారులు,న్యాయ వాదులతో కలిసి మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి స్వయంగా విచారణకు హాజరయ్యారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ ఈ నెల 25వ తేదీ కల్లా అన్ని వాదనలపై షార్ట్ నోట్స్ సమర్పించాలని అదేశిస్తూ సుప్రీం కోర్టు కేసు విచారణను ఈ నెల 27వ తేదీకి వాయిదా వేసిందని తెలిపారు. సుప్రీంకోర్టు తీర్పు తెలంగాణ ప్రభుత్వం వాదనలకు మద్దతుగా నిలిచిందని, ఇది రాష్ట్ర హక్కులను రక్షించడంలో ముందడుగు అని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఎన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. ఈ నెల 19 నుంచి జరగాల్సిన బ్రజేష్ కుమార్ ట్రిబ్యునల్ విచారణ యధాతధంగా కొనసాగుతుందని వెల్లడించారు. కేసు విచారణకు తెలంగాణ ప్రభుత్వం తరపున నీటిపారుదల శాఖ మంత్రి ఎన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి,రాష్ట్ర అడ్వకేట్ జనరల్ సుదర్శన్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు ఆదిత్యనాథ్ దాస్, న్యాయవాదులు వైద్యనాథన్, గోపాల్ శంకర్ నారాయ, అంతర్రాష్ట్ర నీటి వనరుల విభాగం అధికారులు, ఒఅండ్ ఎం ఈఎన్‌సి తదితరులు హాజరయ్యారు.

## పనిమనుషులుగా చేరి.. నగల యజమాని ఇంట్లో దోపిడీ

24 గంటల్లోనే వీడిన మిస్టరీ
రూ.3 కోట్లు స్వాధీనం
ముగ్గురి అరెస్టు



ప్రజాపక్షం/హైదరాబాద్: వాళ్ల టార్గెట్ సంపన్నుల ఇండ్లు.. ముందుగా పనిమనిషి, వాచ్‌మెన్‌లుగా ఉద్యోగంలో చేరుతారు. అదును చూసుకుని హత్యలు, దోపిడీలకు పాల్పడుతారు. ఈక్రమంలోనే రెండు రోజుల క్రితం నారాయణగూడ పోలీసు స్టేషన్ పరిధిలో నగల దుకాణ యజమాని ఇంట్లో దోపిడీకి పాల్పడ్డారు. 24 గంటల్లోనే ముగ్గురు నిందితులను అరెస్టు చేసి వారి నుంచి రూ.3కోట్ల విలువైన బంగారు ఆభరణాలు, విదేశీ వజ్రాలు, నగదు స్వాధీనం చేసుకున్నారు. ఇంటి పనిమనుషులే ఈ దోపిడీకి పాల్పడినట్లు తేలిందని హైదరాబాద్ పోలీసు కమిషనర్ సివి ఆనంద్ తెలిపారు. బంజారాహిల్స్‌లోని ఐసిసిసి భవనంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈస్ట్‌జోన్ డిసిపి బాలస్వామి, అదనపు డిసిపి జె.నర్సయ్యలతో కలిసి సివి ఆనంద్ కేసుకు సంబంధించిన పూర్తి వివరాలు వెల్లడించారు. హిమాయత్‌నగర్‌కు చెందిన నగల వ్యాపారి రోహిత్ కేడియా కుటుంబం కూతురి పెళ్లి నిమిత్తం దుబాయ్‌కు వెళ్లింది. వీరి ఇంట్లో పనిమనుషులగా పనిచేస్తున్న పశ్చిమబెంగాల్‌కు చెందిన బసంతి అర్హి (40), బీహార్‌కు చెందిన సుశీల్‌ముఖియా (29), మోల్హు ముఖియా అలియాస్ మనోజ్ (35)లు ఈ నెల 10 అర్ధరాత్రి సమయంలో రోహిత్ ఇంట్లో దోపిడీకి పాల్పడింది. రూ3 కోట్ల విలువైన బంగారు ఆభరణాలు, వజ్రాలు, నగదు దోచుకెళ్లారు. ఈ మేరకు బాధితుల ఫిర్యాదు మేరకు రంగంలోకి దిగిన ఈస్ట్‌జోన్ పోలీసులు, టాస్క్‌ఫోర్స్ పోలీసులు సిసిటివి కెమెరాలను క్షుణ్ణంగా వీక్షించి నిందితులను గుర్తించారు. బుధవారం నిందితులు ఢీల్లీ వేళ్లేందుకు నాంపల్లి రైల్వే స్టేషన్‌లో ఉండగా అరెస్టు చేశారు. వీరి నుంచి దోపిడీ సొత్తు 710 క్యారెట్ల డైమండ్ జ్యువెలరీ,1.420 కిలోల బంగారు ఆభరణాలు, రూ.19,63,780 నగదు, 24 విదేశీ దేశాలకు చెందిన కరెన్సీ, 215 గ్రాముల వెండితో పాటు మొ త్తం రికవరీ చేశారు. నిందితుల్లో ఒకడైన మనోజ్ తన స్నేహితులైన మహేష్, రాహుల్‌తో కలిసి గత ఏడాది జనవరిలో దోమలగూడలో ఓ ఇంట్లో మహిళను హత్య చేసి రూ.కోటి సొత్తును దోపిడీ చేశారు. ఈ కేసులో మహేష్, రాహుల్‌ను గతంలోనే అ రెస్టు చేయగా మనోజ్ పరారీలో ఉన్నాడు. నగల యజమాని ఇంట్లో దోపిడీ కేసులో కూడా మనోజ్ నిందితుడు కావడం గమనార్హం.

## ఎసిబికి చిక్కిన దుబ్బాక ఆర్ఐ

వారసత్వభూమి పేరు మార్పిడీకి రూ.లక్ష డిమాండ్



ప్రజాపక్షం/దుబ్బాక: దుబ్బాక రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ (ఆర్ఐ) బుధవారం రాత్రి జిల్లా కేంద్రమైన సిద్దిపేటలో ఏసీబీకి పట్టుబడ్డారు. భూమి బదలాయింపు కోసం దుబ్బాక రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మన్యం నర్సింహారెడ్డి బుధవారం సాయంత్రం సిద్దిపేట జిల్లా కేంద్రంలో బిజెఆర్ సర్కిర్ వద్ద ఓ షాప్‌లో రైతు నుండి లక్ష లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఏసీబీ డీఎస్పీ సుదర్శన్ తెలిపిన వివరాల ప్రకారం...దుబ్బాక మండలం అప్పనపల్లి గ్రామానికి చెందిన రాజిరెడ్డి మరణించగా అతని పేరు మీద ఉన్న అప్పనపల్లి గ్రామ శివారులోని సర్వే నెంబర్ 257, 259, 266, 275, 287లలో 3 ఎకరాల 25 గుంటల భూమిని, కుంభం సుజాత పేరు మీదికి వారసత్వంగా పట్టా మార్పిడికి దరఖాస్తు చేసుకుంది. దుబ్బాక రెవెన్యూ కార్యాలయం చుట్టూ కాళ్లరిగేలా తిరిగింది. అధికారులు పట్టించుకోకపోవడంతో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ నర్సింహారెడ్డిని ఆశ్రయించగా, దీంతో మొదట రూ. 50వేల లంచం డిమాండ్ చేశారు. దీంతో ఆమె ఏసీబీని ఆశ్రయించింది. లంచం ఇచ్చేందుకు సుజాత అంగీకరించడంతో నర్సింహారెడ్డి ఆమెను దుబ్బాకకు రావాల్సిందిగా సూచించాడు. అక్కడ రూ.50 వేలు సరిపోవని, మరో రూ.50 వేలు కావాలని డిమాండ్ చేశారు. రూ.లక్ష తీసుకుని సాయంత్రంలోగా సిద్దిపేటకు రావాలని చెప్పాడు. బుధవారం సాయంత్రం సిద్దిపేట జిల్లా కేంద్రంలో బిజెఆర్ సర్కిర్ వద్ద ఓ షాప్‌లో రైతు నుండి లక్ష లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. దుబ్బాక తహాసీల్దార్ కార్యాలయానికి తీసుకువచ్చి కార్యాలయంలోని రికార్డులను తనిఖీ చేశారు. ఆర్ఐ నర్సింహ్మారెడ్డి ఇంట్లో సోదాలు చేయగా భారీగా నగదు, బంగారం దొరికినట్లు సమాచారం. రెవెన్యూ కార్యాలయంలో విచారణ జరిపి అరెస్ట్ చేసి హైదరాబాద్‌లోని ఏసీబీ కోర్టు నాంపల్లిలో హాజరుపరిచినట్లు తెలిపారు.

## భద్రత డొల్లా!

(మొదటి పేజీ తరువాయి)

భద్రత చర్యలు తీసుకోవాల్సిన ఇక్కడ నకిలీ ఐడి కార్డులతో కార్లతో సహా లోనికి ప్రవేశించి దర్జాగా తిరుగుతున్నా భద్రతా సిబ్బంది, నిఘా వర్గాలు పసిగట్టక పోవడం గమనార్హం. మీడియా ప్రతినిధులు సాధారణ సమయాల్లో సచివాలయంలోకి వెళ్లాలంటేనే అక్కడి భద్రతా సిబ్బంది అనుమతించరు. మంత్రుల పేషీ నుంచి ఎవరైనా రికమెండ్ చేస్తే కాని లోనికి అనుమతించారు. అలాంటి చోట చోట నకిలీ వ్యక్తులు వెళ్తున్నా భద్రతా సిబ్బంది వారిని గుర్తించకపోవడం, ప్రశ్నింకపోవడంపై పలు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సచివాలయం భద్రతా సిబ్బంది విధులు విస్మయానికి గురి చేస్తుంది. ఇప్పటి వరకు వరుసగా నాలుగు సార్లు నకిలీ అధికారుల ఉదంతాలు బయటపడ్డాయి. గతంలో కూడా ఇలాంటి ఘటనలు చోటుచేసుకున్నవి. ప్రతిసారి ఇలాంటి ఘటనలు సచివాలయంలో జరగడం అక్కడ పరిపాటిగా మారిపోయింది. ఉదంతాలు బయటపడినప్పుడు తూతూ మంత్రంగా సంబంధిత అధికారులు స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయడం..ఆ తరువాత భద్రతా చర్యలు మళ్లీ యదావిధిగా గాలికివదిలివేయడం అక్కడి భద్రతా అధికారుల వంతుగా మారి మారిపోయింది. సచివాలయంలో భద్రతా ఎలాగే ఉంటే సంఘ విద్రోహులు ఎవరైనా నకిలీ ఐడి కార్డులతో సచివాలయంలోకి ప్రవేశించి ఘోరానికి పాల్పడే అవకాశాలు కూడా లేకపోలేదనే అనుమానాలు కలుగుతున్నాయి. వారం రోజుల క్రితం ఏకంగా ఓ నకిలీ వ్యక్తి తాను తహసిల్దార్ నంటూ ఏకంగా కారుపై పెద్ద పెద్ద అక్షరాలతో రాసుకుని సచివాలయంలో నెలరోజుల పాటు తిరిగినా నిఘా వ్యవస్థలుగాని, అక్కడి భద్రతా సిబ్బందిగాని గుర్తించకపోవడం వారి డొల్లతనాన్ని గుర్తు చేస్తుంది. తాజాగా బాలకృష్ణ అనే వ్యక్తి తాను ఐఎఎస్ నంటూ నకిలీ ఐడి కార్డుతో సచివాలయంలోకి ప్రవేశించాడు. ఇలా ఇతను చాలాసార్లు వచ్చివెళ్లాడు.ఖర్మకాలి ఇతను గురువారం అధికారులకు పట్టుబడ్డాడు. సచివాలయంలో అన్ని మంత్రిత్వ శాఖలతో కలిసి సుమారు మూడు వేల మంది అధికారులు అనధికారులు విధులు నిర్వహిస్తున్నారు. వీరందరికి ఐడి కార్డులు ఉంటాయి.

**ఎస్‌పిఎఫ్ సిబ్బంది నిర్లక్ష్యం...**

సచివాలయం భద్రతను స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ (ఎస్‌పిఎఫ్) పర్యవేక్షిస్తుంది. సచివాలయంలోకి వెళ్లే ప్రవేశ గేట్ల వద్ద ఎస్‌పిఎఫ్ విధుల్లో ఉంటారు. లోనికి వచ్చిపోయే వారిని వీరే ప్రశ్నించి, వివరాలు అడిగి పంపిస్తారు. ఇంత చేస్తున్నా లోనికి నకిలీ వ్యక్తులు రావడం వీరి డొల్ల తనానికి నిదర్శనం. ఇప్పటికైనా నకిలీలు లోనికి రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్యలు తీసుకుంటే సచివాలయంకు భద్రత కల్పించినట్లవుతుంది. కంచన్‌బాగ్‌లోని రక్షణ రంగ సంస్థలోకి దశాబ్దాలు గడిచిని ఇంత వరకు ఏ నకిలీ వ్యక్తి కూడా లోనికి వెళ్లిన ఘటనలు లేవు. అక్కడ ప్రవేశ మార్గం వద్ద తీసుకుంటున్న భద్రత చర్యలను ఒకసారి పరిశీలించి అలాంటి వ్యవస్థను ఇక్కడ కూడా ప్రవేశపెడితే నకిలీలకు చెక్‌పెట్టవచ్చని పలువురు అభిప్రాయపడుతున్నారు.

## రాజ్యసభలో రభస

(మొదటి పేజీ తరువాయి)

కొనసాగిస్తూ నివేదికపై తమ అభ్యంతరాలను తొలగించడంపై నిరసన వ్యక్తం చేస్తూ ముందు వరసలకు చేరుకున్నారు. ఆందోళన చేస్తున్న వారిపై చర్యలు తీసుకుంటామన్న చైర్మన్ హెచ్చరికలనుసైతం వారు లెక్కచేయలేదు. రాష్ట్రపతి సందేశం వినిపించే సందర్భంలో సభ సరైన దిశలో కొనసాగలేదని రాజ్యసభ సభా నాయకుడు జెపి నడ్డా అసంతృప్తి వ్యక్తంచేశారు. ప్రతిపక్ష సభ్యులు సమీరుల్ ఇస్లాం, నదీమ్ ఉల్ హక్, ఎం.మొహ్మద్ అబ్దుల్లా సభలో గందరగోళం, అంతరాయం సృష్టించారని చైర్మన్ ధనకడ్ అన్నారు. అనంతరం ప్రతిపక్ష నాయకుడు ఖర్గే మాట్లాడేందుకు అనుమతించారు. ఖర్గే మాట్లాడుతూ వక్ఫ్ బిల్లుపై ప్రతిపక్ష ఎంపీల అసమ్మతి నివేదికను జెపిసి తుది నివేదికనుంచి తొలగించారన్నారు. 'బిల్లుపై కమిటీ అందజేసిన నివేదికనుంచి పలువురు సభ్యులు తెలిపిన అభ్యంతరాలను తొలగించారు. మెజారిటీ సభ్యుల అభిప్రాయాలను మాత్రమే పొందుపరచడం ద్వారా నివేదికను నిర్వీర్యం చేయడం సరికాదు. ఇది ఆక్షేపణీయం, అప్రజాస్వామికం' అన్నారు. ఇది నకిలీ నివేదిక అని, దీనిని ఉపసంహరించుకోవాలన్నారు. సభ్యులు వ్యక్తిగత ప్రయోజనాలకోసం అసమ్మతి తెలుపడం లేదని, ఒక సామాజిక వర్గానికి జరుగుతున్న అన్యాయంపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారని ఖర్గె అన్నారు. ఇందుకు డిఎంకె సభ్యుడు తిరుచి శివ, ఆప్ సభ్యుడు సంజయ్ సింగ్‌కూడా మద్దతు తెలిపారు.
కేంద్ర పర్యావరణ శాఖ మంత్రి భూపిందర్ యాదవ్ మాట్లాడుతూ నిబంధనల ప్రకారం నివేదికలోని పదాలు, అభిప్రాయాలు, వాక్యాలను తొలగించే అధికారం కమిటీ చైర్మన్‌కు ఉంటుందన్నారు. కాగా మంత్రి కిరణ్ రిజిజు మాటాడుతూ నివేదికలోని అంశాలను యథాతథంగా సభలో ప్రవేశపెడతామని, అందులోని ఏ అంశాన్ని తొలగించలేదని చెప్పారు. 'నివేదికలోని ఏ భాగాన్ని తొలగించలేదు. సభను తప్పుదారి పట్టించవద్దు. ప్రతిపక్షాలు అనవసరంగా సమస్యను సృష్టిస్తున్నాయి. వారి ఆరోపణ సత్యదూరం' అన్నారు. కేంద్ర మంత్రులు భూపిందర్ యాదవ్, నిర్మల సీతారామన్ ప్రతిపక్షాలు సభను తప్పుదోవ పట్టించేందకు ప్రయత్నిస్తున్నాయనడంతో అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య మరోసారి తీవ్ర వాగ్వాదం నెలకొన్నది.
కాంగ్రెస్ ఎంపి సయ్యద్ నాసిర్ హుస్సేన్ తన అసమ్మతి వ్యాఖ్యలను సవరించారని పేర్కొన్నారు. మైనారిటీ వ్యవహారాల మంత్రి కూడా అయిన రిజిజు సభను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. తృణమూల్ కాంగ్రెస్ సభ్యుడు సాకేత్ గోఖలే మాట్లాడుతూ ఇది మతపరమైన అంశం కాదని, రాజ్యాంగానికి సంబంధించిన విషయమని, నివేదికలోని అంశాలను తొలగించారా లేదా అన్న స్పష్టత ఇవ్వాలని మంత్రి కిరణ్ రిజిజును డిమాండ్ చేశారు. నివేదికలోని అన్ని అంశాలు యథాతథంగా ఉన్నాయని, దేనినీ తొలగించలేదని మంత్రి స్పందించారు. దీనితో ప్రతిపక్షాలు వాకౌట్ చేయగా, సభలో ప్రశ్నోత్తరాల సమయం కొనసాగించారు.

**లోక్‌సభలోనూ జెపిసి నివేదిక ..**

వక్ఫ్ బోర్డు సవరణ బిల్లుపై జెపిసి నివేదికను గురువారం లోక్‌సభలోనూ సమర్పించారు. దీనిపై ప్రతిపక్షాలు నిరసన వ్యక్తంచేయగా నివేదకనుంచి తొలగించిన అంశాలను తిరిగి పొందుపరచడానికి తమకు అభ్యంతరం లేదని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రకటించారు. జెపిసి చైర్మన్ జగదాంబిక పాల్ వక్ఫ్ నివేదికను సభకు సమర్పించగా, ప్రతిపక్షాలు పెద్దపెట్టున అభ్యంతరాలు వ్యక్తం చేశాయి. నివేదికలో తమ అభిప్రాయాలను తొలగించారని ప్రతపక్షాలు ఆరోపించాయి. ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నట్టు నివేదికలో తొలగించిన అంశాలను నిబంధనలను అనుసరించి తిరిగి పొందుపరిచేందుకు తమకు ఎలాంటి అభ్యంతరం లేదని షా అన్నారు. జెపిసి ముసాయిదా నివేదికను కమిటీ జనవరి 30న లోక్‌సభ స్పీకర్ ఓమ్ బిర్లాకు సమర్పించింది. దానిని గురువారం సభలో ప్రవేశపెట్టారు. కాగా వక్ఫ్ బోర్డును నిర్వీర్యం చేసేందుకు బిజెపి ప్రయత్నిస్తోందని ప్రతిపక్షాలు ఆరోపించాయి.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Baddam Yella Reddy Bhavan, Ganesh Nagar, KARIMNAGAR - 505001 Telangana State. RNI TELTEL /2018/76746, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com